# క్రాంతి

సి.పి.ఐ (మావోయిస్టు) ఎ.పి. ఎస్.టి. ఎ.ఒ.బి కమిటీల అధికార పత్రిక

సంపుటి : 31 సంచిక : 4 జూలై - ఆగస్టు 2007 వెల : ఐదు రూపాయలు


### లోపలి పేజీల్లో


అమరుల సంస్మరణ ........ 9

ఊర్పల్‌మెట్ట, తాడిమెట్ల ఘటనలు ........ 17

లాటిన్ అమెరికా పోరాటాలు ....... మధ్య పేజీలో

వాకపల్లి అత్యాచారాలు ........ 28

చుండూరు తీర్పు ........ 30

తస్లీమాపై దాడిని ఖండిస్తూ ........ 32


# భూమి పోరు విముక్తి పోరు కావాలి!

ఆంధ్రప్రదేశ్‌లో వామపక్షాల ఆధ్వర్యంలో ఇటీవలి కాలంలో జరుగుతున్న భూపోరాటాలూ, అందులో భాగంగా ముదిగొండ కాల్పుల్లో కోల్పోయిన ఏడు ప్రాణాలూ రాష్ట్రంలోని భూ సమస్యను మరోసారి చర్చనీయాంశం చేశాయి. ఈ పోరాటాల్లో నిర్బంధానికి వెరవకుండా విస్తృతంగా కదులుతున్న ప్రజలను చూస్తే ఈ సమస్య తీవ్రత అర్థమవుతుంది.

రాష్ట్రంలో దాదాపు 70 శాతం ప్రజలు గ్రామీణ ప్రాంతాల్లోనే నివసిస్తున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే వీరిలో భూమిలేని వ్యవసాయ కార్మికులు 40 శాతం. అంటే దాదాపు రెండు కోట్లకు పైన వుంటుంది వీరి సంఖ్య. 25 శాతం అంటే దాదాపు కోటికి పైగా ప్రజలకు ఇండ్లు లేవు. ఇండ్ల లేమి సమస్య పట్టణాల్లో మరింత తీవ్రంగా ఉంది. పెరుగుతున్న పట్టణీకరణ నేపథ్యంలో ఈ సమస్య అనేక రెట్లు తీవ్రమవుతోంది.

భూమి సమస్య ప్రజల బతుకుదెరువు సమస్య మాత్రమే కాదు, అది గూడు సమస్య మాత్రమే కాదు. అది ప్రజల అస్తిత్వానికీ, ఆత్మగౌరవానికీ, అధికారానికీ సంబంధించిన సమస్య. సామాజిక సంబంధాల సమస్య కూడా. అందుకే రాష్ట్రంలో భూ సమస్య నిరంతరం రగులుతూనే వుంది.

### భూపోరాట వారసత్వం

వ్యవసాయ ప్రధాన దేశం కనుక సహజంగానే ఇక్కడ భూమి అతి ప్రధానమైన వనరుగా వుంటుంది. ఇది వర్గ సమాజం కనుక ఆ భూమిని గుప్పిట పెట్టుకునే వర్గమూ ఉంటుంది. అందుకోసం నిరంతర పోరాటమూ వుంటుంది. అందుకే భారతదేశానికి భూమి కేంద్రంగా జరిగిన రైతాంగ పోరాట చరిత్ర ఎంతో వుంది. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు కూడా అటువంటి పోరాట చరిత్ర వుంది.

అధికార మార్పిడికి ముందూ, తర్వాతా భూమిపై హక్కు కోసం తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల్లో వీరోచిత రైతాంగ పోరాటాలు జరిగాయి. దేశవ్యాప్తంగానూ ఇటువంటి పోరాటాలు జరిగాయి.

ఈ పోరాటాల నేపథ్యంలోనే 1928లో నెహ్రూ భూస్వామ్యాన్ని అంతం చేయాలనీ, రైతాంగం మీదనే ఈ దేశ భవిత ఆధారపడి ఉందనీ 'పిలుపు' నిచ్చాడు. 1931లో కాంగ్రెస్ పార్టీ జమీందారీ వ్యవస్థ రద్దు చేయాలని తీర్మానించింది. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్‌కు భూసంస్కరణలే ప్రధాన ఎజెండా అయినాయి. నెహ్రూ పిలుపు అయినా, కాంగ్రెస్ తీర్మానమయినా, దాని ఎన్నికల ఎజెండా అయినా మోసపూరితమైనవే. భూస్వామ్య, సామ్రాజ్యవాద ప్రయోజనాలను కాపాడడానికి ఉనికిలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ భూస్వామ్య, సామ్రాజ్యవాద ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఒక్క అడుగు కూడా అటూ ఇటూ వేసే ప్రసక్తి లేదు. అయితే ప్రజలను భ్రమల్లో పెట్టడానికి ఈ మోసపూరిత వైఖరి తీసుకోవాల్సి వచ్చిందంటే ఆనాటి పోరాటాల ఉధృతిని అర్థం చేసుకోవచ్చు.

ఈ పోరాటాల ఉధృతిని కొనసాగిస్తూనే నాటి నిజాం నిరంకుశ పాలనకూ, కరడుగట్టిన భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా తెలంగాణా పోరాటం మొదలైంది. భూమికీ, అధికారానికీ ఉన్న సంబంధం రీత్యా ఈ పోరాటం రాజ్యాధికార పోరాటంగా ముందుకొచ్చింది. అందుకే ఈ పోరాటంలో విప్లవ ప్రజానీకం 10 లక్షల ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవడంతో పాటు 3 వేల గ్రామాల్లో ప్రజా రాజ్యాధికారాన్ని కూడా స్థాపించుకున్నది.

ఈ పోరాటాన్ని భారత ప్రభుత్వం తీవ్రమైన హింసాకాండను ప్రయోగించి అణచివేసింది. అయితే ఈ పోరాట స్ఫూర్తి మాత్రం అణిగిపోలేదు. రగులుతున్న భూ సమస్య చల్లారి పోలేదు. అందుకే ఈసారి భూ సమస్య మరింత స్పష్టమైన అవగాహనతో నక్సల్బరీ పోరాటంగా ముందుకొచ్చింది. నక్సల్బరీ, భూపోరాటాల చరిత్రలో ఒక కీలక మలుపు. దున్నేవారికే భూమిపై హక్కును కల్పించే నూతన ప్రజాస్వామిక విప్లవానికి సరైన పంథాను రూపొందించింది 'నక్సల్బరీ'.

నక్సల్బరీ పిలుపును దేశంలో మొట్టమొదటగా అందుకున్నది ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళ ఆదివాసీ రైతాంగం. అప్పులిచ్చి దొంగలెక్కలు కట్టి తమ భూములను గుంజుకున్న భూస్వామ్య, షావుకార్ల దోపిడీకి వ్యతిరేకంగా మూడు సంవత్సరాలు వీరోచితంగా సాగింది శ్రీకాకుళ పోరాటం.

పాలకులు నక్సల్బరీ శ్రీకాకుళాలను తీవ్ర నిర్బంధం ప్రయోగించి అణచివేశారు. కానీ ఈ పోరాటాలు ముందుకు తెచ్చిన ఎజెండాను మాత్రం అణచలేకపోయారు. ఆ ఎజెండాను ముందుకు తీసుకుపోయే క్రమంలో జగిత్యాల, సిరిసిల్లా రైతాంగ పోరాటం ముందుకు వచ్చింది. ఈ పోరాటం తీవ్ర నిర్బంధాన్ని సహితం ఎదుర్కుంటూ 'దున్నేవారికే భూమి' నినాదంతో వ్యవసాయక విప్లవాన్ని ముందుకు తీసుకుపోతూ నేటికీ అప్రతిహతంగా ముందుకు సాగుతోంది.

## భూసంస్కరణలూ వాటి అమలు

భూ పోరాటాలను ఎప్పటికప్పుడు ప్రభుత్వాలు తీవ్రంగా అణచివేస్తున్నప్పటికీ ఆ పోరాటాలను తిరిగి తలెత్తకుండా నిరోధించడం కోసం అవి భూసంస్కరణలకు సంబంధించిన కొన్ని చట్టాలను చేస్తున్నాయి.

జాగీర్దార్లకూ, దేశముఖ్‌లకూ వ్యతిరేకంగా సాగిన తెలంగాణ పోరాటం తర్వాత, ప్రభుత్వం ఈ వ్యవస్థలను రద్దు చేసింది. కౌలుదారులకు కొన్ని హక్కులను కల్పిస్తూ కౌల్దారీ చట్టాన్ని తెచ్చింది. ఈ చట్టం 1956 నుంచీ అమలయింది. ఈ చట్టం ప్రకారం భూయజమాని భూమిని అమ్మాలంటే కౌలుదారుకే మొదటి ప్రాధాన్యతనివ్వాలి. ఆరు సంవత్సరాలు వరుసగా కౌలు చేస్తున్న రైతును రక్షిత కౌలుదారుగా గుర్తించాలి. రక్షిత కౌలుదారును భూయజమాని తొలగించడం సులభంగా సాధ్యం కాదు, కౌలు రైతుకు కూడా రుణ సదుపాయం కల్పించాలి. అయితే కౌలుదార్లను రెవెన్యూ రికార్డుల్లో నమోదుచేసే కార్యక్రమాన్నే ప్రభుత్వం చేపట్టని కారణంగా అనేక మంది కౌలు రైతులు, తమ హక్కులకు దూరంగానే ఉండిపోయారు. కరడుగట్టిన భూస్వామ్య వ్యవస్థ అమలులో ఉండగా ఒక సాధారణ కౌలు రైతు భూస్వామికి వ్యతిరేకంగా తన హక్కుకు సంబంధించిన సాక్ష్యాధారాలను నిరూపించుకోవడం సాధారణమైన విషయం కాదు. అందుకే ఈ చట్టం ఆచరణలో ఏ మాత్రం అమలుకాలేదు.

శ్రీకాకుళ పోరాటం తర్వాత భూ సమస్యకు సంబంధించి రెండు ముఖ్యమైన చట్టాలు వచ్చాయి. అవి 1/70, భూగరిష్ట పరిమితి చట్టాలు. ఆదివాసేతరుల నుండి ఆదివాసీల భూమిని రక్షించడం కోసం తెచ్చిన చట్టం 1/70, ఈ చట్టం ప్రకారం షెడ్యూల్డ్ ప్రాంతాల్లో భూమి బదిలీ చేయడాన్ని నిషేధించారు. అయితే ఈ చట్టం అమలులో కూడా వైఫల్యాలు కొనసాగుతున్నాయి. ఇప్పటికీ ఆదివాసేతరులు రకరకాలుగా ఆదివాసీల భూమిని అక్రమంగా పొందుతూనే ఉన్నారు. అంతేకాదు ఈ ప్రాంతాల్లో ఉన్న గనులను ఎవరికీ లీజుకివ్వడానికి వీలులేదు. ప్రభుత్వానికి కూడా అలా లీజుకిచ్చే అధికారం లేదు. కానీ ప్రభుత్వాలు ఇక్కడి విలువైన గనులను బహుళజాతి కంపెనీలకు ధారాదత్తం చేసే ప్రయత్నాల్ని చూస్తూనే ఉన్నాం. తాజాగా ఈస్ట్ డివిజన్‌లోని బాక్సైట్ గనులను కూడా బహుళజాతి కంపెనీలకు అప్పగించే ప్రయత్నాల్ని చూస్తున్నాం.

భూగరిష్ట పరిమితి చట్టాన్ని (సీలింగ్ చట్టాన్ని) 1973లో తెచ్చారు. ఈ చట్టం భూమికి పరిమితిని విధించింది. ఈ పరిమితికి మించి వున్న భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పేదలకు పంచాలి. ఈ చట్టం రాబోతుందని ప్రభుత్వం ముందే ప్రచారం చేయడం వల్ల భూస్వాములు జాగ్రత్తపడ్డారు. రకరకాలుగా తమ భూములను భద్రపరుచుకున్నారు. అలా భద్రపరుచుకోగా మిగిలిన భూమి దాదాపు 16 లక్షల ఎకరాలు ఉందని ప్రభుత్వం లెక్కలు చెప్పింది. అయితే ఆచరణలోకి వచ్చేప్పటికి దాదాపు 8 లక్షల ఎకరాల భూమిని మాత్రమే ప్రభుత్వం స్వాధీనం చేసుకొంది. అందులో నుంచి దాదాపు 5 లక్షల ఎకరాల భూమిని పంచానని చెప్పింది. ఈ పంపిణీలో కూడా ఎన్నో అవకతవకలు జరిగాయి. అనేకమందికి పట్టాలు చేతికి

వచ్చాయిగానీ భూములు దొరకలేదు. మరికొందరికి భూములిచ్చారు గానీ పట్టాలివ్వలేదు. పట్టాలతో సహా ఇచ్చిన భూములు అత్యధిక శాతం వ్యవసాయ యోగ్యం కాని భూములే. స్వల్పంగా దొరికిన వ్యవసాయ భూములు కూడా ఇప్పుడు రైతుల చేతుల్లో లేవు. తిరిగి భూస్వాములే వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఇట్లా చూస్తే ఎంతో ఆర్భాటంగా తెచ్చిన భూ గరిష్ట పరిమితి చట్టం కాగితాలకే పరిమితమైందని అర్థమవుతోంది. ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న 8 లక్షల ఎకరాల్లో 3 లక్షల ఎకరాల భూమి ట్రిబ్యునల్ కోర్టులలో చిక్కుకుంది. ఏళ్లకు ఏళ్లు గడుస్తున్నా ఈ భూముల సంగతి తేలలేదు. ఈ భూముల్ని కూడ భూస్వాములే సాగుచేసుకుంటున్నారు.

## చట్టాలెందుకు అమలుకాలేదు?

ప్రజలను భ్రమల్లో పెట్టడానికో, ప్రజల పోరాటాల మీద నీళ్లు చల్లడానికో కొన్ని చట్టాలను చేయడమూ, ఆ పోరాటాలు తగ్గుముఖం పట్టగానే ఆ చట్టాలను పక్కన పడేయడం బూర్జువా ప్రజాస్వామ్య నీతి. అందుకే మన దేశంలో ప్రజల ప్రయోజనార్థం చేసిన ఏ చట్టమూ అమలుకానట్టే భూసంస్కరణల చట్టాలూ అమలుకాలేదు.

అధికార మార్పిడి తర్వాత పరిపాలనలోకి వచ్చింది భూస్వామ్యవర్గమే. కనుక ఆ వర్గం తన ప్రయోజనాలకు భంగం కలిగే చట్టాలను చేస్తుందని కానీ, ఒకవేళ తప్పనిసరి పరిస్థితిలో చట్టాలు చేసినా వాటిని అమలు పరుస్తుందని కానీ మనం అనుకోలేం. అందుకే ప్రజా పోరాటాలపై నీళ్లు చల్లడానికి భూసంస్కరణ చట్టాలు చేసినా వాటిని అమలుచేసే ఉద్దేశం పాలకవర్గాలకు లేనేలేదు, కనుక అవి అమలుకాలేదు.

ఈ చట్టాలు అమలుకాకపోవడంలో పరిపాలనా వ్యవస్థ పాత్ర కూడా ముఖ్యమైనదే. ప్రభుత్వం చేసే ఏ చట్టాన్నయినా అమలు చేసే బాధ్యత పరిపాలనా వ్యవస్థదే. ఈ వ్యవస్థలోని అత్యధిక శాతం ఉన్నతాధికారులు, కరుడుగట్టిన భూస్వామ్య వర్గం నుంచి వచ్చిన వారే కావడంతో వారు తమ వర్గ ప్రయోజనాలకు బలంగా కట్టుబడి ఉంటారు. కనుక చట్టాలను అమలు చేయడంలో ఎటువంటి చిత్తశుద్ధినీ ప్రదర్శించరు.

మనది స్వతంత్ర ప్రతిపత్తి కల్గిన న్యాయవ్యవస్థ అని చెప్పడం ఉత్త బూటకం. వర్గ సమాజంలోని ఏ అంగమైనా అధికార వర్గానికే ఊడిగం చేస్తుంది. మన న్యాయవ్యవస్థ దానికి ఎంత మాత్రమూ అతీతం కాదు. కనుక భూసంస్కరణలకు సంబంధించిన అనేక వివాదాలలో కోర్టులు భూస్వాముల పక్షం వహించాయి. మరెన్నో వివాదాలు ఏండ్ల తరబడి కోర్టుల్లో నలుగుతున్నాయి. అవి పరిష్కారం కావడమూ, భూమి పేదల సొంతం కావడమూ కలగా మిగిలిపోయే విషయమే. ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరగలేక పేదలు మిన్నకుండి పోయే పరిస్థితి వస్తోంది.

చట్టాల్లోని లొసుగుల గురించి కూడా ఇక్కడ మాట్లాడుకోవాలి. ప్రజల ప్రయోజనార్థం చట్టాలు చేయడంలో పాలకవర్గాలకు ఎటువంటి చిత్తశుద్ధి ఉండదు కనుక ఈ చట్టాలను అనేక లొసుగులతో చేస్తాయి. భూసంస్కరణ చట్టాలకు కూడా ఈ విషయంలో ఎటువంటి మినహాయింపూలేదు. ఈ లొసుగులను భూస్వాములు చక్కగా వినియోగించుకుంటున్నారు. ఎవరైనా ఒకరిద్దరు చిత్తశుద్ధి కల్గిన అధికారులు ఉంటే కూడా, చట్టాలను అమలు చేయడంలో ఈ లొసుగులు వారిని అశక్తులను చేస్తున్నాయి.

## నూతన ఆర్థిక విధానాల నేపథ్యంలో పెరుగుతున్న భూసమస్య

రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత నూతన ఆర్థిక విధానాల ప్రక్రియ వేగవంతం అవడం తెల్సిందే. వ్యవసాయాన్ని అన్ని ప్రభుత్వాలూ మొదటినుండీ నిర్లక్ష్యం చేస్తూనే వున్నాయి. దేశ అభివృద్ధికీ వ్యవసాయానికీ ఉన్న సంబంధాన్ని పట్టించుకోవడం లేదు. చంద్రబాబు మరో అడుగు ముందుకు వేసి అసలు వ్యవసాయమే అవసరం లేదన్నాడు. ఐ.టి రంగం, ప్రయివేటీకరణ, ప్రపంచ బ్యాంకు అప్పులే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పయనింపచేస్తాయన్నాడు. ఇక ఇటువంటి పాలనలో పేదలకు భూమిని పంచడం అనే ఆలోచనకైనా ఆస్కారమెక్కడ వుంటుంది?

చంద్రబాబు వ్యవసాయాన్ని పట్టించుకోవడమంటూ ఏదన్నా ఉందంటే అది కార్పోరేట్ వ్యవసాయం గురించి ప్రచారం చేయడం మాత్రమే. దేశీయ వ్యవసాయాన్ని తోసిరాజని కార్పోరేట్ వ్యవసాయాన్ని ప్రచారం చేశాడు. కార్పోరేట్ వ్యవసాయానికి పెద్ద ఎత్తున భూముల కేంద్రీకరణ అవసరం. వ్యవసాయాన్ని, అందులోనూ చిన్న కమతాల్లో జరిగే వ్యవసాయాన్ని నిరుత్సాహపరిచే పాలకులు పేదలకు భూములు పంచడానికి ఎలా సిద్ధపడుతారు?

అధికారమార్పిడి తర్వాత నుంచీ ప్రభుత్వాలు వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేస్తూ వేల వేల ఎకరాల వ్యవసాయ భూములు పరిశ్రమల స్థాపన కోసమంటూ పెట్టుబడుదారులకు కట్టబెడుతున్నాయి. ఈ క్రమం నూతన ఆర్థిక విధానాలు ప్రారంభమైన తర్వాత మరింత

పెరిగింది. చంద్రబాబు హయాంలో ప్రభుత్వం అనేక విదేశీ, స్వదేశీ పరిశ్రమలకూ, ఎక్స్‌పోర్ట్ జోన్లకూ వ్యవసాయ భూములను కారుచౌకగా కట్టబెట్టింది.

ప్రపంచ బ్యాంకు ఎజెండాకు వ్యతిరేకమంటూ ప్రచారం చేసుకొని అధికారంలోకి వచ్చిన రాజశేఖర్‌రెడ్డి కూడా అదే ఎజెండాను కొనసాగిస్తున్నాడు. కనుక వేల ఎకరాల భూమి పరిశ్రమాధిపతుల కబ్జాల్లోకి పోతూనే వుంది. ఈ మధ్య కాలంలో వేలాది ఎకరాలు సెజ్‌ల ఖాతాలోకి పోతున్నాయి. సరుకులను వేగంగా మార్కెట్‌కు తరలించడంలో భాగంగా వేస్తున్న నాలుగు లైన్ల, ఎనిమిదిలైన్ల రోడ్లూ, రింగు రోడ్లూ, తవ్వుతున్న కాలువలూ, కడుతున్న విమానాశ్రయాలు...... ఇవన్నీ వేలాది ఎకరాల భూముల్ని మింగేస్తున్నాయి. ఇలా పరిశ్రమలూ, సెజ్‌లూ, రవాణా మార్గాలూ మింగుతున్నవన్నీ పేదల భూములే కావడం యాదృచ్ఛికం కాదు. అభివృద్ధి కోసమే ఈ భూములను లాక్కుంటున్నామని ప్రభుత్వాలు చెప్తున్నాయి. మరి 'అభివృద్ధి'కి భూస్వాముల, ధనికుల భూములు మాత్రం ఎందుకు పనికి రాకుండా పోతున్నాయో ప్రభుత్వాలే చెప్పాలి. వీటన్నింటివల్ల ప్రయోజనాలు పొందుతున్నది సంపన్న వర్గాలయితే భూముల్ని కోల్పోతున్నది మాత్రం పేదలు. ఇట్లా భూముల్ని కోల్పోతున్న ప్రజలకు దక్కుతున్నది నామమాత్రపు నష్టపరిహారమే. అనేక సందర్భాల్లో అదీ ఉండడం లేదు.

ఇలా వేల వేల ఎకరాలు పెట్టుబడీదార్ల, సామ్రాజ్యవాదుల కబ్జాలోకి వెళ్లడం వల్ల వ్యవసాయ భూములు తగ్గిపోవడమే కాదు, ఇళ్ల స్థలాలకు కూడా తీవ్రమైన కొరత ఏర్పడింది.

వ్యవసాయ రంగంలో కొనసాగుతున్న సంక్షోభం వల్ల పట్టణాలకు వలసపోవడం పెరగడంతో పట్టణాల్లో జనసాంద్రతతో పాటు ఇళ్ల సమస్య పెరుగుతున్నది. చంద్రబాబు పాలనలోనే ఈ సమస్య తీవ్రరూపం దాల్చడం మొదలైంది. దీంతో భూమికి కృత్రిమ డిమాండ్ ఏర్పడి, రియల్ ఎస్టేట్ వ్యాపారం విచ్చలవిడిగా విస్తరించింది. అనేకమంది రాజకీయ నాయకులూ, ప్రభుత్వ, పోలీసు ఉన్నతాధికారులు ఈ వ్యాపారంలో ప్రవేశించి పేదల భూములు అక్రమంగా కాజేస్తూ కోట్లు సంపాదిస్తున్నారు. వేలాది రూపాయలు పెట్టి కొనుక్కున్న మధ్యతరగతి ప్రజల భూముల్ని సహితం కాజేస్తున్నారు. ప్రశ్నించిన వారిని హత్య చేయడానికి కూడా వెనుకాడ్డం లేదు. ఇలా రియల్ ఎస్టేట్ వ్యాపారం భూ సమస్యను మరింత జటిలం చేసింది.

తాము ప్రవేశపెడుతున్న భూసంస్కరణ చట్టాలు సామాజిక అంతరాలను తగ్గిస్తాయని పాలకులు గొప్పలు చెప్పుకున్నారు. కానీ భూ గరిష్ఠ పరిమితి చట్టం వచ్చిన తర్వాత భూస్వాములూ, పెట్టుబడిదారుల వద్ద భూమి మరింత పెరిగింది. దానితో సామాజిక అంతరాలూ పెరిగాయి. భూసంస్కరణలను అమలు చేస్తామని చెప్తున్న ప్రభుత్వాలే ఇట్లా వీరు భూములు పెంచుకోవడానికి అండగా నిలుస్తున్నాయి. తాము కోరుకున్న భూములను తామే సంపాదించుకోవాల్సిన అవసరం పెట్టుబడిదారులకు ఎంత మాత్రం లేదు. ఆ పని ప్రభుత్వమే చేసి పెడుతుంది. పేదలు చారెడు నేలడిగితే తుపాకీ తూటాలను కురిపిస్తున్న ప్రభుత్వం, పెట్టుబడిదారులు కోరుకున్న వేల వేల ఎకరాల భూముల్ని మాత్రం తానే స్వయంగా ఇస్తోంది. ఆ భూమి ప్రయివేటు వ్యక్తులకు చెందినదయితే ప్రభుత్వమే ఆ భూమిని కొని ఇస్తోంది. అట్లా కొంటున్న భూములకు ప్రభుత్వం ఇస్తున్న ధర చాలా నామమాత్రంగా ఉంటోంది. పెట్టుబడిదారులకు భూమిని సమకూర్చడానికి ప్రభుత్వం తాను తయారు చేసిన చట్టాల్నే తుంగలో తొక్కుతోంది. అసైన్డ్ భూములను చట్ట విరుద్ధంగా సేకరిస్తోంది. నిరుపయోగంగా వున్న అసైన్డ్ భూములను ప్రభుత్వం లబ్దిదారు నుంచి వెనక్కి తీసుకుంటే, దాన్ని తిరిగి మరొక అసైనీకే ఇవ్వాలన్న నిబంధనను కాలరాచి, ప్రభుత్వం ఆ భూములను దళారీ బూర్జువా వర్గానికీ, బహుళజాతి సంస్థలకు అప్పజెబుతున్నది. ఈ క్రమంలో కాస్తో కూస్తో భూమి కల్గిన పేద మధ్యతరగతి రైతాంగం వున్న భూమిని కోల్పోయి వ్యవసాయ కూలీలుగా మారుతున్నారు.

రైతులు తమ భూముల్ని ఇవ్వడానికి సిద్ధపడకపోతే ప్రభుత్వం తూటాలు కురిపించయినా, రక్తాలు పారించయినా ఆ భూములను గుంజుకొని మరీ పెట్టుబడిదారులకు కట్టబెడుతోంది. అంటే భూమిలేని ప్రజలు భూమికోసం, కాస్తో కూస్తో భూమి ఉన్న ప్రజలు ఆ భూమిని కాపాడుకోవడం కోసమూ రక్తాన్ని ధారపొయ్యవల్సే వస్తోంది.

ఇలా ఏదో రకంగా గుంజుకొని పరిశ్రమలకు కట్టబెడుతున్న ఈ వేలాది ఎకరాల భూములు, ఉత్పత్తి రంగానికి ఉపయోగపడుతాయని మనమెవ్వరం భ్రమపడనవసరం లేదు. పరిశ్రమల పేరుతో కారుచౌకగా సేకరించిన భూమితో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న వైనం మనం చూస్తున్నదే. ఈ మధ్య కాలంలో సెజ్‌ల పేరుతో సేకరిస్తోన్న వేలాది ఎకరాల భూమిలో అధిక భాగాన్ని అధికారుల విలాసవంతమైన ఇళ్ల కోసం, వారి సరదాలు తీర్చే గోల్ఫ్‌కోర్టులూ, క్రీడా మైదానాలు, పార్కులు వంటి వాటి కోసం ఉపయోగిస్తున్నారని వింటున్నాం. అంటే పేద ప్రజలకు నిలువ నీడ లేకుండా చేస్తున్న ప్రభుత్వం దేశీయ, విదేశీయ సంపన్నులకు మాత్రం విలాస గృహాలను సమకూర్చుతోంది.

## భూమి సమస్యపై అధికార పార్టీలన్నింటి వైఖరి ఒక్కటే

అధికార మార్పిడికి ముందు భూసంస్కరణలే ప్రధాన ఎజెండాగా ప్రకటించింది కాంగ్రెస్ పార్టీ. కానీ తర్వాత భూసంస్కరణలు అమలు చేస్తే సామాజిక ఘర్షణలు చెలరేగుతాయన్నాడు నెహ్రూ. అంటే భూస్వాములు ఘర్షణలకు దిగుతారనేది అతని ఉద్దేశం. అట్లా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే, భూసమస్య పట్ల గతంలో అది కల్పించిన భ్రమలను పటాపంచలు చేస్తూ, తన వైఖరిని బయటపెట్టుకుంది. కాంగ్రెస్ పార్టీ నుంచి ఇంతకంటే ఆశించలేం కూడా. బ్రిటీష్ పాలకుల తర్వాత దేశంలో అధికారంలోకి వచ్చింది బ్రిటీష్ వాళ్లతో కుమ్మక్కయిన భూస్వామ్యవర్గమే. ఆ భూస్వామ్య వర్గానికి కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి. ఆ పార్టీలో నాయకత్వ స్థానంలో ఉన్నది స్వయంగా భూస్వాములే. రాష్ట్రంలోని ఏ కాంగ్రెస్ నేతను చూసినా ఈ విషయం స్పష్టంగా అర్థమై తీరుతుంది. ఉదాహరణకు రాజశేఖర్ రెడ్డికి వేల ఎకరాల భూములున్నాయి. ఈ మధ్య 1200 ఎకరాల ఇడుపులపాయ ఎస్టేట్‌ను అతను ప్రభుత్వానికి స్వాధీనం చేసి అపర వినోభా భావేగా కాంగ్రెస్ నేతల ప్రశంసలను అందుకున్నాడు. కానీ తమ పార్టీనే చేసిన సీలింగ్ చట్టాన్ని అతిక్రమించి అన్ని వందల ఎకరాల భూమిని తన వద్ద ఉంచుకున్నాడంటే సీలింగ్ చట్టాన్ని పాలకులు ఎంతగా తుంగలో తొక్కుతున్నారో అర్థమవుతుంది. ఇటువంటి భూస్వాముల పార్టీ భూసంస్కరణలను అమలుచేయడం అసాధ్యమైన విషయం.

మావోయిస్టు పార్టీతో చర్చల సమయంలోనూ దాని వైఖరి స్పష్టంగా బహిర్గతమైంది. భూసమస్యను ప్రధాన ఎజెండాగా పెట్టి మావోయిస్టు పార్టీ చర్చలకు సిద్ధపడింది. భూసమస్యకు తన వద్ద ఎటువంటి పరిష్కారం లేని కాంగ్రెస్ ప్రభుత్వం చర్చలకు ఆటంకం కల్గించాలని రకరకాలుగా ప్రయత్నించింది. అయినప్పటికీ ఎట్టకేలకు చర్చలకు రాకతప్పని ప్రభుత్వం రెండు రోజులపాటు భూసమస్య మీదే సాగిన చర్చల్లో సమస్య పరిష్కారానికి ఎటువంటి నిర్దిష్ట ప్రతిపాదనలు చేయలేదు. పైగా మావోయిస్టు పార్టీ, 1 కోటీ 20 లక్షల మిగులు భూమి వుందనీ దాన్ని పేదలకు పంచాలని డిమాండ్ చేస్తే ప్రభుత్వం మిగులు భూమి లేనే లేదని మాట్లాడింది. స్వతంత్ర భూకమీషన్ను వేస్తే మిగులు భూముల లెక్కలు తేలుతాయని పార్టీ డిమాండ్ చేసింది. కానీ ప్రభుత్వం అలా కమీషన్ వేయడానికి అంగీకరించలేదు. అలా చేస్తే ప్రభుత్వం తన గుట్టును తానే బయట పెట్టుకోవడం అవుతుంది. అందుకే అది ఒప్పుకోలేదు. అంతే కాదు భూసమస్యతో పాటు మరే సమస్యను పరిష్కరించే నిర్దిష్ట ఎజెండా ప్రభుత్వం వద్ద లేనందునే అది మరో దఫా చర్చలకు ఆటంకం కల్పించింది.

అయితే చర్చల సందర్భంగా భూ సమస్య పెద్ద ఎత్తున చర్చనీయాంశం కావడం, మావోయిస్టు పార్టీతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా మరెందరో మేధావులు, ప్రజాస్వామికవాదులు భూసంస్కరణల అవసరాన్ని నొక్కి చెప్పడం మూలంగా చర్చల తర్వాత నుంచి ప్రభుత్వం భూ పంపిణీ కార్యక్రమం చేపట్టినట్టు చెప్పుకుంటోంది. అంటే గత ఇరవైయేళ్లకు పైగా భూసంస్కరణల మాటను మరిచిపోయిన ప్రభుత్వాలు చర్చల మూలంగా మళ్లీ ఆ మాటను గుర్తు చేసుకోవాల్సి వచ్చింది. ఈ మూడేళ్లలో నాలుగున్నర లక్షల ఎకరాల భూమిని పంచినట్టు అది చెప్పుకుంటోంది. అయితే వాస్తవంగా అది భూముల్ని పంచింది పెద్దగా లేదు. అంతకు ముందే ప్రజలు ఆక్రమించుకున్న భూములకు పట్టాలిచ్చి పంపిణీగా లెక్కలు చెప్తోంది.

ఇలా చెప్పుకుంటూ పోతే కాంగ్రెస్ పార్టీ భూసంస్కరణలను ఎన్నడూ అమలు చేయలేదని అర్థమవుతోంది. భూసంస్కరణలను అమలు చేయకపోగా భూపోరాటాలను మాత్రం తీవ్రంగా అణచివేసిన చరిత్ర దానికి వుంది.

తెలంగాణా, నక్సల్బరీ, శ్రీకాకుళాలను అణచివేసిందని ముందే చెప్పుకున్నాం. ఆ తర్వాత జగిత్యాల, సిరిసిల్లా పోరాటాలనూ, ఇంద్రవెల్లి పోరాటాన్ని, కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా అణచివేసింది. 90లో లీగల్ పీరియడ్ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా, ప్రత్యేకించి తెలంగాణ ప్రాంతంలో భూ పోరాటాలను ఉక్కుపాదంతో అణచివేసింది. ఆ పోరాటాలను అణచివేయడానికి బి.ఎస్.ఎఫ్‌ను సైతం దించింది.

తెలుగుదేశం పార్టీ భూసంస్కరణలను పక్కన పడేసిందని ముందే చెప్పుకున్నాం. ఇలా పక్కన పడేయడం ఎన్.టి.ఆర్ కాలం నుంచే మొదలైంది. ఎన్.టి.ఆర్ వ్యవసాయ భూమిని అధిక మొత్తంలో పెట్టుబడిదారులకు అప్పగించాడు. ఎన్.టి.ఆర్ కాలంలోనే పెద్దఎత్తున అసైన్డ్ భూముల్ని పరిశ్రమలకు అప్పగించడం మొదలైంది. చంద్రబాబు అదే దారిలో మరింత ముందుకు పోయాడు. ప్రపంచబ్యాంకుకు ఏజెంట్ వలె పని చేసిన చంద్రబాబు సంక్షేమ బాధ్యత నుండి పూర్తిగా తప్పుకుని, ప్రపంచబ్యాంకు ఎజెండాను అమలుచేశాడు. తాను అమలుచేస్తున్న ఎజెండాకు సామాజిక మద్దతును సృష్టించుకోవడం కోసం తె.దే ప్రభుత్వం విపరీతమైన ప్రచారాన్ని చేపట్టింది. ఈ ప్రభావంతో వ్యవసాయ రంగం ఉపాధిని కల్పించలేదనీ, పరిశ్రమల స్థాపన వల్లే ఉపాధి పెరుగుతుందని, చిన్న కమతాల్లో వ్యవసాయం ఎంత మాత్రం పనికిరాదనే అభిప్రాయాలు ప్రచారం అయ్యాయి. ఇదే దృక్పథంతో పత్రికల్లో సహితం విపరీతంగా వ్యాసాలు

వచ్చాయి. దీన్ని బట్టి చూస్తే తె.దే.పా భూసంస్కరణలకు వ్యతిరేకంగా తాను నిలబడ్డమేకాక, వాటికి వ్యతిరేకంగా బలమైన భావజాలాన్ని తయారుచేసిందని అర్థం అవుతుంది.

భావజాలాన్ని తయారు చేయడమే కాక తె.దే. ప్రభుత్వం భూపోరాటాలను భౌతికంగానూ తీవ్రంగా అణచివేసింది. ముఖ్యంగా చంద్రబాబు పాలనలో ఆ అణచివేత మునుపెన్నడూ లేనంత హెచ్చు స్థాయిలో పెరిగింది.

భూస్వామ్య, సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు బలంగా కట్టుబడి వున్న పార్టీ తెలుగు దేశం. ఒకనాడు రెండెకరాల భూమిని మాత్రమే కల్గి వున్న చంద్రబాబు నేడు 2 వేల కోట్ల సంపదకు అధిపతి అయ్యాడంటే, ఏ స్థాయిలో దళారీ పాత్ర వహిస్తున్నాడో అర్థం చేస్కోవచ్చు. ఇటువంటి దళారీల పార్టీ భూ సంస్కరణలను అమలు చేయడం సాధ్యం కాదు.

వామపక్షాలు, భూసంస్కరణల అమలుకు కట్టుబడి ఉన్న పార్టీలుగా చెప్పుకుంటాయి. అలా చెప్పుకోవడంలో భాగంగానే అవి ఈ మధ్యకాలంలో భూపోరాటాలను చేపట్టాయి. ఈ పోరాటాల్లో భాగంగా ప్రజల్ని విస్తృతంగా కదిలించడం మంచి పరిణామమే. ఈ పోరాటాలు ప్రభుత్వ ప్రజావ్యతిరేక వైఖరినీ, ప్రజలపోరాట పటిమనూ మరోసారి చాటాయి. అయితే వామపక్షాలు నిజంగానే భూసంబంధాలలో మార్పులు కోరుకుంటున్నాయా? అంటే ఎంత మాత్రమూ కోరుకోవడం లేదని ఖచ్చితంగా చెప్పుకోవాలి. భూ సంబంధాల మార్పు కోసం జరుగుతున్న పోరాటాల పట్ల అవి మొదటి నుంచి అనుసరిస్తోన్న వైఖరిని ఏమాత్రం పరిశీలించినా ఈ విషయం స్పష్టమైతుంది. అవి తెలంగాణా సాయుధ పోరాటానికి ద్రోహం చేశాయి. నక్సల్బరీ పోరాటాన్ని తీవ్రంగా అణచివేశాయి. శ్రీకాకుళ పోరాటంపైన ప్రయోగించిన అణచివేతను సహితం సమర్థిస్తున్నాయి. అంతేకాదు రైతాంగ సాయుధ పోరాటాలను కాలం చెల్లిన పోరాటాలుగా సిద్ధాంతీకరిస్తున్నాయి.

సి.పి.ఎం అధికారంలో వున్న పశ్చిమ బెంగాల్లో భూ సమస్యను అది ఎలా పరిష్కరించిందో చూసినా దాని వైఖరి స్పష్టమవుతోంది. ఆ రాష్ట్రంలో భూసంస్కరణలు అమలు చేసానని అది గొప్పగా చెప్పుకుంటుంది. కానీ అది చెప్పుకుంటున్న భూసంస్కరణల వల్ల ఆ రాష్ట్రంలో పేద రైతాంగం, భూమి లేని పేదలూ పెద్దగా ప్రయోజనం పొందిందేమీ లేదు. మొత్తంగా అది భూ సంబంధాలలో మార్పులు తెచ్చిందేమీ లేదు. నేడు బుద్దదేవ్ సర్కార్ పారిశ్రామికీకరణ పేరిట బహుళజాతి కంపెనీల, దళారీ పెట్టుబడిదారుల ప్రయోజనాలకు కొమ్ముకాయడానికి నగ్నంగా ముందుకొస్తోంది. అది చెప్పుకుంటున్న పారిశ్రామికీకరణ వ్యవసాయంపై ఆధారపడిన పారిశ్రామికీకరణ కాదు. వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసే పారిశ్రామికీకరణ. అందుకే పేద రైతులకు చెందిన వేల వేల ఎకరాల వ్యవసాయ భూమిని గుంజుకొని పెట్టుబడిదారులకు ధారదత్తం చేస్తోంది. అందుకు అడ్డు వచ్చిన పేద రైతాంగంపై 'సింగూరు', 'నందిగ్రాం' వంటి మారణకాండలకు పాల్పడుతోంది. అట్లా పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం రైతాంగ ప్రయోజనాలనే కాదు, రైతాంగ ప్రాణాలను కూడా బలిపెడుతోంది.

ఈ విధంగా వామపక్షాల ఆచరణను ఏ మాత్రం చూసినా సామ్రాజ్యవాదపు కనుసన్నల్లో కొనసాగుతున్న ఈ వ్యవస్థను పూర్తిగా సమర్ధిస్తున్నాయని అర్థం అవుతోంది. అయితే అన్ని విషయాల్లోలాగే భూ సమస్య పైన కూడా ఇవి తాము అధికారంలో ఉన్నచోట ఒక వైఖరినీ లేని చోట మరో వైఖరిని చేపడుతున్నాయి. ఇది కేవలం అధికార కుమ్ములాటలో భాగమే. ఇప్పుడు చేపడుతున్న భూపోరాటాలను అడ్డం పెట్టుకొని అవి పార్లమెంటరీ ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి రావడానికి ప్రయత్నిస్తాయి.

ఇలా చూస్తే భూ సమస్యపై అధికార పార్టీల వైఖరి స్థూలంగా ఒకే విధంగా ఉన్నట్టు అర్థం అవుతోంది. ఈ వైఖరికి గల కారణం ఈ పార్టీలు వేటికీ నిజమైన అభివృద్ధి దృక్పథం లేకపోవడమే. అందుకే ఈ పార్టీలు భూ సంబంధాలలో నిజమైన మార్పులకు ప్రయత్నించడం లేదు. అంతేకాదు భూ సంబంధాలలో మార్పుల కోసం పోరాడుతున్న విప్లవోద్యమంపై ఈ పార్టీలన్నీ ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్, బీహార్-జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ మొదలైన రాష్ట్రాలలో ఒకేతీరుగ నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నాయి.

## భూ సమస్యపై విప్లవోద్యమ కృషి

నేడు దేశంలో జరుగుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవానికి మావోయిస్టు పార్టీ నాయకత్వం వహిస్తోంది. ఈ విప్లవానికి వ్యవసాయక విప్లవం ఇరుసువంటిదనే అవగాహనతో 'దున్నేవారికే భూమి' నినాదంతో విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకెళ్తోంది. భూ సంస్కరణల పేరుతోనో మరో పేరుతోనో ప్రభుత్వాలు ప్రజలకు పంచిన అరకొర భూములు ఇప్పుడు ప్రజల దగ్గర లేవు. వాటిని తిరిగి భూస్వామ్య వర్గాలో, ప్రభుత్వాలో ఆక్రమించుకున్నాయి. కానీ విప్లవోద్యమ నాయకత్వంలో ప్రజలు దేశవ్యాప్తంగా కొన్ని లక్షల ఎకరాలు స్వాధీనం చేసుకున్నారు. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే లక్ష ఎకరాలకు పైగా పట్టా భూములనూ, 3 లక్షల ఎకరాలకు పైగా ప్రభుత్వ, అటవీ, దేవుడి మాన్య భూములను ఆక్రమించుకున్నారు. దేశవ్యాప్తంగా ఇలా స్వాధీనం

# పాలకుల రక్త దాహానికి సాక్ష్యమే ముదిగొండ కాల్పులు

ఈ నియంతల పాలనలో కూడూ, గుడ్డా, గూడు అడగడమే ఒక పెద్ద నేరం! ఎంత పెద్ద నేరమంటే అడిగిన వారిని నిట్ట నిలువునా కాల్చిపడేసేంత పెద్ద నేరం! అందుకే గూడు కావాలని అడిగినందుకు ముదిగొండ వాసులపై తూటాలు కురిసినై. అక్కడికక్కడ ఆరు ప్రాణాలు నిలువునా కూలిపోయాయి. మరొక ప్రాణం ఆసుపత్రిలో పోయింది. 16 మంది తీవ్రంగా గాయపడ్డారు. మరెందరో స్వల్పంగా గాయపడ్డారు.

ఆంధ్రప్రదేశ్‌లో గత మూడు నెలలుగా భూపోరాటంలో భాగంగా వామపక్షాలు చేపడుతున్న ఆందోళనల్లో చెదురుమదురు ఘర్షణలూ, ఉద్రిక్తతలూ, లాఠీఛార్జీలు చోటు చేసుకుంటూనే వున్నాయి. జూలై 28న భూపోరాటంలో భాగంగానే ఇచ్చిన రాష్ట్ర బంద్‌ను పురస్కరించుకొని రాస్తారోకో చేస్తున్న ముదిగొండ వాసులపై పోలీసులు విచక్షణా రహితంగా కాల్పులు జరపడంతో పై సంఘటన చోటు చేసుకుంది. అయితే ప్రజలు రాళ్ల రువ్వితే ఆత్మరక్షణ కోసమే కాల్పులు జరిపామని పోలీసులు ఎప్పటిలాగే చెప్తున్నారు. ముఖ్యమంత్రి, హోం మంత్రీ, పోలీసు అధికారులూ పోలీసులకు వత్తాసుపలుకుతున్నారు.

మనదేశం ప్రధానంగా వ్యవసాయక దేశం. కాబట్టి ఇక్కడ భూసమస్య అనేది ఉత్పత్తి సంబంధాల సమస్య. భూపోరాటం అనేది ఉత్పత్తి సంబంధాలను ప్రశ్నించే పోరాటం. కాబట్టి ఈ ఉత్పత్తి సంబంధాలకు ప్రాతినిధ్యం వహించే పాలకవర్గాలు భూపోరాటాలను సహించలేవు.

అందుకే భూమిలేని వారు భూమి కావాలని అడిగినా భూములున్న వారు వాటిని కాపాడుకోవాలని చూసినా పాలకవర్గాలు రక్తపాతాన్ని సృష్టించడానికే సిద్ధపడుతున్నాయి.

తెలంగాణ, నక్సల్బరీ, శ్రీకాకుళం, ఇంద్రవెల్లి, కళింగనగర్, నందిగ్రామ్‌లలో అందుకే రక్తపాతాలు సృష్టించాయి. నేడు ముదిగొండనూ రక్తసిక్తం చేసాయి. పాలకవర్గాల ఈ నిరంకుశత్వాన్ని ప్రతి ఒక్కరూ తీవ్రంగా ఖండించాలి.

ప్రజలను విచక్షణా రహితంగా కాల్చి చంపిన ప్రభుత్వం ఆ తర్వాత నష్టపరిహారాలంటూ, బాధిత కుటుంబాలకు ఉద్యోగాలంటూ ప్రాణాలకు ఖరీదు కట్టే ప్రయత్నం చేస్తోంది. పోరాటాలను పక్కదారులు పట్టించే ప్రయత్నమూ చేస్తోంది.

వామపక్షాలు కూడా మృతుల స్మారకార్థం ముదిగొండలో స్థూపం కట్టి సభ పెట్టాయి. ఆ సందర్భంగా, వారి ఆశయాలను ముందుకు తీసుకుపోవడంలో భాగంగా భూపోరాటాలను మరింత ఉధృతం చేస్తామని ప్రకటించాయి. కానీ ఆ తర్వాత ఉధృతం చేసింది లేకపోగా ప్రస్తుతం భూపోరాటాల అలికిడి ఎక్కడా వినబడ్డం లేదు.

వామపక్షాలు చేపడుతున్న ఇటువంటి పోరాటాలు భూ సమస్యను పరిష్కరించలేవు. కనీసం భూ సమస్య మూలాలనూ పట్టుకోలేవు. వ్యవస్థ సమూల మార్పుకై జరిగే సాయుధ పోరాటమే భూ సమస్యను పరిష్కరిస్తుంది. కనుక సాయుధ పోరాట మార్గంలో సమీకృతులు కావడమే పీడిత ప్రజలముందున్న కర్తవ్యం.

చేసుకున్న భూముల్లో అధిక భాగాన్ని ప్రజలు సాగుచేసుకుంటున్నారు. విప్లవోద్యమం తీవ్ర అణచివేతకు గురవుతున్న ప్రాంతాల్లో ప్రజలు భూముల్ని నిర్భయంగా దున్నుకోలేని తాత్కాలిక స్థితి ఉండవచ్చు. అయితే ఆ భూములను భూస్వాములు కూడా తిరిగి స్వాధీనం చేసుకునే పరిస్థితి లేదు. కానీ విప్లవోద్యమం తాత్కాలికంగా వెనుకపట్టు పట్టిన చోట భూస్వాములు కౌలు పేరుతోనో మరో పేరుతోనో తిరిగి తమ భూములను స్వాధీనం చేసుకుంటున్నారు. నిర్బంధ పరిస్థితిలో వెసులుబాటు వస్తే ఆ భూములు మళ్లీ ప్రజల సొంతం అయి తీరుతాయి. నేడు విప్లవోద్యమం బలంగా వున్న ప్రాంతాల్లో భూమిలేని ప్రజలు లేరంటే అతిశయోక్తి కాదు. అంటే ఈ ప్రాంతాల్లో భూస్వామ్యం తుడిచిపెట్టుకు పోతోందని అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వాలు చిన్న చూపు చూడ్డం వల్ల ఇన్నాళ్లు అభివృద్ధికి దూరంగా ఉన్న ఈ ప్రజలు నేడు తమ పోరాటం ద్వారా సాధించుకున్న భూముల్లో పంటలు పండించుకుంటూ నిజమైన అభివృద్ధినీ, స్వావలంభనను సాధిస్తున్నారు. అంతేకాదు తాము స్వాధీనం చేసుకుంటున్న భూములపై తమ అధికారాన్ని నిలుపుకోవాలంటే ప్రజా రాజ్యాధికారాన్ని స్థాపించుకోవాలని

గుర్తించారు. అందులో భాగంగా అనేకచోట్ల గ్రామ, ఏరియా స్థాయి విప్లవ ప్రజా కమిటీలను ఏర్పరిచి వాటిని బలోపేతం చేసుకుంటున్నారు. ఈ కమిటీలు అన్ని సమస్యలతో పాటు భూ సమస్యను విశేషంగా పరిష్కరిస్తున్నాయి. ఇంతవరకూ ఏ 'ప్రజాస్వామిక' ప్రభుత్వమూ, మహిళలే ప్రధానులుగా ఏలిన ప్రభుత్వాలూ తాను పంచిన భూములకు మహిళల పేరు మీద పట్టాలివ్వలేదు. కానీ బీజ ప్రాయంలోనే ఉన్న ఈ విప్లవ ప్రజా కమిటీలు తాము పంచుతున్న భూములకు స్త్రీ, పురుషులిరువురి పేరు మీద పట్టాలిస్తున్నాయి. అంతేకాదు బూర్జువా సర్కార్ అరకొరగా ఇస్తోన్న భూములు సహితం రాళ్లూ రప్పలూ తుప్పలతో నిండినవిగానే ఉంటున్నాయి. వాటిని వ్యవసాయ యోగ్యంగా మార్చుకోవడానికి ఎటువంటి సహకారమూ అందించడం లేదు. ఫలితంగా అటువంటి భూములను పొందిన రైతాంగం వాటిని నిరుపయోగంగా వదిలేస్తున్నారు. కానీ ఈ విప్లవ ప్రజా కమిటీలు భూములు సాగు చేసుకోవడానికి కావాల్సిన సహకారాన్ని ప్రజలకు పూర్తిగా అందిస్తోన్నాయి.

### భూ సంబంధాలు మారకుండా అభివృద్ధి లేదు

మనది వ్యవసాయ దేశం. కనుక వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడం ద్వారానే దేశాభివృద్ధి సాధ్యమవుతుంది. వ్యవసాయం అభివృద్ధి కావాలంటే భూ సంబంధాలు మారాలి. ఉపాధికల్పన అనేది అభివృద్ధికి గీటురాయిగా ఉంటుంది. వ్యవసాయ ప్రధాన దేశంలో ఉపాధికల్పనకు వ్యవసాయమే ప్రధాన వనరు కావాలి. ప్రజలందరికీ ఉపాధి కల్పించాలంటే భూస్వాముల గుప్పిట్లో వున్న భూమిని విడిపించి పేద ప్రజలకు ఆ భూమిని పంచాలి. అంతేకాదు వ్యవసాయానికి కావాల్సిన పెట్టుబడిని, రుణ సదుపాయం, సబ్సిడీలు తదితరాల ద్వారా ప్రభుత్వాలు అందించాలి. వ్యవసాయ రంగంపై ఆధారపడే, పరిశ్రమలను నెలకొల్పాలి. వ్యవసాయం అభివృద్ధి కావడంవల్ల ప్రజల కొనుగోలు శక్తి పెరిగి మార్కెట్ పుంజుకుంటుంది. దానితో పారిశ్రామిక వ్యవస్థ కూడా అభివృద్ధి చెందుతుంది.

అయితే భూ సంబంధాల్లో మార్పులు తీసుకురావాలంటే కరడుగట్టిన భూస్వామ్య విధానంతో పోరాడాలి. ఒక్క భూస్వామ్య విధానంతో పోరాడ్డం మాత్రమే సరిపోదు. ఎందుకంటే సామ్రాజ్యవాదం, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానాలు భూస్వామ్య వ్యవస్థను బలంగా పరిరక్షిస్తున్నాయి. అంతే కాదు ఈనాడు దళారీ పెట్టుబడిదారులా, బహుళజాతి సంస్థలా కంపెనీలతోపాటు సామ్రాజ్యవాద ప్రయోజనాలను నెరవేర్చడం కోసం ఏర్పాటు చేస్తున్న సెజ్‌లు, ఐ.టి పార్కులు, గనులు కార్పోరేట్ వ్యవసాయ క్షేత్రాలు, భూ, జల, వాయు రవాణా మార్గాలు...... ఇవన్నీ కూడా పేదల భూములనూ, అనేక గ్రామాలను మింగేస్తున్నాయి. కనుక ప్రజల భూ సమస్యనూ ఇళ్ల సమస్యనూ సామ్రాజ్యవాదం మరింత పెంచుతోంది. దానితో పాటు ఈ రోజు భూ సమస్య గురించి జరుగుతున్న ఏ చిన్న పోరాటాన్నయినా అది శాంతియుత పోరాటమైనా, సాయుధ పోరాటమయినా దాన్ని ఈ మూడు వర్గాలు తీవ్రంగా పరిగణించి అణచివేయ ప్రయత్నిస్తున్నాయి. అందుకే కళింగనగర్, నందిగ్రాం, ముదిగొండలు రక్తసిక్తమవుతున్నాయి. అంతేకాదు భూమి పోరును విముక్తిపోరుగా ముందుకు తీసుకుపోతున్న మావోయిస్టు పార్టీపై సైతం ఇవి తీవ్రాతి తీవ్రమైన హింసను ప్రయోగిస్తున్నాయి. వందలాది విప్లవకారులను బూటకపు ఎన్‌కౌంటర్లలో, మూకుమ్మడి దాడుల్లో పాశవికంగా హత్య చేస్తున్నాయి. కనుక భూ సంబంధాలలో మార్పులు తీసుకురావాలంటే విప్లవ ప్రజానీకమంతా ఏకమై ఈ మూడు వర్గాలకు వ్యతిరేకంగా పోరాడాలి. అదీ సాయుధంగానే పోరాడాలి. ఇటువంటి పోరాటం మాత్రమే 'దున్నేవారికే భూమి' నినాదాన్ని ఆచరణ సాధ్యం చేస్తుంది. ఈ విషయం వర్తమాన చరిత్ర మరింత స్పష్టంగా నిరూపిస్తోంది.

★


**అనతికాలంలోనే చైనాలోని మధ్య, దక్షిణ, ఉత్తర రాష్ట్రాలలోని అనేక కోట్ల మంది రైతులు గొప్ప తుఫానులాగా బ్రహ్మాండమైన ఉప్పెనలాగా విజృంభిస్తారు. ఎంతటి గొప్ప శక్తి అయినా అతి వేగవంతమైన, హింసాత్మకమైన ఈ శక్తిని అదుపు చేయజాలదు. తమను బంధించిన సంకెళ్లనన్నింటిని తెంచుకొని వారు విముక్తి మార్గాన ముందుకు తోసుకుపోతారు. వారు సామ్రాజ్యవాదులనూ, యుద్ధ ప్రభువులనూ, లంచగొండి అధికారులనూ, స్థానిక నిరంకుశులనూ, దుష్ట పెత్తందారులను-అందర్నీ వారి వారి గోరీల్లో పూడ్చి పెడతారు.**

**- మావో రచించిన 'హూనాన్ రైతు ఉద్యమం: ఒక పరిశీలనా నివేదిక' నుండి**

సంస్మరణ

# వీరులకు మరణం లేదు, విప్లవం ఆగిపోదు!

జూలై 28 వచ్చింది. ఈసారి ఎన్నెన్ని త్యాగాలను మోసుకొచ్చింది, అని తలుచుకుంటే ఎవరికైనా మొదట గుర్తొచ్చేది కా. బి.కె. ప్రత్యక్షంగా పరిచయం వున్న వాళ్లకు తన దృఢమైన కరచాలనం, ఆత్మీయమైన పలకరింపు గుర్తొస్తే, ప్రత్యక్ష పరిచయం లేని వాళ్లకు కోరాపుట్ విజయం గుర్తొస్తుంది. మృత్యువు ఒడి నుంచి సహితం కర్తవ్యాన్ని బోధిస్తున్న తన చూపులు గుర్తొస్తాయి. కా. బి.కె. సాధారణ కార్యకర్త నుంచి కేంద్ర కమిటీ సభ్యుడి దాకా, సి.ఎం.సి సభ్యుడి దాకా, తాను నడిచిన నడకలో ఎన్నెన్నో మైలు రాళ్లను పాతుకుంటూ పోయాడు. ఈస్ట్ డివిజన్‌కు రూపుదిద్దిన ఆ చేతులతోనే ఎ.ఒ.బికీ రూపు దిద్దాడు. అటువంటి అనుభవాలగనిని ప్రజా యుద్ధం ఒక కీలక మలుపులో వున్న సమయంలో శత్రువు మనకు దూరం చేసాడు. మనల్ని మరో 'డిసెంబర్' విషాదంలో ముంచెత్తాడు.



మొదటి 'డిసెంబర్' విషాదాన్ని మనం చరిత్ర విసిరిన సవాల్‌గా స్వీకరించి, కర్తవ్య నిర్వహణలో వెనుకబడక పి.ఎల్.జి.ఎను నిర్మించుకున్నాం. అట్లా ఆ ముగ్గురు కామ్రేడ్స్‌కు నివాళినందించాం. ఈ డిసెంబర్ విషాదాన్ని అధిగమించి పి.ఎల్.జి.ఎను పి.ఎల్.ఎగా మారుద్దాం. ఈ మిలటరీ వ్యూహకర్తకు ఇంతకంటే మనమిచ్చే నివాళి ఏముంటుంది!

మన చెంపలపై జారిన కా. బి.కె అమరత్వపు కన్నీటిని ఇంకా తుడుచుకోనేలేదు. అప్పుడే కా. ప్రసాద్ అమరత్వం. కరీంనగర్ కత్తుల కోలాటంలో విరజిమ్మిన అగ్గిరవ్వ కా. ప్రసాద్. శత్రువు గుండెల్లో నిదురపోయిన సాహసి. తను పోరు పాఠాలను నేర్చుకున్నదీ, పోరు గురువుగా ఎదిగిందీ తెలంగాణ తల్లి ఒడిలోనే. అందుకే సాధారణ సభ్యుడి నుండీ కేంద్ర కమిటీ సభ్యుడి దాకా తన నడకంతా నిర్బంధం నిప్పుల గుండం మధ్యనే. అయినా తానెప్పుడూ వెరవలేదు. ఆ నిప్పుల గుండాన్ని శత్రువు ముఖంపై ఎలా విసిరి కొట్టాలనేదే తన నిరంతర పథక రచన. ఈ కరీంనగర్ నేత, ఉత్తర తెలంగాణా నేతగా ఎదిగాడు, కర్నాటక నేతగానూ మారాడు. మితవాదులపై సైద్ధాంతిక పోరునల్పాడు. మల్నాడును విముక్తి ప్రాంతంగా మలచాలనే కా. సాకేత్‌రాజన్ కలకు సాకారాన్నిచ్చే కృషిని ఆరంభించబోతుండగా శత్రువు కొట్టిన దొంగ దెబ్బలో అమరుడయ్యాడు. కా. ప్రసాద్, తెలంగాణ నుంచి కర్నాటక దాకా నీ సాహసాన్ని మందుపాతర్లుగా పెట్టాం. అవి విస్ఫోటనమై శత్రు రాజ్యాన్ని విధ్వంసం చేస్తాయి. నూతన రాజ్యాన్ని సాకారం చేస్తాయి.




**కామ్రేడ్ అజయ్ దాదాకు వినమ్ర జోహార్లు!**

**సి.పి.ఐ (మావోయిస్టు) కేంద్ర కమిటీ సభ్యుడు, నక్సల్బరీ తరానికి చెందిన సీనియర్ నేత కా. అజయ్ దాదా 2007, ఆగస్టు 15న అనారోగ్యంతో అమరుడయ్యాడు. తన అమరత్వం పార్టీకి ఎనలేని నష్టం.**

**తన సుదీర్ఘ విప్లవ ఆచరణ ద్వారా కా. అజయ్ దాదా నెలకొల్పిన మహోన్నత ఆదర్శాలు పార్టీకి, ప్రజలకూ, ప్రజా సంఘాలకూ అత్యంత స్ఫూర్తి దాయకం. ఆ ఆదర్శాలను అలవర్చుకొని తన ఆశయసాధనలో మరింత దృఢంగా పయనిస్తామని ప్రతిజ్ఞ చేద్దాం. అదే ఈ అమరవీరుడికి మనం ఇవ్వగలిగే నిజమైన నివాళి!**


**(కామ్రేడ్ అజయ్ దాదా జీవిత చరిత్రను తర్వాత వివరంగా ప్రచురిస్తాం - సం.)**

ఎ.పి ఉద్యమాన్ని తలుచుకుంటే కన్నీళ్లు అగ్నికణాలై దూకుతయి. కామ్రేడ్స్ మాధవ్, శ్రీధర్‌ల అమరత్వపు కసిని మనమింకా తీర్చుకోనేలేదు. ఇంతలోనే ఆ కసిని మరింత రగిలిస్తూ కా. సత్యం అమరుడయ్యాడు. సత్యమెవరో గుర్తురాకపోతే, ఒంగోలు పట్టణ నడిబొడ్డున, పట్టపగలు పరమ క్రూరుడైన లడ్డాపై పేలిన, రిమోట్ బాంబును గుర్తు తెచ్చుకోండి. నల్లగొండ నుంచీ నల్లమల దాకా తను నడిచిన నడకలో వేసిన ప్రతీ అడుగూ శత్రువు గుండెల మీదనే. ఆ సాహసమే, ఆ గుండె నిబ్బరత్వమే తనను ఎ.పి ఉద్యమ రథసారథుల్లో ఒకరిని చేసింది. కా. సత్యంను సాయుధుడిగా వున్నపుడు దెబ్బతీయలేకపోయిన శత్రువు, తనను నిరాయుధంగా, కుట్ర



పూరితంగా పట్టుకొని హత్య చేశాడు. కా. సత్యంను చంపేశాడు. కానీ సత్యం మనకిచ్చిన సాహసాన్ని శత్రువు తాకను కూడా తాకలేకపోయాడు. ఆ సాహసం నల్లమలలో ఎర్రమల్లెల పరిమళమై గుభాలిస్తూనే వుంటుంది.

మన గుండెల్లో సత్యం చితిమంట ఆరనేలేదు. ఇంతలోనే ఎ.పి రథసారథుల్లో మరొకరైన కా. రాఘవులు అమరుడయ్యాడు.



పల్నాడు పౌరుషాగ్నితో నిండిన తన గుండెను, ముఠాతత్వం కింద నలుగుతున్న రాయలసీమ బతుకుకు అండగా నిలబెట్టాడు. అందుకే రక్తం రుచి మరిగిన రాజశేఖర్ రెడ్డికి కంటగింపయ్యాడు. రాజశేఖర్ రెడ్డి తన పెంపుడు తోడేళ్ల మందను వేట కోసం అనంతపురం అడవుల్లోకి తోలాడు. ఆ వేటలో అమరులైన 9 మంది కామ్రేడ్స్‌లో కా. రాఘవులు ఒకరు.

కా. రమణ, పల్నాడు ప్రజాపోరులో కండ్లు తెరిచి, ఆ పోరుకు నాయకురాలు అయింది. డొక్కలెండిన బక్కజీవుల కడుపుమంటై కరువు దాడులకు కదిలి వెళ్లింది. పార్టీ పిలుపునందుకొని




రాయలసీమ రణ శంఖారావాన్ని పూరించగ తరలివెళ్లింది. ఆ గడ్డ మీదనే, తన సహచరుడు కా. రాఘవులుతో పాటు నేలకొరిగింది. ఇంకా ఈ వేటలో కామ్రేడ్స్ అనంద రెడ్డి, అశోక్, రాంబాబు, భరత్, సంధ్య, సుజాత, పార్వతిలు రాజశేఖర్ రెడ్డి రక్త దాహానికి బలయ్యారు. కామ్రేడ్స్, మీ నెత్తుటితో తడిసిన రాయలసీమ వనంలో విప్లవాల విత్తులు చల్లుతాం, అవి మొలకెత్తి రేపటికి విముక్తి ప్రాంతమై విస్తరిస్తాయి.

నెత్తుటి మడుగుల నడుమనే, ఎ.పి ఉద్యమానికి కొత్త ఊపిర్లు పొయ్యాలని సాహసించి, నల్గొండ జిల్లాలో నేలకొరిగిన నలుగురు వీరులు - కామ్రేడ్స్ నర్సింహ, సంజీవ్, మల్లేశం, అరుణ్‌కుమార్. రజాకార్లతో రణం చేసిన నల్లగొండ పోరు వారసత్వాన్ని నిప్పులుకురిసే నిర్బంధం మధ్యన సహితం కొనసాగించడానికి వెళ్లి, గ్రేహౌండ్స్ పాశవిక దాడిలో ఈ నల్గురూ వీరమరణం పొందారు. కామ్రేడ్స్, వీర తెలంగాణా పోరు వారసత్వం మీ త్యాగాన్ని వృధా పోనివ్వదు.

ఉద్యమాన్ని బలోపేతం చేయడంలో భాగంగా ఎ.ఒ.బికి తరలివస్తోన్న కామ్రేడ్స్ లక్ష్మణ్, భవానీలను అంతకు కొద్దిగా ముందే ఎ.పి నుంచి వచ్చేసి ఎ.ఒ.బి కామ్రేడ్‌గా మారిన కా. స్వామినీ ఎస్.ఐ.బి మూకలు రాజమండ్రిలో పట్టుకొని ఎ.ఒ.బి ఉద్యమ ప్రాంతంలో కాల్చి చంపాయి. కామ్రేడ్స్ లక్ష్మణ్, భవానీలు అమరులుగానే ఎ.ఒ.బి ఉద్యమానికి పరిచయమయ్యారు. కామ్రేడ్స్, ఎ.పి ఉద్యమంలో వికసించిన మీరు ఎ.ఒ.బి ఉద్యమంలో నెత్తుటి పుష్పాలై రాలిపడ్డారు. మిమ్మల్ని సాగనంపిన ఎ.పి ఉద్యమం, మీ నెత్తుటితో తడిసిన ఎ.ఒ.బి ఉద్యమం సదా మిమ్మల్ని స్మరించుకుంటాయి.

ఉత్తర తెలంగాణ, తన ఒడిలో ఎన్ని త్యాగాలను మూట కట్టుకుంటోంది! ఇప్పుడది కామ్రేడ్ సోమన్న త్యాగాన్నీ మూట కట్టుకుంది. కా. సోమన్న ఉత్తర తెలంగాణ ఉద్యమ సారథుల్లో ఒకరు. కష్టజీవుల కడుపునింపడం కోసం అవిశ్రాంతంగా వ్యవసాయ విప్లవాన్ని కొనసాగించిన యోధుడు.



పేదలంతా పరమాన్నం తినే రోజు కోసం, పాచి మెతుకులనే పరమాన్నంగా తిన్నవాడు. తన జీవితమంతా రివిజనిస్టు బొంత పురుగులను ఈసడించుకున్నవాడు.

సోమన్నా, శత్రువు దొంగ దెబ్బతో నిన్ను మాకు దూరం చేసాడు. కానీ నీ నెత్తురింకిన ఉత్తర తెలంగాణ, శత్రువును దెబ్బతీయడానికి నూతన ఎత్తుగడలను రూపొందించుకుంటోంది. ఇక ఉద్యమం వేసే ప్రతి ముందడుగులో నీ చిరునవ్వును చూసుకుంటం.

ఓరుగల్లుకు పోరువన్నెను అద్దిన వీరుల్లో కామ్రేడ్ మధు



ఒకరు. నిత్య నిర్బంధం నడుమ తన బలగాలను సురక్షితంగా నడిపించిన సాహసి. గెరిల్లా దాడులతో శత్రువును హడలెత్తించిన వాడు. శత్రువు కంట్లో నలుసుగా మారినవాడు. శత్రువు చేసిన దాడిలో వీరోచితంగా ప్రతిఘటిస్తూ ఎర్రజెండాకు మరింత ఎరుపును అద్దినవాడు. కా. మధుతో పాటు, కామ్రేడ్స్ నిర్మల, పద్మ, గీతలు కూడా వీరోచితంగా ప్రతిఘటిస్తూ వీరమరణం పొందారు.

కామ్రేడ్స్, ఓరుగల్లు నేలతల్లి మీ నెత్తుటినే కాదు మీ ఆశయాలనూ, మీ ఆదర్శాలను తనలో ఇంకించుకుంది. అదను చూసి ఆ ఆశయాలనూ, ఆదర్శాలను జెండాలుగా ఎగరేస్తుంది. ఆ జెండాలను తమ భుజాలకెత్తుకొని అసంఖ్యాక జనం దోపిడీ గుండెలపైకి కదం తొక్కుతారు.

విప్లవకారులను అంతం చేయడానికి రకరకాల కుట్రల్ని ప్రయోగించడం పాలకవర్గాలకు కొత్తకాదు. అటువంటి ఒక నీచమైన కుట్రనే వరంగల్ జిల్లా ఎస్.పి సౌమ్యామిశ్రా పన్నింది. కుట్రపూరితంగా మైన్ పేల్చి కామ్రేడ్స్ రమాకాంత్, క్రాంతి, ఓదన్న, సంజీవ్‌లను హత్య చేసి తన రక్త దాహాన్ని తీర్చుకుంది. కామ్రేడ్స్, మాకు లెక్కలు బాగా వచ్చు. మీ నెత్తుటి అప్పును వడ్డీతో సహా తప్పక తీర్చుకుంటాం.

కొమురం భీం వారసత్వాన్ని పుణికి పుచ్చుకొని, ఇంద్రవెల్లి పోరు స్ఫూర్తిని మదిలో నింపుకొని, కన్నబిడ్డను వదిలి దోపిడీ



గుండెలను అనుక్షణం విల్లంబులా వెంటాడింది కామ్రేడ్ పద్మ. జిల్లా నేతగా ఎదిగి ఆదిలాబాద్ గడ్డను తన పోరుతో మరింతగా ఎరుపెక్కించింది. శత్రు దాడిలో నాయకత్వాన్ని కాపాడే ప్రయత్నంలో తన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించింది. ఇదే గడ్డపై ఎగిసిన పోరు కెరటాలు కామ్రేడ్స్ అరుణ, స్వర్ణలు. తన సుదీర్ఘ విప్లవ జీవితం ద్వారా జిల్లా ఉద్యమాన్ని ప్రభావితం చేసి, చెరిగిపోని ముద్రను వేసుకుంది కా. అరుణ. విప్లవ జీవితం చిన్నదయినా తన స్నేహ స్వభావంతో అందరిలో నాటుకుపోయింది కా. స్వర్ణ. శత్రు దాడిలో వీరోచితంగా ప్రతిఘటిస్తూ ఈ కామ్రేడ్స్ నేలకొరిగారు.


కామ్రేడ్స్, మీరు కొమురం భీం వారసత్వాన్ని కొనసాగించారు. మేం మీ వారసత్వాన్ని కొనసాగిస్తాం.

ఆదిలాబాద్ మట్టిలోనే పుట్టిన మరో మాణిక్యం కా. నరేష్. ఎన్ని కష్టాలు వచ్చినా పోరు బాటను వీడని సంకల్పం తనది. ఆదిలాబాద్ జిల్లా నేతగా ఎదిగిన ఈ కామ్రేడ్ ప్రమాదవశాత్తు అమరుడయ్యాడు. కామ్రేడ్ నరేష్, కష్టాలూ, కన్నీళ్లు, ఘర్షణలూ లేని సమాజం కోసం నీ అమరత్వం సాక్షిగా మేం పోరాడుతాం.

జోన్ మహాసభను విజయవంతం చేసుకొని సమరోత్సాహంతో భవిష్యత్‌లోకి అడుగిడబోతున్న సమస్త ఎ.ఒ.బి శ్రేణులనూ కా. గౌతం అమరత్వపు వార్త దుఃఖంలో ముంచెత్తింది. గౌతం ఎ.ఒ.బి ఎస్.జడ్.సి సభ్యుడేగాక, కేంద్ర టెక్నికల్ టీం సభ్యుడు కూడా. ఇనుప ముక్కలను ఆయుధంగా మలిచి గెరిల్లాలను సాయుధం చేసిన ఆయుధ శిల్పి. పి.ఎల్.జి.ఎ తీవ్రమైన తుపాకుల కొరతను ఎదుర్కొంటున్న నేటి పరిస్థితిలో కా. గౌతం అమరత్వం ఎ.ఒ.బికే కాదు మొత్తం పార్టీకే పెద్ద నష్టం.

కా. గౌతం, నువ్వు తయారు చేసిన తుపాకులు మా వద్ద భద్రంగానే వున్నాయి. నీ ఆశయసాధనకు వాటిని గురితప్పకుండా ప్రయోగిస్తాం.

ఎ.ఒ.బి త్యాగాలకు మరో చాలుబోసిన వీరుడు కా. కడారి రాములు. జగిత్యాలతో కదం కలిపి, ఓరుగల్లును పోరుగల్లుగా చేసి జిల్లా కమిటీ సభ్యుడయిన వాడు. పార్టీ పిలుపును అందుకొని తూర్పు కనుమలకు తరలివెళ్లిన వాడు.



మెతుకు లేని ఆదివాసీల పోరుకు అండగ నిలిచిన వాడు. ఆ బతుకుపోరును దెబ్బ తీయ శత్రువు చుట్టు ముడితే, తూటాకు తూటా బదులిస్తూ తూర్పు దిక్కుకు తన నెత్తుటిని అద్దినవాడు. కా. రాములూ, తూర్పు కనుమలపై రేపు వీచే స్వేచ్ఛా పవనపు స్పర్శకు, తల వూపే ప్రతి కొమ్మా, రెమ్మా నిన్ను స్మరించుకుంటుంది.



కా. కరుణ ఎ.ఒ.బి ఉద్యమం ఎదిగించుకున్న మహిళా నాయకురాలు. మహిళా నాయకురాలే కాదు మహిళా ఉద్యమ నాయకురాలు కూడా. ఆమె నుతిమెత్తని పాదాలు దుర్గమమైన కొండల్ని జయించాయి. ఆమె మృదువైన చేతులు మొరటు తుపాకుల్ని మచ్చిక చేసుకున్నాయి. బలహీనమైన ఆమె దేహం 20 యేళ్లకు పైనే ఉద్యమంలో దృఢంగా నిలబడింది. ఎ.ఒ.బిలో జరిగిన అన్ని రెయిడ్లలోనూ ఆమె డాక్టర్. ఆమె ఆత్మీయమైన స్పర్శ ఎందరి గాయాలకో మందులా పని చేసింది. తన సహచరుడు కా. బి.కెతో సహా ప్రయాణిస్తూ అతనితో పాటే శత్రువు చేతికి చిక్కింది. ఇరవైయేళ్ల తన దృఢమైన నడకకు తగ్గట్టుగానే శత్రువు ముందు కూడా దృఢంగా నిలబడి, అమరురాలైంది. కా. కరుణా, మృత్యువు ఒడిలో సహితం మూతపడని నీ చూపును, తూర్పుకనుమల్లో ఇక ముందు కండ్లుతెరచే ప్రతి బిడ్డకూ కానుకగా ఇస్తాం.

మారణాయుధాలను సరిగా ప్రయోగిస్తే శత్రువును మట్టి కరిపించగలం. లేకుంటే, ఏమరపాటుగా ఉంటే మనమే ప్రాణాలు కోల్పోతాం. ఈ కఠినమైన గుణపాఠాన్ని కామ్రేడ్స్ రఘు, నీలేష్‌లు మనకు మరోసారి అందించారు. ఈ ఇద్దరు కామ్రేడ్స్ మల్కాన్‌గిరి డివిజన్‌లో ప్రమాదవశాత్తు బూబీట్రాప్ పేలిన ఘటనలో అమరులయ్యారు. వీరిలో కా. రఘు, బీహార్-ఝార్ఖండ్ ప్రాంతం నుంచి కేంద్ర మిలటరీ ఇన్‌స్ట్రక్టర్‌గా ఎదిగిన కామ్రేడ్. కా. నీలేష్

దండకారణ్య ప్రాంతంలో పుట్టి, పెరిగి మిలటరీ రంగంలో పని చేస్తున్న కామ్రేడ్.

కామ్రేడ్స్, మీ అమరత్వాన్ని గుణపాఠంగా తీసుకుంటాం. మీ ఆశయాలు కొనసాగిస్తాం.

మల్కన్‌గిరి జిల్లాలో ఒకవారపు సంతలో పోలీసులపై సాహసోపేతంగా దాడి చేసి ఒక ఎస్.ఐని చంపి ఆయుధాలు స్వాధీనం చేసుకొని తిరిగి వస్తుండగా పోలీసుల దాడికి గురై కామ్రేడ్స్ హరి, రత్నలు అమరులయ్యారు. ఆదిలాబాద్ జిల్లాలో పుట్టిన కా. హరి సెంట్రల్ యాక్షన్ టీంలో సభ్యుడిగా పని చేస్తూండినాడు. కా. రత్న మల్కన్‌గిరిలోనే పుట్టిన ఆదివాసీ కోయబిడ్డ. పి.ఎల్.జి.ఎ సభ్యురాలు.

కామ్రేడ్స్, మీ సాహసాన్ని రేపటి తరాలకు తప్పక అందిస్తాం.

సల్వాజుడూం పేరిట మధ్యయుగాల నాటి పాశవిక హింసను దండకారణ్య ఉద్యమంపై గుమ్మరిస్తున్నాయి పాలకవర్గాలు. ఆ హింసను తిప్పికొట్టే ప్రయత్నంలో భాగంగా దండకారణ్య ఉద్యమ సారథుల్లో ఒకరైన కా. వికాస్ అమరుడయ్యాడు. తెలంగాణలో పుట్టిన ఈ పువ్వు దండకారణ్యంలో వికసించి పరిమళాలు వెదజల్లింది. మురికి కూపంలో కూరుకుపోయిన పాలకులు ఈ పరిమళాన్ని ఎలా భరించగలరు? అందుకే కా. వికాస్‌ను పట్టుకొని కాల్చి చంపారు.



కా. వికాస్, నీ మరణవార్త విన్న దండకారణ్య ఉద్యమం కసితో రగిలింది. విముక్తి ప్రాంత లక్ష్యానికి మరింత దృఢంగా కట్టుబడతానని ప్రతిజ్ఞ చేసింది.

ఈ లక్ష్య సాధనలో మొదటి అడుగుగా డి.కె ఉద్యమం, చారిత్రాత్మకమైన రాణిబోధిలి దాడికి పాల్పడింది. ఈ దాడిని విజయవంతం చేయడం కోసం కామ్రేడ్స్ మోహన్, లింగన్న, కైలాస్, భగత్, భీమాల్, చైతులు తమ ప్రాణాల్ని పణంగా పెట్టారు.


కా. మోహన్

కామ్రేడ్స్, మీ రక్తంతో తడిసిన విజయపతాకనెత్తుకొని మన పి.ఎల్.జి.ఎ ఢిల్లీ కోటలను చుట్టు ముడుతుంది.

కామ్రేడ్స్ చారుమజుందార్, కన్హయ్‌ఛటర్జీల పోరాటాల త్యాగ వారసత్వాన్ని ముందుకు తీసుకుపోయే క్రమంలో ఈ అందరు కామ్రేడ్స్ అమరులయ్యారు. వీరి త్యాగాలు ఎందరికో స్ఫూర్తినిస్తాయి. కన్నీళ్లను కత్తులుగా మార్చుతాయి. ఎందరెందరినో విముక్తి దారిలో నడిపిస్తాయి. లక్ష్య సాధనలో అనివార్యమైన మరిన్ని త్యాగాలకు ప్రేరణగా నిలుస్తాయి. అంతిమంగా విజయాన్ని సాఫల్యం చేస్తాయి.

ప్రజలారా రండి! అమరుల త్యాగం వృధాపోదనీ, అది హిమశిఖరాల కంటే ఉన్నతమైనదని చాటుదాం. వారి ఆశయ సాధనలో పార్టీ, ప్రజాసేన, ప్రజాసంఘాలలో భర్తీ అవుదాం. విముక్తి పోరును ముందుకు తీసుకుపోదాం. అంతిమ విజయం మనదే!

★

## అమరుల జీవిత చరిత్రలు

### కామ్రేడ్ నరేష్ (గెల్లి రాజన్న)



కా. నరేష్ 2007 జనవరి 29న ప్రమాదవశాత్తు గాయపడి 30వ తేదీన తుదిశ్వాస విడిచాడు. కామ్రేడ్ నరేష్ అట్టడుగు వర్గం నుంచి విప్లవోద్యమంలోకి ప్రవేశించి ఆదిలాబాద్ జిల్లా కమిటీ సభ్యుడిగా ఎదిగి, అమరుడయ్యాడు. ఈ కామ్రేడ్‌కు వినమ్రంగా జోహార్లర్పిద్దాం.

కా. నరేష్‌ది ఆదిలాబాద్ జిల్లా జైపూర్ మండలం శివ్వారం గ్రామం. దాదాపు 37 సంవత్సరాల క్రితం పేదింట్లో పుట్టిన ఈ కామ్రేడ్ చదువుకోలేదు. చిన్నప్పటి నుండే గొర్లకాపరిగా పని చేసేవాడు. అదే సమయంలో విప్లవోద్యమం పట్ల ఆకర్షితుడై 1990లో దళ సభ్యుడిగా చేరాడు. మొదట చెన్నూరు దళంలో పని చేసిన కా. నరేష్ ఆనాడు ఆ ప్రాంతంలో జరిగిన పట్టా భూముల ఆక్రమణ పోరాటంలో చురుకైన పాత్ర వహించాడు. ఈ పోరాటాలను సాకుగా తీసుకొని ప్రభుత్వం జిల్లాలో పారా మిలటరీ బలగాలను దించి తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించింది. కా. నరేష్ ఆ నిర్బంధాన్ని ధైర్యంగా ఎదుర్కుంటూ ప్రజలకు అండగా నిలబడ్డాడు. ఆ నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ భూస్వాముల ఇండ్లపై జరిగిన దాడుల్లో చురుకైన పాత్ర వహించాడు.

1993లో సింగపూర్ దళం కొత్తగా ఏర్పడింది. కా. నరేష్ ఆ దళానికి డిప్యూటీ కమాండర్‌గా వెళ్లాడు. ఆ తర్వాత ఇంద్రవెల్లి

ఏరియా కమిటీ సభ్యుడిగా పని చేసాడు. 1995-97 వరకూ జోనల్ కమిటీ కార్యదర్శికి గార్డ్‌గా పని చేసాడు.

2001 నుండి 2004 సెప్టెంబర్ వరకూ తుపాకుల తయారీ యూనిట్‌లో పని చేశాడు. ఈ క్రమంలో మంచి నైపుణ్యం కల్గిన టెక్నీషియన్‌గా అభివృద్ధి అయ్యాడు. ఎంతో ఓపిగ్గా ఆ రంగంలో కృషి చేసాడు.

కా. నరేష్‌కు మిలటరీ రంగంలోనూ మంచి అనుభవమే వుంది. జిల్లాలోని స్పెషల్ గెరిల్లా దళానికి కా. నరేష్ కొద్దికాలం పాటు కమాండర్‌గా బాధ్యతలు నిర్వహించాడు. పార్టీ నిర్వహించిన అనేక రెయిడ్స్‌లో అసాల్ట్ టీం సభ్యుడిగా ఉంటూ, దాడుల విజయానికి తోడ్పడ్డాడు. గాజుల నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌పై, ఇందారం గనిపై, గోలేటి సి.ఐ.ఎస్.ఎఫ్ శిబిరంపై చేసిన దాడుల్లో, ఆయుధాల స్వాధీనంలో కీలక పాత్ర పోషించాడు. శత్రువుపై మాటు వేసి దాడులు చేయడంలో, కామ్రేడ్స్‌ను మానసికంగా సంసిద్ధం చేసి చర్యలకు పురిగొల్పడంలో ఒక మిలటరీ కమాండర్‌గా మంచి కృషి చేసాడు.

కామ్రేడ్ నరేష్ దారులు గుర్తు పెట్టుకోవడంలో దిట్ట. ఒక్కసారి చూసిన దారిని ఇంక ఎప్పటికీ మరిచిపోడు. అందుకే అడవి అతనికి కొట్టిన పిండి. మనుషులను కూడా ఒకసారి చూసాడంటే ఎప్పటికీ మరిచిపోయేవాడు కాదు.

జిల్లాలో లొంగుబాట్లు పెరిగినప్పటికీ తాను ఎంతో దృఢంగా నిలబడి మిగితా క్యాడర్‌ను కూడా నిలబెట్టే ప్రయత్నం చేసాడు.

అమరుడయ్యేనాటికి కా. నరేష్ జిల్లా కమిటీ సభ్యుడిగానే గాక, సిర్పూర్-చెన్నూర్ ఏరియా కమిటీ కార్యదర్శిగా కూడా పని చేస్తున్నాడు.

సుదీర్ఘ అనుభవాన్ని గడించిన ఈ కామ్రేడ్ అమరత్వం జిల్లా ఉద్యమానికి తీవ్ర నష్టం. కా. నరేష్ ఆశయ సాధనకై దృఢంగా పోరాడ్డం ద్వారానే ఆ నష్టాన్ని పూరించగలం.

## కామ్రేడ్ అరుణ (సలాం గాంధారి)

కా. అరుణ (సలాం గాంధారి) ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం పల్స్‌ధారి గ్రామంలో పేద ఆదివాసీ కుటుంబంలో దాదాపు 39 సంవత్సరాల క్రితం పుట్టింది. పేదరికం వల్ల ఆమె చదువుకోలేదు.

వాళ్ల ప్రాంతంలో జరుగుతున్న భూస్వామ్య వ్యతిరేక పోరాటాల ప్రభావంతో 1989లో ఆమె దండకారణ్య రైతుకూలీ సంఘంలో సభ్యురాలిగా చేరింది. అనతికాలంలోనే చురుకైన కార్యకర్తగా మారి వాళ్ల గ్రామంలో రాజకీయాలకు అండగా నిలబడింది.



1990లో వెల్లువెత్తిన భూ పోరాటాలలో చురుకైన పాత్ర వహించింది. ఆ తర్వాత వచ్చిన నిర్బంధంలోనూ ఆమె పోరాటాలను దృఢంగా అంటిపెట్టుకునే వుంది. క్రమంగా ఆమె తన చైతన్యాన్ని మరింత పెంచుకొని 1990 జూన్‌లో దళంలోకి రిక్రూట్ అయింది. నిర్బంధం మూలంగా పెరిగిన లొంగుబాట్ల మధ్యనే కా. అరుణ దృఢంగా నిలబడి వాంకిడి, మంగి దళాలలో పని చేసింది.

నిర్బంధాన్ని తిప్పికొట్టడం కోసం 1993లో జిల్లాలో ప్రత్యేక గెరిల్లా దళాన్ని ఏర్పాటు చేశారు. ఆ దళంలో కా. అరుణ సభ్యురాలైంది. ఆ తర్వాత ఉత్తర తెలంగాణలో రాష్ట్ర కమిటీ 1996లో వేసిన ప్లటూన్‌లో సభ్యురాలైంది. 97 వరకూ ఈ ప్లటూన్‌లో పని చేసింది. 1999 నుండి 2004 వరకూ ఆదిలాబాద్ 7వ ప్లాటూన్‌లో సెక్షన్ కమాండర్‌గా పని చేసింది. ఈ ప్లాటూన్ నాయకత్వంలో సిర్పూర్ (యు), కరకగూడెం పోలీస్ స్టేషన్‌పై, కాగజ్‌నగర్ డి.ఎస్.పి కార్యాలయంపై, గోలేటి సి.ఐ.ఎస్.ఎఫ్ క్యాంపుపై దాడులు జరిగాయి. ఈ దాడుల్లో అసాల్ట్ టీంలలో వుండి, ధైర్యంగా శత్రువు దుర్గాల్లోకి దూసుకుపోయి, ఈ దాడుల విజయాల్లో కా. అరుణ తనవంతు పాత్ర పోషించింది. అదే విధంగా శత్రువు దళంపై, ప్లాటూన్‌పై దాడి చేసిన అనేక సందర్భాల్లో సాహసంతో పోరాడి శత్రు దాడులను తిప్పికొట్టింది. దమ్మిరెడ్డి పేట గ్రామం వద్ద ప్లాటూన్‌పై శత్రువు దాడి చేసినపుడు ప్రతిఘటిస్తున్న క్రమంలో ఆమె గాయపడింది. అయినప్పటికీ తన సెక్షన్‌ను కమాండ్ చేయాల్సిన బాధ్యతలను నిర్వహిస్తూనే రిట్రీట్ అయింది. ఇలా శత్రువుతో పోరాడే క్రమంలో మంచి మిలటరీ యోధురాలుగా ఎదిగింది.

బోథ్ ప్రాంతంలో 1998, 99లో మహిళా టీం బాధ్యురాలిగా సహితం కా. అరుణ పని చేసింది. ఆ కాలంలో మహిళలను వివిధ సమస్యలపై చురుగ్గా కదిలించింది. 2004 నుండి 2007 వరకూ మంగి, ఇంద్రవెల్లి-సింగపూర్ ఏరియా కమిటీల కార్యదర్శిగా పని చేసింది.

కా. అరుణ 1993లో పెళ్లి చేసుకుంది. అయితే అతను రాజకీయంగా దిగజారి ఉద్యమం నుండి వెళ్లిపోవడానికి సిద్ధమై

ఆమెను కూడా తనతో రమ్మని వత్తిడి చేశాడు. కానీ అతని ప్రతిపాదనను కా. అరుణ తిరస్కరించింది. దానితో 1997లో అతను శత్రువు ముందు లొంగిపోయాడు. ఆమె మాత్రం దృఢంగా నిలబడింది.

ఇలా సుదీర్ఘ కాలం పాటు ఉద్యమంలో పని చేసి ఆర్గనైజేషన్, మిలటరీ రంగాల్లో మంచి అనుభవాన్ని గడించిన కామ్రేడ్ అరుణ 2007, జనవరి 31న దండకారణ్యంలోని మద్దేడు ప్రాంతం తారూర్ సమీపంలో శత్రువుతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో పోరాడుతూ కా. స్వర్ణతో పాటు అమరురాలయింది. ఆమె అమరత్వం జిల్లా ఉద్యమానికి తీవ్రమైన నష్టం.

కా. అరుణలోని దృఢ దీక్షనూ, సాహసాన్నీ ఆదర్శంగా తీసుకుని, ఆమె ఆశయసాధనలో మరింత దృఢంగా నడుద్దాం. ఆమెకు మరణం లేదని చాటుదాం.

## కామ్రేడ్ స్వర్ణ (వెంకటమ్మ)



కా. స్వర్ణ (వెంకటమ్మ) ఆదిలాబాద్ జిల్లా కోటపల్లి మండలం సూపాక జనగామ గ్రామంలో పేద కుటుంబంలో దాదాపు 21 సంవత్సరాల క్రితం పుట్టింది. పేదరికం వల్ల ఆమె చదువుకోలేదు.

పేదల బతుకులు మారాలంటే పోరాటం చేయాలని గుర్తించిన కా. స్వర్ణ 2004 జూన్‌లో చెన్నూరు దళంలో చేరింది. కష్టపడే తత్వం వున్న ఆమె చొరవగా అన్ని పనులు చేసేది. కామ్రేడ్స్ అందరితో కలుపుగోలుగా వుండేది. చిన్నప్పటి నుండీ వేధిస్తోన్న అనారోగ్యాన్ని ఆమె తన విప్లవాచరణకు ఆటంకం కానీయలేదు. ఆమె కొద్ది రోజులు ఇంద్రవెల్లి దళంలోనూ పని చేసింది.

విప్లవోద్యమంలోకి వచ్చిన తర్వాత చదువు నేర్చుకున్న స్వర్ణ అమరులపై పాటలు రాస్తూ, పాడేది. మంచి కళాకారిణిగా ఎదగాల్సిన ఈ కామ్రేడ్ 2007 జనవరి 31న డికెలోని మద్దేడు ప్రాంతం తారూర్ సమీపంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో శత్రువుతో పోరాడుతూ కా. అరుణతో సహా నేలకొరిగింది. ఏ ఆశయ సాధనకై కామ్రేడ్ స్వర్ణ ప్రాణాలిచ్చిందో ఆ ఆశయ సాధనకై కృషి చేద్దాం.

## కామ్రేడ్ చీర కొమురయ్య

కా. చీర కొమురయ్య స్వస్థలం ఆదిలాబాద్ జిల్లా మందమర్రి పట్టణం. మందమర్రిలో సింగరేణి బొగ్గు బావులున్నాయి. ఆ బావుల్లో నిరంతరం జ్వలించే కార్మికుల పోరాటముంది. ఆ పోరాటానికి నాయకత్వం వహించే పార్టీ వుంది. ఆ పార్టీని నిరంతరం కాపాడుకొనే సానుభూతిపరులున్నారు.

కామ్రేడ్ చీర కొమురయ్య అటువంటి సానుభూతిపరుడు. 1980 నుండి అతను పార్టీ సంబంధాల్లో వుండేవాడు. చిన్న టీ హోటల్ నడుపుతూ, పార్టీ కార్యకలాపాల్లో పాల్గొనేవాడు. ఆ రోజుల్లో ఆ హోటల్, పార్టీకి కార్యాలయంవలె కొనసాగింది. కా. కొమురయ్య తను పార్టీ కార్యకలాపాల్లో పాల్గొనడమే గాక, తన కుటుంబ సభ్యులందరూ పాల్గొనేలా ప్రోత్సహించేవాడు.

ఆ సమయంలో కార్మిక ద్రోహి, రివిజనిస్టు నాయకుడు అయిన అబ్రహంను పార్టీ ఖతం చేయగా ఈ కేసులో కా. కొమురయ్య అరెస్టు అయ్యాడు. ఇదే కేసులో అరెస్టయిన అమరుడు కా. శ్యాం తదితరులు జైలు నుంచి తప్పించుకున్నారు. దానితో కక్ష కొద్దీ ఎటువంటి సాక్ష్యాధారాలు లేకపోయినా కా. కొమురయ్యకు న్యాయ స్థానం యావజ్జీవ ఖైదును వేసింది.

జైల్లో విప్లవకారుల కమ్యూన్‌లోనే క్రమశిక్షణాయుత జీవితాన్ని గడిపాడు ఈ కామ్రేడ్. ఆ కాలంలో జైల్లో నక్సల్ ఖైదీలు నిర్వహించిన అన్ని పోరాటాల్లోనూ చురుగ్గా పాల్గొన్నాడు. 95 జనవరిలో రాష్ట్రాన్ని కుదిపివేసిన జైలు పోరాటంలోనూ చురుగ్గా పాల్గొన్నాడు.

1997లో పెరోల్ పైన ఇంటికి వెళ్లి, తిరిగి జైలుకు వస్తుండగా మార్గ మధ్యంలోనే గోదావరిఖని బస్టాండులో గుండెపోటుతో మరణించాడు. మరణించే నాటికి కామ్రేడ్ కొమురయ్య వయస్సు 55 సంవత్సరాలు.

విప్లవం పట్ల కామ్రేడ్ కొమురయ్యకున్న అంకిత భావాన్ని ఎత్తిపడుదాం. అతని ఆశయ సాధనలో ముందుకు సాగుదాం.

## కామ్రేడ్ కట్కూరి రాములు (ప్రవీణ్, బాలన్న)

కా. ప్రవీణ్ (రాములు) 2006, మే 27న కరీంనగర్ జిల్లా సారంగపూర్ మండలం రేకులపల్లి గ్రామం వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో అమరుడయ్యాడు. అమరుడయ్యేనాటికి ఈ కామ్రేడ్ సబ్ డివిజనల్ కమిటీ సభ్యుడిగా పని చేస్తున్నాడు.

కా. ప్రవీణ్ కరీంనగర్ జిల్లా చందుర్తి మండలం మూడపల్లి

గ్రామంలో ఒక నిరుపేద కుటుంబంలో 25 ఏళ్ల క్రితం పుట్టాడు. చిన్నప్పుడే తల్లిదండ్రులు చనిపోవడంతో కా. ప్రవీణ్ ఎంతో కష్టపడి పెరిగాడు. తన మేనమామ సహకారంతో హైదరాబాద్‌లో క్రైస్తవ మిషనరీ పాఠశాలలో 7వ తరగతి వరకూ చదువుకున్నాడు. ఆ



తర్వాత ఆర్థిక పరిస్థితి వల్ల చదువు కొనసాగించలేక సినిమా పరిశ్రమలో చిన్న చిన్న పనులు చేస్తూ కొన్నాళ్లు పొట్ట పోసుకున్నాడు. ఆ తర్వాత పొట్ట గడవక తమ వూరికి తిరిగి వచ్చాడు. ఊర్లో కూలీ, నాలీ చేయడం, మేకలు కాయడం వంటి పనులు చేసుకుంటూ బతికాడు. ఆ క్రమంలో వూళ్లో అగ్రకుల దౌర్జన్యాన్ని చవిచూసాడు.

ఇలా జీవితంలో తాను అనుభవించిన సంఘర్షణ అతనిలో అనేక ప్రశ్నలను లేవనెత్తింది. ఆ ప్రశ్నలకు పరిష్కార మార్గం అతనికి వాళ్ల గ్రామంలో సాగుతున్న భూస్వామ్య వ్యతిరేక పోరాటాల్లో కనబడింది. ఫలితంగా 1997లో గ్రామ విప్లవ రైతుకూలీ సంఘంలో సభ్యుడిగా చేరాడు. క్రమంగా చురుకైన పాత్ర వహించాడు. 1990 ఆఖరి నుంచి పూర్తికాలం కార్యకర్తగా సిరిసిల్లా ఏరియాలో పని చేసాడు. 1999లో దళంలోకి రిక్రూట్ అయ్యాడు. దళంలో అన్ని పనుల్లో చురుగ్గా పాల్గొంటూ, క్రమశిక్షణతో తన బాధ్యతలను నిర్వర్తిస్తూ 2000లో ఎ.సి సభ్యుడయ్యాడు. 2002లో కథలాపూర్ ఎల్.జి.ఎస్ కార్యదర్శిగా, 2002-03లో కొడిమ్యాల ఎల్.జి.ఎస్ కమాండర్‌గా, 2005లో కొంతకాలం కామారెడ్డి ఎల్.జి.ఎస్ కార్యదర్శిగా పని చేసాడు. 2005 నవంబర్‌లో ఎస్.జి.ఎస్ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించాడు. 2006లో పశ్చిమ కరీంనగర్-నిజామాబాద్ జిల్లాల సబ్ డివిసిని ఏర్పాటు చేయగా, కా. ప్రవీణ్ అందులో సభ్యుడయ్యాడు.

ఇట్లా ఉద్యమవసరాల రీత్యా అతను ఎక్కడైనా పని చేయడానికి సిద్ధపడ్డాడు. తను పని చేసిన ప్రాంతాల్లో అనేక పోరాటాలను నిర్మిస్తూ ప్రజలకు అత్యంత సన్నిహితుడయ్యాడు. డివిజన్‌లోని ఏ దళ ఏరియాలో అయినా ప్రజలు కా. ప్రవీణ్ పట్ల చాలా ఆత్మీయతను కనబరిచేవారు.

ఆర్గనైజేషనల్‌గానే కాక అతను మిలటరీ పరంగా కూడా ధైర్య సాహసాలతో మంచి నైపుణ్యాన్ని కల్గి వుండేవాడు. అతను దళంలోకి వచ్చిన రెండు నెలలకే జరిగిన ఎన్‌కౌంటర్లో చురుగ్గా తప్పించుకున్నాడు. ఆ తర్వాత మద్దిమల్ల, కోనాపూర్, తాటిపల్లి, ధర్మాజిపేటలల్లో జరిగిన శత్రు దాడులల్లో సాహసంతో ప్రతిఘటిస్తూ దళాన్ని రిట్రీట్ చేశాడు. నిజామాబాద్ జిల్లా కామారెడ్డి పోలీస్ అవుట్ పోస్టుపై పి.ఎల్.జి.ఎ చేసిన దాడిలో చురుగ్గా పాల్గొన్నాడు. 2001లో నిజామాబాద్ డివిజన్ నాయకత్వాన్ని అంతమొందించాలని పోలీసులు తయారుచేసిన కోవర్టులను ఏరివేయడంలో అతను ముఖ్యమైన పాత్రను వహించాడు. మానాల మారణహోమంలో 10 మంది కామ్రేడ్స్‌ను హత్య చేసిన కోవర్టు పద్మను శిక్షించడంలో కీలకపాత్ర వహించాడు.

కా. ప్రవీణ్‌కు దారుల మీద మంచి పట్టు ఉండేది. ప్రవీణ్ ఉన్నాడంటే దళానికీ, నాయకత్వానికీ దారుల విషయంలో మంచి విశ్వాసం ఉండేది.

సిరిసిల్లా ఉద్యమాన్ని దెబ్బతీయడానికి శత్రువు ప్రవీణ్ పట్ల పలుసార్లు దుష్ప్రచారానికి పూనుకున్నాడు. వాటన్నింటినీ తట్టుకొని కా. ప్రవీణ్ ఉద్యమంలో దృఢంగా కొనసాగాడు.

తనలోని సద్గుణాలను అలవర్చుకొని, అతను కన్న కలలను నెరవేర్చడం కోసం నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేద్దాం.

## కామ్రేడ్ బడుగు అశోక్

కరీంనగర్ జిల్లా కోనరావుపేట మండలం శివంగాళపల్లి గ్రామానికి చెందిన పార్టీ సానుభూతిపరుడు కా. అశోక్‌ను ఒక ద్రోహి ఇచ్చిన సమాచారంతో ముందే అరెస్టు చేసిన పోలీసులు చిత్రహింసలకు గురి చేసి రేకులపల్లి వద్ద కా. ప్రవీణ్‌తో పాటు 2006, మే 27న కాల్చిచంపారు.

కా. అశోక్ 2000 సం.లో సిరిసిల్లా దళంతో పరిచయాలు ఏర్పడి సంఘంలో పని చేసాడు. దళం ఇచ్చిన ప్రతీ పనిని బాధ్యతాయుతంగా నిర్వర్తిస్తూ వచ్చాడు. ఈ క్రమంలో శత్రువుకు బహిర్గతం కావడంతో పోలీసులు కా. అశోక్‌ను అరెస్టు చేయడం కోసం అనేకసార్లు దాడులు చేసారు. దీంతో భీతిల్లిన కా. అశోక్ అరబ్ దేశాలకు వెళ్లిపోయాడు. అయినప్పటికీ పార్టీపై, విప్లవోద్యమంపై మమకారం సన్నగిల్ల లేదు. ఎలాగైనా తిరిగి పార్టీలోకి వెళ్లి పని చేస్తూ ఎర్రజెండా నీడలోనే చనిపోవాలని ఆరాటపడుతూ వచ్చాడు. 2005 ఆగస్టులో బయటి దేశాల నుండి పార్టీ సంబంధాల్లోకి వచ్చి తన అభిప్రాయాన్ని తెలియజేసాడు. అప్పటి నుండి బయటి దేశాలకు పోయిన వారిని, వారిలోని శత్రువు ఏజెంట్ల గురించి, మంచి వారి గురించి రిపోర్టు చేస్తూ వచ్చాడు.

ఈ క్రమంలో పూర్తి కాలం పార్టీలోకి రావాలనే అభిప్రాయాన్ని పార్టీ ముందుపెట్టిన కా. అశోక్ బయటి దేశాల నుండి నిజామాబాద్ జిల్లా రత్నగిరిపల్లి గ్రామంలో గతంలో తనకు తెలిసిన మాజీ సంఘ నాయకుని వద్దకు చేరాడు. ఈ సంఘ నాయకుడు అప్పటికి కొద్ది రోజుల ముందే లొంగిపోయి వున్నాడు. ఈ విషయం అశోక్‌కు గానీ పార్టీకి గానీ తెలియదు. దానితో 2006, మే 26న కా. అశోక్‌ను పోలీసులు పట్టుకున్నారు. 27వ తేదీన నాయకత్వం కా. అశోక్‌కు ఫోన్ ద్వారా అపాయింట్‌మెంట్ పెట్టింది. కాగా కా. అశోక్ ముందే అరెస్టు అయి వుండడం మూలంగా అతని వద్ద వున్న సెల్‌ఫోన్ పోలీసుల చేతిలోకి వెళ్లింది. ఇలా ఫోన్‌లో ఎ.పి.టిని విన్న పోలీసులు కా. అశోక్‌ను తీసుకొని ఎపిటి స్థలమైన రేకులపల్లి వద్దకు మఫ్టీలో వచ్చారు. ఈ విషయం అర్థం కాని కా. ప్రవీణ్, మరో కామ్రేడ్‌తో కల్సి ఎపిటికి పోగా ఎస్.ఐ.బి పోలీసులు కాల్పులు జరిపారు. ఆ కాల్పుల్లో కా. ప్రవీణ్ అమరుడైనాడు. అనంతరం కా. అశోక్‌ను కూడా చిత్రహింసలకు గురిచేసి అదే స్థలంలో కాల్చి చంపి ఎన్‌కౌంటర్ కట్టు కథ అల్లారు.

ఇద్దరు పిల్లలూ, భార్య వున్న కా. అశోక్, కుటుంబాని కంటే పార్టీనే మిన్నగా భావించాడు. అందుకే విదేశాల నుండి వచ్చినప్పటికీ కనీసం కుటుంబాన్ని సైతం కలువకుండానే నేరుగా పార్టీలోకి రావడానికి ఇష్టపడ్డాడు. కా. అశోక్ కుటుంబానికి విప్లవ సానుభూతినీ, అమరుడు కా. అశోక్‌కు జోహార్లనూ తెలుపుదాం.

## కామ్రేడ్ ప్రశాంత్ (పోశమల్లు)

2006, అక్టోబర్ 11వ తేదీన ఆంధ్ర-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని తాళ్లగూడెం-అన్నారం గ్రామాల మధ్య ఎ.పి గ్రేహౌండ్స్, ఛత్తీస్‌గఢ్ పోలీసు మూకలు మాటుగాచి జరిపిన పాశవిక దాడిలో కా. అశోక్‌తో పాటు కా. ప్రశాంత్ అమరుడయ్యాడు.

కా. ప్రశాంత్ కరీంనగర్ జిల్లా మంథని మండలం తోటగోపయ్యపల్లె గ్రామంలో నిరుపేద కుటుంబంలో పుట్టాడు. చిన్నతనం నుండే గొర్ల కాపరిగా పని చేసేవాడు. గొర్ల కాపరిగా ఉంటున్న సమయంలో కా. ప్రశాంత్‌కు దళంతో సంబంధాలు ఏర్పడ్డాయి. క్రమంగా గ్రామ సంఘంలో సభ్యుడైనాడు. దళం అప్పగించిన పనులు చురుగ్గా చేసేవాడు. ఈ క్రమంలో పోలీసులకు బహిర్గతం అయి అతనిపై నిర్బంధం తీవ్రమైంది. ఫలితంగా 2001లో దళంలోకి భర్తీ అయ్యాడు.



కా. ప్రశాంత్ మిలటరీ పరంగా చాలా చురుకైనవాడు. శత్రువు పట్ల తీవ్రమైన కసిని ప్రదర్శించేవాడు. తను గ్రామంలో సంఘ సభ్యుడిగా ఉన్నప్పుడే తీగలవాగు ఎన్‌కౌంటర్ జరిగి ఏడుగురు మహిళా కామ్రేడ్స్ అమరులయ్యారు. ఆ ఎన్‌కౌంటర్ ఘటన కా. ప్రశాంత్‌లో తీవ్రమైన కసిని రేపింది. దానితో వాళ్ల పక్క గ్రామమైన మల్లారంకు ఏదో పని మీద వచ్చిన పోలీసు కానిస్టేబుల్‌పై కాల్పులు జరిపాడు. అయితే ఆ కానిస్టేబుల్ తృటిలో చావు తప్పించుకున్నాడు. అతనిలోని మిలిటెన్సీని చూసిన పార్టీ రిక్రూట్ అయిన కొద్ది రోజులకు అతన్ని ప్లటూన్‌కు బదిలీ చేసింది. ఆ తర్వాత రెండున్నర సంవత్సరాలు కా. ప్రశాంత్ సి.సి.ఎంకు గార్డ్‌గా పని చేసాడు. సిసిఎంకు గార్డుగా ఉన్నప్పుడు దండకారణ్యంలోని ధర్మా గ్రామంలో స్కూళ్లో సి.ఆర్.పి.ఎఫ్ వాళ్లు వేసిన క్యాంపుపై దాడి చేసి వాళ్లను తరిమివేసిన ఘటనలో ఉత్సాహంగా పాల్గొన్నాడు. గార్డు నుండి రిలీవ్ అయిన తర్వాత ఎ.సి సభ్యుడై, తాను మొదట పని చేసిన మంథని ఏరియాలో పని చేస్తానని చెప్పాడు.

ఈ క్రమంలో మిలటరీ ప్రాక్టీస్ చేస్తుండగా ప్రమాదవశాత్తు పడిపోవడంతో చేయి రెండు ముక్కలుగా విరిగిపోయింది. దానితో బదిలీ చేసిన ఏరియాకు కాకుండా చికిత్స కోసం వెళ్లాల్సి వచ్చింది. నాలుగు నెలల తర్వాత చేయి అతుక్కున్నది గానీ బలహీనంగానే ఉన్నది. అయినప్పటికీ 2006లో కొత్తగా ఏర్పాటు చేసిన పి.ఎల్‌కు సెక్షన్ కమాండర్‌గా పని చేయాలని పార్టీ తీర్మానించింది. చేయి విరిగి బలహీనంగా ఉన్నప్పటికీ తనకు మిలటరీపై ఉన్న ఆసక్తి వల్ల ఆ బాధ్యతలను సంతోషంగా చేపట్టాడు.

ఆ బాధ్యతలను నిర్వర్తిస్తున్న క్రమంలోనే కా. ప్రశాంత్ అమరుడయ్యాడు. కా. ప్రశాంత్‌లోని విప్లవ దృఢ దీక్ష, వర్గకసి మనకు ఆదర్శం కావాలి.

★

**జూలై 28 నుండి ఆగస్టు 3 వరకు అమరుల సంస్మరణ వారం వర్ధిల్లాలి!**

## సల్వాజుడూం ముఖంపై పి.ఎల్.జి.ఎ ముష్టి ఘాతాలు

# ఊర్పల్ మెట్ట, తాడిమెట్ల ఘటనలు

2007 జూలై 9వ తేదీన దండకారణ్య ఉద్యమ ప్రాంతంలో దక్షిణ బస్తర్ డివిజన్‌లో ఊర్పల్ మెట్ట (ఉడుము గుట్ట) ప్రాంతంలో పి.ఎల్.జి.ఎ సాహసయోధులు శత్రువుతో జరిగిన యుద్ధంలో వీరోచితంగా పోరాడి 24 మంది పోలీసులను (సి.ఆర్.పి.ఎఫ్, సల్వాజుడూం ఎస్.పి.ఒ) నిర్మూలించారు. గ్రామాలపై దాడి చేసి, ప్రజల ఆస్తులను లూటీ, ధ్వంసం చేసి, దొరికిన ప్రజలను పట్టుకుని శిబిరాలకు తరలించాలని, గెరిల్లాలపై దాడి చేయాలనే లక్ష్యంతో ఎర్రబోరు శిబిరం నుంచి 120 మంది పోలీసులు బయలుదేరారు. మారాయిగూడ గ్రామంలో ప్రజా మిలీషియా మీద, ప్రజల మీద దాడి చేసి, ఇళ్లు తగుల బెట్టి, ప్రజలను వెంటపడి తరిమారు. ఈ విషయం తెలుసుకున్న పి.ఎల్.జి.ఎ బలగాలు చాలా దూరం ప్రయాణం చేసి, శత్రువును ఎదుర్కొన్నారు. ఈ యుద్ధంలో తమ మీద, ప్రజల మీద దాడికి వచ్చిన శత్రువునే గెరిల్లాలు ఎదుర్కొని, అప్పటికప్పుడు ఏర్పాటు చేసిన ఆంబుష్‌లో చుట్టు ముట్టి శత్రువును పెద్ద మొత్తంలో నిర్మూలించి, 21 తుపాకులతో పాటు పలు గ్రెనేడ్లు, మోర్టార్‌షెల్స్, మందుగుండు, వైర్‌లెస్ సెట్లు తదితర సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

అదే విధంగా ఆగస్టు 29వ తేదీన ఇదే దక్షిణ బస్తర్ డివిజన్‌లోని జేగురుగొండ ఏరియాలోని తాడిమెట్ల ప్రాంతంలో పి.ఎల్.జి.ఎపై దాడికి వచ్చిన శత్రువుతో ముఖాముఖి తలపడి 12 మంది పోలీసులను గెరిల్లాలు నిర్మూలించారు. ఈ ఘటనలో శత్రువుకు చెందిన వివిధ రకాల 14 ఆయుధాలు, మందుగుండు, వైర్‌లెస్ సెట్లు తదితర సామాగ్రిని పి.ఎల్.జి.ఎ గెరిల్లాలు స్వాధీనం చేసుకున్నారు. గత రెండున్నర సంవత్సరాలుగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని ఫాసిస్టు బి.జె.పి ప్రభుత్వం దండకారణ్య ఉద్యమంపై సల్వాజుడూం పేర సాగిస్తున్న అమానవీయ దమనకాండలో నలిగిపోతున్న ప్రజల్లో పి.ఎల్.జి.ఎ యోధులు చేసిన ఈ సాహసోపేత దాడులు ఆనందోత్సాహాలను నింపాయి.

ప్రపంచబ్యాంకు ఒప్పందాల రెండవ దశ అమలులో భాగంగా సరళీకరణ, ప్రయివేటీకరణ, ప్రపంచీకరణ (ఎల్.పి.జి) విధానాలను పాలక ప్రభుత్వాలు దూకుడుగా ముందుకు తీసుకువస్తూ, దేశంలో అపారమైన ఖనిజ సంపదలున్న ఆదివాసీ నివాస ప్రాంతాలను సామ్రాజ్యవాద, స్వదేశీ బహుళజాతి కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నాయి. అక్కడి విలువైన సంపదల్ని వీరు తరలించుకుపోవడానికి ఆదివాసులను తమ జీవనాధారమైన అడవి నుంచి పెద్ద ఎత్తున తరమివేసే కార్యక్రమాన్ని చేపట్టాయి. అందులో భాగంగానే ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, బీహార్, ఒరిస్సా, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలల్లో ఆదివాసులపై ప్రభుత్వాలు దుర్మార్గమైన దమనకాండను విచ్చలవిడిగా కొనసాగిస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో, దండకారణ్యంలో విప్లవోద్యమ ప్రభావంతో చైతన్యవంతులవుతున్న ఆదివాసీ ప్రజలపై సల్వాజుడూం పేరుతో ప్రభుత్వం యుద్ధాన్ని ప్రకటించింది. ప్రభుత్వం తయారు చేసిన ఎస్.పి.ఒలు, సల్వాజుడూం గూండాలూ, పోలీసులతో కలిసి వందలాది గ్రామాలను నేలమట్టం చేసి, ప్రజల ఆస్తులను లూటీ చేసి ఇప్పటి వరకు 500 మందికి పైగా ప్రజలను చంపివేశారు. వంద మందికి పైగా మహిళలపై అత్యాచారాలకు పాల్పడ్డారు. వేలాది మంది ప్రజలను బతుకుదెరువుకు దూరం చేసి సహాయ శిబిరాల పేర తయారు చేసిన నిర్బంధ శిబిరాలకు తరలించారు.

బతుకే నిత్య పోరాటంగా జీవించే ఆదివాసీ ప్రజానీకం, తమ జీవనాధారం నుంచి తమను తరిమివేయడాన్ని వ్యతిరేకిస్తూ యుద్ధానికే సిద్ధమై నిలబడ్డారు. పి.ఎల్.జి.ఎతో కలిసి సల్వాజుడూంను దృఢంగా ఎదుర్కొంటున్నారు. వందలాది యువతీ యువకులు ప్రజా మిలీషియాలో చేరి ఈ అన్యాయమైన యుద్ధాన్ని ఓడించడానికి ప్రజాయుద్ధంలో సైనికులుగా సాయుధులవుతున్నారు. విప్లవోద్యమాన్ని నిర్మూలించి, దండకారణ్యాన్ని అవలీలగా తన చేతిలోకి తీసుకోగలమని భావించిన ప్రభుత్వం ప్రజలూ, ప్రజావిముక్తి గెరిల్లాల తీవ్ర ప్రతిఘటనతో తన లక్ష్యం అనుకున్నంత సులభంకాదని గ్రహించింది. రకరకాల కేంద్ర పారామిలటరీ బలగాలను దింపి కొనసాగిస్తున్న దుర్మార్గపు దాడిని పి.ఎల్.జి.ఎ బలగాలు వీరోచితంగా పోరాడుతూ ఓడిస్తున్నాయి. సరైన ఎత్తుగడలతో పి.ఎల్.జి.ఎ చేపడుతున్న దాడులు క్రమంగా ఫలితాలనిస్తున్నాయి.

మురికినార్, బైలడిల్లా, ఎర్రబోరు, రాణిబోధిలి లాంటి పెద్ద దాడులతో పాటు అనేక చిన్న చిన్న దాడులు, ఆంబుష్‌లలో, అనేక విడి విడి ఘటనలలో శత్రువును బలమైన దెబ్బలు తీస్తూ దండకారణ్యంలో శత్రువు తలపెట్టిన దాడిని వెనుకకు


*(తరువాయి 31వ పేజీలో.....)*

అంతర్జాతీయం

# బద్దలవడానికి సిద్ధంగా లాటిన్

ఇవాళ లాటిన్ అమెరికా బద్దలవడానికి సిద్ధంగా ఉన్న అగ్నిపర్వతంలా ఉంది. వ్యవస్థలో సాధారణ సంక్షోభం ఆర్థిక, రాజకీయ సామాజిక పరిస్థితిలో ప్రతిబింబిస్తున్నది.

గడచిన 20 సంవత్సరాలలో లాటిన్ అమెరికాలో పేద ప్రజల సంఖ్య 120 నుంచీ 230 మిలియన్‌లకు పెరిగింది. ఇందులో 100 మిలియన్‌ల మంది 36 దేశాలలో ఉన్నారు. లాటిన్ దేశాలన్నింటిలోనూ అర్ధ భూస్వామ్య భూ యాజమాన్యం నిలబెట్టడం వల్ల కార్మికవర్గం మీదనూ, ప్రజల మీదనూ దోపిడీ భరించరాని స్థాయికి చేరుకుంది.



మరో పక్క ఈ పునాదిగానే ఇటీవల ప్రజల తిరుగుబాటులు లాటిన్ అమెరికాలో పెంపొందుతున్నాయి. మరిన్ని పెద్ద వర్గ సంఘర్షణలు త్వరలోనే బద్దలవుతాయి.

విశాల సామ్రాజ్యవాద వ్యతిరేక భావం ఇక్కడ పెంపొందుతున్నది. కీలుబొమ్మ ప్రభుత్వాలు దాడికి కేంద్రంగా ఉన్నాయి. ఆకలీ, వేదనా, అణచివేతలు పెరుగుతూ ఇరాకీ ప్రతిఘటనా, సామ్రాజ్యవాద దురాక్రమణకు వ్యతిరేకంగా ప్రపంచంలో ఇతర ప్రాంతాలలో ప్రతిఘటనలను చూసి ప్రజలు తిరుగుబాటుకు సిద్ధమవుతున్నారు. ప్రజలు తమ్ము తాము సంఘటితం చేసుకుని పోరాడితే వర్గ శత్రువులను ఓడించగలరని ఇది నిరూపిస్తున్నది.

ఇటువంటి బద్దలయే పరిస్థితి వల్ల ముఖ్యంగా దక్షిణ అమెరికాలో అమెరికా సామ్రాజ్యవాదం పథకాలు మార్చుకుంది. ఇరాక్‌లో శాశ్వతంగా ఉండే ప్రయత్నం చేస్తూనే మధ్య ప్రాచ్యంలో తమ దిశ మార్చుకోవాలని భావిస్తున్నది. సాధారణ సంక్షోభం వల్ల వివిధ లాటిన్ దేశాలలో ఆర్థిక సంక్షోభం తీవ్రమైన సామాజిక సంక్షోభాన్ని సృష్టించింది. ఆ తరువాత రాజకీయ సంక్షోభాలు వచ్చాయి. వీటికి పరిష్కారం కూడా కనుచూపు మేరలో లేదు.

బుష్ నేతృత్వంలో జరిగిన సామ్రాజ్యవాద దాడితో ఈ సంక్షోభం జాతులకూ పీడిత ప్రజలకూ మధ్య వైరుధ్యాన్ని ఊహించలేని స్థాయికి తీసుకువెళ్ళింది. దీని వల్లనూ పెట్టుబడిదారీ విధానంలో ఉన్న సాధారణ సంక్షోభం వల్లనూ సామ్రాజ్యవాద వ్యతిరేక వైరుధ్యాలు మరింత తీవ్రతరమవుతున్నాయి. ఆర్థిక పెట్టుబడికి దక్షిణ అమెరికా మంచి టార్గెట్ అయింది. చైనా, ఐరోపా సామ్రాజ్యవాదం లాభకరమైన వాణిజ్య సంబంధాల కోసం ప్రయత్నించాయి. ఈ నేపథ్యమూ, అలాగే పరిష్కారం కాని భారీ సంక్షోభమూ ఆధిపత్య సామ్రాజ్యవాదపు రక్షణకు లాటిన్ అమెరికా పూర్తి భూభాగం అవసరమని తెలియజేస్తున్నాయి.

నిజానికి అమెరికా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని తీసుకువచ్చింది. ఇది క్యూబాను బెదిరించసాగింది. వెనిజులాను దురాక్రమించేందుకు పథకం సిద్ధం చేస్తున్నది. ఈక్వడార్, పెరూ, పెరాగ్వే, కొలంబియాల వంటి అనేక లాటిన్ అమెరికా దేశాలలో సైనిక కేంద్రాలు నెలకొల్పడమే కాక బ్రెజిల్, అర్జంటీనా, పెరాగ్వేలు కలిపిన ట్రిపుల్ ఫ్రాంటియర్ ఆఫ్ ప్లాటాలో కూడా పెట్టాలని యోచిస్తున్నది.

వెనిజులా వారి రెండో అతి పెద్ద చమురు సరఫరాదారు. అది వారి అదుపులో నుంచి తప్పించుకుంటున్నది. దీంతో వారి సంక్షోభం మరింత పెరిగింది. చావెజ్ అమెరికాను

# ఉన్న అగ్ని పర్వతం అమెరికా

విమర్శించడంతో భవిష్యత్తు జోక్యానికి దీన్ని సాకుగా వాడుకున్నారు. ఇరాక్ తరువాత వెనిజులాతో ఘర్షణ అమెరికా వ్యూహంలో ఒక భాగం.

ముఖ్యమైన ఆర్థిక అదుపులూ కమ్యూనికేషన్ సాధనాలూ తన అదుపులో ఉంచుకున్నప్పటికీ వెనిజులా అంతర్గత ప్రతీఘాతుక రాజకీయాలతో పెద్ద ఓటములు ఎదుర్కొంది. అయితే చావెజ్ ప్రజల మద్దతు మీద ఆధారపడి ఉన్నాడు. మిలీషియా నిర్మాణంతో సైన్యాన్ని విస్తరిస్తున్నాడు. అమెరికాకు వ్యతిరేకంగా ఉన్న అతనికి అంతర్జాతీయ మద్దతు, ఐరోపా, చైనా, రష్యాలతో మైత్రీ ఉన్నాయి.

అయితే లోతైన సంక్షోభం, మరింత మౌలికమైన ప్రజా తిరుగుబాట్లు జరుగుతున్న ఈ భౌతిక పరిస్థితి వెలుగులో - బలమైన ప్రభావం, నూతన అధికార నిర్మాణానికి విప్లవకర మార్గం నిర్దేశించే కార్మికవర్గ నాయకత్వం లేకపోవడం, అవకాశవాదమూ ఈ ఖండానికి కేంద్ర సమస్యగా వుంది.

లాటిన్ అమెరికాలో పెద్ద ఎత్తున ఉన్న జనాభా సాయుధ పోరాటంతో సహా వివిధ రకాల అనుభవాలను చవి చూస్తున్నారు. అయితే వారి నాయకులు లొంగిపోయారు. ఇప్పుడు దాదాపు అందరూ తమ తమ దేశాలలో పాత రాజ్యాలతో సామరస్యం కోసం ఎన్నికల వివాదాలలోకి దిగారు. అవకాశవాదం నిస్సిగ్గుగా సోషలిజం గురించి మాట్లాడుతూ సామ్రాజ్యవాదానికి విధేయంగా ఉంటుంది. అందుకనే నికరాగువాలో ఫ్రెంట్ సాంతీనిస్టాకు చెందిన డానియల్ ఓర్టెగాను ఇటీవల నికరాగువా గెరిల్లాలు సామ్రాజ్యవాద వ్యతిరేకత నుంచీ పెట్టుబడిదారీ రూపకర్తగా మారాడని ఆరోపించారు.

లాటిన్ అమెరికా అంతటా సంక్షోభం ఉండడంతో పాలక వర్గాలూ, సామ్రాజ్యవాదం ఆ ప్రాంతంలో సామాజిక అసంతృప్తిని చల్లబరచడం కోసం 'వామపక్షం'గా పరిగణనలో ఉన్న వారినే అధ్యక్షులుగా ఎన్నుకోవడాన్ని సాధారణ ఎత్తుగడలుగా వినియోగిస్తున్నారు. లులా, కిర్చ్నర్, బాచెలెట్, ఇవో మోరేల్స్, తబారే వాస్క్, నికనోర్ డుయార్టే, అలెజాంద్రో టోలెడో అందరూ సామ్రాజ్యవాదులకు అనుకూలమే. చావెజ్ కు అమెరికా వ్యతిరేక వైఖరి ఉన్నది.

అయితే ఇంతకు ముందు చెప్పినట్టుగా లాటిన్ అమెరికాలో ప్రజల పోరాటాలలో నాయకత్వ తప్పులు గడచిన కాలంలో తీవ్రమైన ఓటములు చవి చూసాయి. ఈ విప్లవోద్యమ, కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో రివిజనిజం, అవకాశవాదం, సంస్కరణవాదం, పసిఫిజం, ఎన్నికలవాదం తీవ్రమైన సమస్యగా మారాయి. అవకాశవాద ముసుగును తొలగించి కార్మికవర్గ నాయకత్వంలో సరైన కార్యక్రమం, నిర్మాణ, పోరాట రూపం, పద్ధతుల ద్వారా ప్రజలలో విప్లవ శక్తిని పెంపొందింపజేయడం విప్లవకారులకు, నిజమైన సామ్రాజ్యవాద వ్యతిరేకులకు, ముఖ్యంగా కమ్యూనిస్టులకు అతి పెద్ద సవాలు.

ప్రస్తుతం సామ్రాజ్యవాదం మరోసారి ఆధిపత్యం కోసం ఎత్తుగడలు మార్చుకోవలసి వచ్చినప్పుడు సైనికీకరణ, ఫాసిజాలకు పాల్పడుతున్నది. నగరాలలో తీవ్ర సంక్షోభం ఎదుర్కొంటున్న సామ్రాజ్యవాద విధానం ఫాసిజం. వలస, అర్ధ వలసలలో దీన్ని శాశ్వతంగా ఆచరించవలసి ఉంటుంది. ఇందుకోసం స్పష్టంగా బూటకపు ప్రజాస్వామిక పద్ధతులలో ఫాసిస్టు పాలనలను, లేదా వక్రీకరించిన రూపాలనూ వినియోగించుకుంటుంది. ఇదే ఫాసిజానికి ఇవి ఆధునిక రూపాలు.

విశాల ప్రజానీకాన్ని దోపిడీ చేస్తూ, అణచివేస్తూ 'ప్రజాస్వామ్యం' అనే భావాన్ని అమ్ముకోవడం పాత రాజ్యంలో, సామ్రాజ్యవాదం సేవలో అవకాశవాదం పాత్ర. 'బూర్జువా సంస్థలు', 'పార్లమెంటు', 'పత్రికా స్వేచ్ఛ', 'మానవ హక్కులు', 'పౌరసత్వం' వంటి వాటిని పరిరక్షించడంలో భిన్నమైన రూపం తీసుకోవడానికి ప్రయత్నించినప్పటికీ ఇది చేసేది పూర్తిగా ప్రజా ఉద్యమాలకు వ్యతిరేకం.

ఏదేమైనా సామ్రాజ్యవాద సంక్షోభం లోతైనదీ, పరిష్కరించలేనిదీ. లాటిన్ అమెరికాలో విప్లవ జ్వాల ఎగుస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా వర్గ పోరాట అభివృద్ధిలో పొందిన అనుభవాల నుంచీ, తప్పులూ, విజయాల నుంచీ నేర్చుకుంటూ ఉన్నది.

ప్రపంచంలో అనేక ప్రాంతాలలో, ముఖ్యంగా 'వెనుక ప్రాంగణం'గా భావించే లాటిన్ అమెరికాలో రానున్న సంవత్సరాలలో సామ్రాజ్యవాదం గొప్ప తుఫానులు ఎదుర్కొంటుంది. ప్రజా విప్లవ పోరాటం అభివృద్ధి చెందడంతో అనేక సంవత్సరాలుగా దోపిడీకీ ఊచకోతకూ గురయిన లాటిన్ ప్రజలు తమ విముక్తి కోసం వెనక్కి తిరగని పంథా అనుసరిస్తారు.

## లాటిన్ అమెరికా - రగుతున్న జ్వాల

లాటిన్ అమెరికా, ఇంకా చెప్పాలంటే అమెరికా, కెనడా మినహా యావత్తు అమెరికా ఖండం భారీ అమానవీయ దోపిడీకి ప్రబలమైన ఉదాహరణ. ఈ ఖండంలో అంతటా పాలక వర్గాలకు ప్రాతినిధ్యం వహించే స్థానిక పెత్తందారులు అంటే, భూయజమానులు, గని యజమానులు, దళారీ బూర్జువా వర్గం సామ్రాజ్యవాద ప్రపంచ పెట్టుబడితో కుమ్మక్కై, గొప్ప లాభాలు చేసుకుంటున్నారు. పొలాలలో, ఫ్యాక్టరీలలోనూ అత్యధికులు నిర్దాక్షిణ్యమైన దోపిడీకి గురి అవుతున్నారు. ఉపాధి లేక ఆకలితో బాధపడుతున్నారు. వారికి ఉండడానికి గూడు లేదు. ఆరోగ్యం లేదు. విద్య లేదు. ఈ ఖండంలో వనరులన్నింటినీ నిరంతరం చొచ్చుకువస్తున్న బహుళజాతి కంపెనీలూ వారి స్థానిక చెంచాలూ పీల్చుకుంటున్నాయి. ప్రజలను ఇంకా ఇంకా పేదరికంలోకి నెడుతున్నాయి. గడచిన ఇరవై సంవత్సరాలుగా ఇక్కడ అమలవుతున్న నయా ఉదారవాద ఆర్థిక వ్యవస్థలు ప్రపంచ పెట్టుబడి లూటీని పెంచడం మాత్రమే కాక రకరకాల ప్రభుత్వాలు చేపట్టిన చర్యల వల్ల లాటిన్ అమరికా ప్రజల జీవితాలను మరింత వేదనాభరితంగా తయారు చేసాయి. సామ్రాజ్యవాదంతో షరీకైన ఈ దళారులే ప్రజల సమస్యలన్నింటికీ మూల కారణం అని గుర్తించాలి. ఎగుమతి దిశగా యావత్తు ప్రాంతాన్నీ మార్చివేసారు. నగరాల పెట్టుబడికి ఈ ప్రాంతంలో సుసంపన్నమైన వనరులు ఉపయోగపడుతున్నాయి. పాలక వర్గాలు ప్రజల అసంతృప్తిని తీవ్రంగా ఎదుర్కొంటున్నాయి. దాంతో వారిని అణిచివేయడానికి రకరకాల మార్గాలు అవలంబిస్తున్నాయి. అయితే 'ప్రజల హక్కులు అడుక్కుంటే వచ్చేవి కావు, పోరాడి సాధించుకోవలసినవి' అని ప్రజలు ఇంకా ఇంకా గుర్తిస్తున్నారు.

### చారిత్రక దృక్పథం

గడచిన 500 సంవత్సరాలుగా లాటిన్ అమెరికా చరిత్రలో వలస, దోపిడీలు ఎంతగా ఉన్నాయో పీడకులకు వ్యతిరేకంగా ప్రజల వీరోచిత ప్రతిఘటన కూడా అంతగానూ ఉన్నది. క్రీ.శ. 1493లో అమెరికాను కనుగొనడంతో ఐరోపా దురాక్రమణలు ప్రారంభమయ్యాయి. ఈ దురాక్రమణలలో ప్రజలను ఊచకోత కోసారు. ఇక్కడ స్థిరపడ్డవారు సాగు భూములను స్వాధీనం చేసుకుని క్షీణించిన ఇండియన్ తెగ జనాభాను వేరే ప్రాంతాలకు పంపేసారు. లేదా తమ భూములలోనే కార్మికులుగా మార్చేసారు. ఉత్తర అమెరికాలో దేశీయ జనాభా నాగరిక బార్బేరియనుల ద్వారా దాదాపు తుడిచిపెట్టుకుపోయింది. దక్షిణాన బ్రెజిల్‌ను ఆనుకుని పోర్చుగీసు వలసవాదులు స్థిరపడ్డ చోట స్పానిషు చక్రవర్తి అదుపు తీసుకున్నాడు. లాటిన్ అమెరికా వీరోచిత దేశీయ ప్రజలు ప్రారంభ సమరంలో ఓడిపోయినప్పటికీ పూర్తిగా శత్రువుకు లొంగిపోలేదు. దేశీయ ప్రజలను బానిసలుగా వాడుకోవాలన్న సామ్రాజ్యవాద పథకాన్ని ఇండియనుల సాయుధ దాడులూ, వారు అక్కడి నుంచీ ఖాళీ చేయడంతో ఓడిపోయాయి. దీంతో పొలాలలో ఫ్యాక్టరీలలో పని చేయడానికి వలసవాదులు ఆఫ్రికా నుంచీ బానిస శ్రమను దిగుమతి చేసుకోవలసి వచ్చింది.

ఐరోపాలో నెపోలియను యుద్ధ కాలంలో క్రీ.శ. 1810లో లాటిన్ అమెరికా వలసల మీద స్పానిషు, పోర్చుగీసు అదుపు బలహీనపడుతూ వచ్చింది. ఆవిర్భవిస్తున్న బడా భూస్వాముల, గని యజమానుల, ఎగుమతిపర దళారీ లంపెన్ బూర్జువా వర్గం ప్రగతిశీల జాతీయ బూర్జువా వర్గంతో కుమ్మక్కైన పాలక వర్గాలు, స్పెయిన్, పోర్చుగల్‌ల అదుపుకు వ్యతిరేకంగా తిరగబడిన ప్రజలను దోపిడీ చేసారు. దాదాపుగా ఖండం అంతా స్పెయిన్, పోర్చుగల్‌ల సామ్రాజ్యవాద అదుపు నుంచీ విముక్తి పొందింది. సైమన్ బొలివర్ నాయకత్వంలో బొలీవియా ఆండియన్ ప్రాంతం, కొలంబియా, వెనిజులాలు 1825లో స్పానిషు పాలన నుంచీ విముక్తి పొందాయి. అయితే ఉత్తర అమెరికా అదుపు నుంచీ బయటపడి లాటిన్ అమెరికాను సమైక్యంగా నిలబెట్టాలన్న సైమన్ బొలివర్ జాతివాద స్వప్నం నెరవేరలేదు. సామ్రాజ్యవాద శక్తుల అదుపుల నుంచీ పొందిన స్వాతంత్ర్యం స్వతంత్ర పెట్టుబడిదారీ పెరుగుదలకు దారి తీయలేదు. ఎగుమతి దిశగా దళారీ బూర్జువా వర్గం భూస్వాములతో గని యజమానులతో కుమ్మక్కై స్థానిక, జాతీయ పరిశ్రమల పెరుగుదలను ప్రోత్సహించే ఆర్థిక విధానాలను వ్యతిరేకించింది. ఐరోపాల, ఉత్తర అమెరికాల నుంచి చౌక పారిశ్రామిక దిగుమతులు చేసింది. పొలాలలో శ్రమిస్తున్న ప్రజల కొనుగోలు శక్తి పెంచే పునఃపంపక భూ సంస్కరణ కార్యక్రమాలను కూడా ఈ పాలక వర్గం తీవ్రంగా వ్యతిరేకించింది. దీంతో స్థానిక మార్కెట్, ఆర్థిక ఉత్పత్తి విస్తరించాయి. ప్రగతిశీల జాతీయ బూర్జువా వర్గానికీ దళారీ బూర్జువా వర్గం, భూస్వాములకూ మధ్య ఘర్షణలో ఈ రెండో వర్గం గెలిచింది. లాటిన్ అమెరికా పొలాలూ గనుల నుంచీ సగం శుద్ధి చేసిన ఉత్పత్తులు అవసరం అయిన బ్రిటిషు, అమెరికా సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ శక్తులు ఆవిర్భవించడంతో ఈ వర్గం నూతన దోపిడీ బంధనాలు నెలకొల్పింది. ఈలోగా అమెరికాలో సరిగ్గా ఇందుకు భిన్నంగా జరిగింది. ఉత్తరాన పారిశ్రామిక ప్రగతిశీల జాతీయ బూర్జువా వర్గం ఎగుమతి దృష్టితో ఉన్న పత్తి రైతులనూ తోటల యజమానులనూ బానిస యజమానులనూ దక్షిణ ప్రాంత గని యజమానులనూ ఓడించి పెట్టుబడిదారీ పెరుగుదల మార్గాన్ని తీసుకువచ్చింది.

లాటిన్ అమెరికా ప్రజలు సామ్రాజ్యవాద పాలన నుంచీ విముక్తి కలిగిస్తామన్న హామీలతో మోసపోయారు. పాలక వర్గ రాజకీయ అధికారం సజావుగా ముందుకు రాలేదు. 19వ శతాబ్దం అంతటా ప్రజల తిరుగుబాటులు, ప్రజా పోరాటాలూ

సామ్రాజ్యవాద చెంచాలకు వ్యతిరేకంగా ప్రజల ధైర్యవంతమైన పోరాటాన్ని తెలియజేస్తున్నాయి.

**ప్రపంచ పెట్టుబడి కోరలు - ఐ.ఎం.ఎఫ్ ప్రపంచ బాంకు విధానాలు**

1990లలో భారతదేశంలో అమలు చేసిన పునర్వ్యవస్థీకరణ కార్యక్రమాలు లాటిన్ అమెరికాలో అంతకు చాలా కాలం ముందే తీసుకువచ్చారు. 1973లో ప్రగతిశీల సాల్వడార్ అలెండీని దింపివేసి అధికారంలోకి వచ్చిన చిలీ నియంత పినోచెట్ విదేశీ పెట్టుబడికి వెసులుబాటు ఇచ్చే పునర్వ్యవస్థీకరణ కార్యక్రమాలను అమలు చేసాడు. 1980లలోనూ 1990 దశకం ప్రారంభంలోనూ లాటిన్ అమెరికా సైనిక నియంతృత్వాలు ఆర్థిక వ్యవస్థలను లోతైన రుణ ఊబిలోకి దింపేసినప్పుడు ప్రజల ఉద్యమాలు మౌలిక మార్పు దిశగా సాగుతున్నాయి. సైనిక నియంతృత్వాల ద్వారా కొనసాగడం సామ్రాజ్యవాదులకూ దళారీ వర్గానికీ అసాధ్యమయింది. ప్రభుత్వ రూపం మార్చారు. నూతన పౌర పాలనలను రానిచ్చారు. మౌలిక మార్పు జరిగే అవకాశాన్ని దెబ్బ కొట్టారు. ప్రజాస్వామ్యం అంటూ ప్రజలను మోసం చేసారు. ఆర్థిక, సైనిక, రాజకీయ అదుపు ఈ నూతన ప్రభుత్వాలలో ఉంచారు. ప్రజల ఆశలు కూలిపోయాయి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పేరుతో దళారీ పౌర ప్రభుత్వాల స్థానంలో కీలు బొమ్మ సైనిక ప్రభుత్వాలు వచ్చాయి. అమెరికాకూ ప్రపంచ సామ్రాజ్యవాదానికీ చెంచాలుగా ఉండిపోయాయి. లోతైన రుణ సంక్షోభం నూతన పౌర ప్రభుత్వాలకూ వారి విదేశీ యజమానులకూ సహాయపడింది. ఆర్థిక కోతలు, వేతనాల ప్రతిష్టంభన, తొలగింపు, ఇతర శ్రమ మార్కెట్ సంస్కరణలు కార్మికవర్గ వెసులుబాటు శక్తిని తగ్గించడం, ప్రభుత్వ సంస్థల జాతీయీకరణ, వనరుల విజాతీయీకరణ వంటి ఐ.ఎం.ఎఫ్, ప్రపంచ బాంకుల విధానాలను ఇది సమర్ధించింది. భవిష్యత్తులో అప్పు తీసుకోవడం మాట అటుంచి ఈ విధానాలు ఈ ప్రాంతంలో అపారమైన రుణ భారాన్ని తీసుకువచ్చాయి. సామ్రాజ్యవాద పెట్టుబడి మీద ఆధారపడేట్టు చేసాయి.

**నాఫ్టా బ్లాలు, ఎఫ్.టి.ఏ.ఏ - 1944 నుంచీ 'వ్యాపార' సూత్రం**

యుద్ధం తరువాత అమెరికా సామ్రాజ్యవాదం లాటిన్ అమెరికా దేశాల మీద గట్టి అదుపు కోసం ప్రయత్నించింది. ఉత్తరాన అలాస్కా నుంచీ దక్షిణం వరకూ సమస్త వ్యాపార బంధాలనూ కూల్చేయాలని దాని లక్ష్యం. ఇలా చేస్తే సహజ వనరుల మీదనూ శ్రమ వనరుల మీదనూ అమెరికా సామ్రాజ్యవాదానికి హక్కు పెరుగుతుంది. జపాన్, ఐరోపా పెట్టుబడిని పక్కన పెట్టవచ్చు. తమ పథకాన్ని అమలు చేయడం కోసం ముందుగా 1994లో అమెరికా, కెనడా, మెక్సికోలు కలిసి ఉత్తర అమెరికా స్వేచ్ఛా వ్యాపార ఒప్పందాన్ని అమలు చేసారు. ప్రారంభం నుంచీ కూడా నాఫ్టాను అమెరికా వ్యవసాయ వ్యాపారానికీ పరిశ్రమలకూ పెట్టుబడికీ అనుకూలంగా తయారు చేసారు. భారీ వ్యవసాయ వ్యాపారం కోసం అమెరికా ప్రభుత్వం రాయితీలను తగ్గించలేదు. వారి ఉత్పత్తులను ఇతర దేశాలలో చాలా చౌకగా అమ్ముకున్నారు. కెనడా, మెక్సికోల నుంచీ దిగుమతులకు వ్యతిరేకంగా రక్షణ చర్యలు ఉంచుకోగలిగింది. ఈ అసమాన నియమాల వల్ల అమెరికా పెట్టుబడి, పెట్టుబడి రక్షణలకు సంబంధించి, మేధో సంపత్తి హక్కులకు సంబంధించి, అలాగే పారిశ్రామిక, వ్యవసాయ ఉత్పత్తుల మీద వ్యాపార టారిఫ్ ఆంక్షలు ఎత్తివేతకు సంబంధించీ చాలా తీవ్రమైన సరళీకరణ నియమాలు అనుసరించింది. నాఫ్టా ఒప్పందాలతో పెట్టుబడి పెట్టిన వారి పెట్టుబడులకు అత్యంత రక్షణ ఏర్పడింది. దేశీయ విధానాలలోనూ అంతే, పర్యావరణం, ఆరోగ్యం, ఆహారం, భద్రతా నిబంధనలలో మార్పు జరిగితే వారు నష్ట పరిహారం కోరవచ్చు. దీంతో పెట్టుబడి నుంచీ పరోక్ష లాభం పొందే అవకాశం ఏర్పడింది. దాదాపు 12 సంవత్సరాల అమలు తరువాత నాఫ్టా ఈ మూడు దేశాలలోనూ పెట్టుబడికి అపారమైన లాభాలు, ప్రజలకు వేదనా తీసుకువచ్చింది. స్వేచ్ఛా వ్యాపార ఒప్పందాల విజయ గాథగా యావత్తు ప్రపంచం చెప్పుకునే మెక్సికోలో 2005 అమెరికా మానవాభివృద్ధి నివేదిక ప్రకారం - 'ఈ ఎగుమతి విజయ గాథకు పూర్తి భిన్నంగా 1990-2003 మధ్య కాలంలో ఆర్థిక ప్రగతి తలసరి కేవలం ఒక్క శాతం పెరిగింది. నిజ వేతనాలు స్తంభించిపోయాయి. నిరుద్యోగం 1990ల ప్రారంభంలో కంటే ఎక్కువయింది'. అమెరికా నుంచీ రాయితీ మొక్కజొన్నను దిగుమతి చేసుకుని దాని టారిఫ్‌ను 99 శాతం తగ్గించింది. మొక్కజొన్న సాగు ఆర్థికంగా గిట్టుబాటు కాని రైతులు తీవ్ర ఇబ్బందులకు గురి అయ్యారు. మెక్సికో మొక్కజొన్న రైతుల నిజ ఆదాయంలో 70 శాతం తగ్గుదల ఏర్పడింది. వ్యవసాయ ఉపాధి 1.3 - 1.85 మిలియనులకు పడిపోయింది. వ్యవసాయ ఎగుమతి పెరుగుదలను భారీ నీటి పారుదల సౌకర్యం వున్న వాణిజ్య కేంద్రాలలో కేంద్రీకరించారు. చిన్న రైతులు పెరిగిన దిగుమతి పోటీకి సర్దుకున్నారు. వ్యవసాయం ఆర్థికంగా గిట్టుబాటు కాకపోవడంతో దాదాపు గ్రామాల నుంచీ ప్రతీ రోజూ 1000 మంది మెక్సికనులు ఉపాధి కోసం పట్టణాలకూ లేదా చట్ట వ్యతిరేక శరణార్థులుగా అమెరికాకూ వెళుతున్నారు. మక్విలడోరో జోన్‌లో జరిగే ఉత్పత్తి కేవలం ఎసెంబ్లీ చేయడానికీ విడి భాగాలను తిరిగి ఎగుమతి చేయడానికీ దిగుమతి చేయడానికీనో పరిమితం అయింది. అందుకని ఉత్పత్తి ఎగుమతులు పెరిగినప్పటికీ అది ఉన్నత సాంకేతికతా ఊపుకు దారి తీయలేదు. చౌక శ్రమ లభ్యమయే ఈ మక్విజోరాస్‌కు విదేశీ పెట్టుబడి వచ్చే అవకాశం ఉండడం మాత్రమే కాకుండా మెక్సికో ఎగుమతి ప్రోత్సాహక మండలాలలో ఉత్పాదకత పెరిగి నిలదొక్కుకున్నప్పటికీ వేతనాల గురించి మాట్లాడే కార్మిక సంఘాలు లేకపోవడం వల్ల నిజ

వేతనాలు పెరగలేదు. ఈ మండలాలలో మహిళల సంఖ్య పెరగడం వల్ల వారి వేతనాలు పురుషుల వేతనాల కంటే పది శాతం తగ్గిపోయాయి. సుదీర్ఘ పని గంటలు, లైంగిక వేధింపు, అభద్రమైన, అనారోగ్య పని పరిస్థితులు, ఉద్యోగాల తొలగింపు వంటి పెట్టుబడిదారీ విధానపు చెడులన్నీ ఈ ఎగుమతుల ప్రోత్సాహక మండలులలో కార్మికులు ఎదుర్కొంటారు. నాఫ్టా వల్ల ఒప్పందంలో భాగమయిన అభివృద్ధి చెందిన భాగస్వాములకు ఉపాధి తక్కువ చేసింది. పెట్టుబడి శ్రమను మరింతగా దుర్వినియోగించడం దీనిలో కనిపిస్తుంది. అమెరికాలో నాఫ్టా వల్ల మొదటి పది సంవత్సరాలలో 5,25,000 మంది ఉద్యోగాలు కోల్పోయారు.

నాఫ్టా వల్ల కలిగిన ఈ నష్టాలు చూసిన లాటిన్ అమెరికా ప్రజలు అమెరికాల స్వేచ్ఛా వ్యాపార ప్రాంతాల ద్వారా యావత్తు అమెరికానూ లూటీ చేసుకునే అమెరికా సామ్రాజ్యవాదపు ఈ మహా పథకానికి వ్యతిరేకంగా తిరగబడ్డారు. 2005 నాటికి తేదీ నిర్ణయించమని అమెరికా చెప్పినప్పటికీ ఈ ప్రజా పోరాటాల వల్ల ఎఫ్.టీ.ఏ.ఏకు తేదీ ఖరారు చేయలేదు. ఎఫ్.టీ.ఏ.ఏ ఒప్పందాలను ముందుకు తీసుకువెళ్లలేక పోయినప్పటికీ అమెరికా చిలీ, కొలంబియా, పెరూలతో స్వేచ్ఛా వ్యాపార ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈక్వడార్‌తో ఇంకా చర్చలు జరుగుతున్నాయి.

### ఖండాన్ని కుదిపివేసిన ప్రజా పోరాటాలు

లాటిన్ అమెరికాలోనూ యావత్తు అమెరికా ఖండంలోనూ ఇటీవల జరిగిన ఘటనలు అమెరికా, ఇతర సామ్రాజ్యవాదుల, ప్రపంచ ఆర్థిక పెట్టుబడి, వారి స్థానిక కుమ్మక్కుదారుల వెన్నులో వణుకు పుట్టించాయి. అమెరికాతో కుదుర్చుకున్న ఒప్పందాలకు వ్యతిరేకంగానూ భూమిని సమానంగా మార్చడానికీ దేశీయ ప్రజల హక్కుల డిమాండ్, వనరుల జాతీయీకరణ, బహుళ జాతి కంపెనీల అవినీతి, లూటీలకు వ్యతిరేకంగానూ, ఈ దేశాల సౌభ్రాతృత్వం కోసమూ, ఐ.ఎం.ఎఫ్, ప్రపంచ బ్యాంకు విధానాల రద్దుకూ, వాటి రుణాల రద్దుకూ, ప్రజలు చేసే పోరాటం అపారమైన ఊపు అందుకుంది. లక్షలాది మంది ప్రజలు అమెరికా ఆర్థిక వ్యవస్థకు దాణాగా ఉపయోగపడుతున్న ఈ 'చట్ట వ్యతిరేక' శరణార్థులకు సంఘీభావంగా ప్రదర్శన చేసారు. లాటిన్ అమెరికా అంతటా సామ్రాజ్యవాదానికి, వారి చెంచాలకూ వ్యతిరేకంగా తమ రోజు వారీ జీవనం కోసం పోరాడుతున్న ప్రజల విశాల మద్దతుతో వలస ఉద్యమం ఊపందుకుంది.

ఈక్వెడార్‌లో నెల రోజుల పాటు ఈ ఒప్పందానికి వ్యతిరేకంగా పోరాటం జరిగింది. ఆండియన్ స్వేచ్ఛా వ్యాపార ఒప్పందానికి వ్యతిరేకంగా కన్ఫెడరేషన్ ఆఫ్ ఇండిజినియస్ నేషనాలిటీస్ ఆఫ్ ఈక్వడార్, కాన్ఫెడరేషన్ ఆఫ్ ది పీపుల్స్ ఆఫ్ కిచువా నేషనాలిటీ ఆఫ్ ఈక్వడార్‌లు పోరాటం చేపట్టాయి. కొలంబియా పెరూ అప్పటికే సంతకాలు పెట్టాయి. ఈ ఒప్పందాలలో ఇంత వరకూ ఏమేం ఒప్పందాలు చేసుకున్నారో బహిరంగపరచాలనీ దేశవ్యాప్త అభిప్రాయ సేకరణ చేయాలనీ వారు కోరారు. అలాగే రాజ్యాంగ సభకు ఎన్నిక నిర్వహించాలనీ ఇది దేశానికి నూతన రాజ్యాంగాన్ని రూపొందిస్తుందనీ బలంగా డిమాండ్ చేసారు. ప్రభుత్వం అమెరికా బహుళ జాతి చమురు కంపెనీ ఓక్సిడెంటల్ పెట్రోలియంతో ఒప్పందం రద్దు చేసుకోవాలని ప్రదర్శనకారులు కోరుతున్నారు. ఓక్సిడెంటల్ ఆరు సంవత్సరాల క్రితం చట్టాన్ని ఉల్లంఘించిందని వీరు పేర్కొన్నారు. అమెరికా సామ్రాజ్యవాదం నుంచీ గట్టి ఒత్తిడి ఉండం వల్ల ఇంధన శాఖ మంత్రి ఈ కాంట్రాక్ట్‌ను రద్దు చేయలేకపోయాడు. అమెరికా ప్రాయోజిత ప్లాన్ కొలంబియాలో భాగం కాకూడదనీ అమెరికా కొలంబియా సైన్యం తమ భూభాగాన్ని వినియోగించుకోరాదనీ ఈ ప్రదర్శకులు డిమాండ్ చేసారు.

రాజధాని క్విటోతో సహా ఈక్వడార్‌లో 22 రాష్ట్రాలలో 14 రాష్ట్రాలలో ఈ ప్రదర్శన ప్రారంభమయింది. వేలాది మంది ప్రదర్శనలు, రాస్తా రోకోలు చేసారు. ఇవి రోజు రోజుకూ పెరగడంతో మధ్యంతర ప్రభుత్వ అంతర్గత వ్యవహారాల మంత్రి రాజీనామా చేయవలసి వచ్చింది. ఈ ఒప్పందం మరింత స్పష్టంగా ఉండాలని ప్రజలు కోరడం సరైనదే అని ఇతను ప్రకటించాడు. ఉద్యమం దేశవ్యాప్తంగా విస్తరించడంతో 2006 మార్చ్ 21 న మధ్యంతర ప్రభుత్వం రాజ్యాంగంలో సమస్త ప్రజాస్వామిక హక్కులనూ నిషేధిస్తూ జాతీయ అత్యవసర పరిస్థితిని ప్రకటించింది. అత్యవసర పరిస్థితిని ధిక్కరిస్తూ 300 మంది ప్రదర్శకులు క్విటోలో ప్రదర్శన చేసారు. అయితే 23వ తేదీన నాయకులు ప్రదర్శనను వెనక్కి తీసుకున్నారు. మరోసారి ఒప్పందాల మీద సంతకం చేసినా లేదా తమ డిమాండ్‌ల మీద ప్రభుత్వం సరైన చర్య తీసుకోకపోయినా తాము తిరిగి ఉద్యమిస్తామని ప్రకటించారు.

ఈక్వెడార్ ప్రజల పోరాటం ఎంత తీవ్ర స్థాయికి వెళ్లిందంటే గత అధ్యక్షుడు తన ఇంటి నుంచీ హెలికాప్టర్‌లో పారిపోవలసి వచ్చింది. అలాగే విదేశీ బహుళ జాతి చమురు కంపెనీలతో చేసుకున్న కాంట్రాక్ట్‌లన్నింటినీ తిరిగి చర్చించే అధికారాన్ని ఇచ్చే ఒక బిల్లును ఈక్వెడార్ శాసనసభ ఆమోదించేట్టుగా ప్రజా ఉద్యమం ఒత్తిడి తెచ్చింది. ముందుగా కుదుర్చుకున్న ఒప్పందాలకు విరుద్ధంగా ఉంటుంది కనక ఈ బిల్లు ఆమోదిస్తే చట్టబద్ధ చర్య తీసుకుంటానని అమెరికా చమురు కంపెనీ ఓక్సిడెంటల్ బెదిరించింది.

ఈ ఒప్పందాలకు వ్యతిరేక పోరాటం ముందు ప్రభుత్వ చమురు కంపెనీ పెట్రో ఈక్వెడార్‌లో 12 చమురు క్షేత్రాలలో 400 మంది కాంట్రాక్ట్ కార్మికులు ఉత్పత్తి నిలుపు చేసారు. మూడు నెలలుగా చెల్లించని జీతం చెల్లించాలన్నది వారి డిమాండ్. సైనికులు టియర్ గ్యాస్, బాంబులూ వదిలారు. తమ వేతనాలు చెల్లిస్తారని ఈక్వెడార్ ప్రభుత్వం నుంచీ హామీ పొందిన తరువాత మార్చ్ 12వ తేదీన వారు సమ్మె విరమించారు.

### కొలంబియా

కొలంబియాలో ప్రజలు ప్రతీఘాతుక రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడుతూనే ఉంటారు. కొలంబియాలో వామపక్ష విప్లవకారులయిన ఫార్క్, ఈ.పీ, ఈ.పీ.ఎల్, ఈ.ఎల్.ఎల్‌ల నాయకత్వంలో ప్రజలు అమెరికా సైన్యానికి కీలుబొమ్మ అయిన కొలంబియా సైన్యానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారు. కొలంబియా అమెరికాకు అత్యధికంగా బొగ్గు, చమురూ సరఫరా చేస్తుంది. అమెరికా, బ్రిటిషు బహుళజాతి కంపెనీలు కొలంబియాలో భారీ గనులు నిర్వహిస్తున్నాయి. అలాగే కొలంబియాలో మాదకద్రవ్యాల వ్యాపారం కూడా ఎక్కువగా జరుగుతుంటుంది. ఈ వ్యాపారం అమెరికా మితవాద పారామిలిటరీ గ్రూపులకు నిధులు ఇచ్చి ప్రారంభించింది. మాదకద్రవ్యాలకూ ఉగ్రవాదానికీ వ్యతిరేకంగా పోరాటం చేయడం కోసం కొలంబియా ప్రభుత్వానికి డబ్బులు అందుతున్నాయి. ప్లాన్ కొలంబియా పేరుతో కొలంబియాకు అమెరికా నుంచీ అందే సైనిక సహాయం ప్రపంచంలో మూడో అతి పెద్దది. 2002లో అక్రమ ఎన్నికలలో గెలిచిన ప్రస్తుత అధ్యక్షుడు యురైబ్ వామపక్ష విప్లవకారులతో చర్చలు ప్రారంభించాడు. అయితే అమెరికా సాయుధ సహాయంతో చర్చలు విడిచిపెట్టి కాల్పుల విరమణను ఎత్తివేసాడు. వారి మీద కాల్పులు జరిపాడు. అయితే దేశంలో మూడో వంతు భాగం మీద అదుపు ఉన్న ఫార్క్ ఈపీ ఈ పీడకులకూ వారి సైన్యానికీ తగిన జవాబు చెప్పింది. ముఖ్యంగా 2005 నాటి నుంచీ వారు అనేక విజయాలు సాధించారు. ప్రజల మీద మరింత పీడన అమలు చేయడంతో పాలక వర్గాలనూ వారి సైన్యాలనూ వ్యతిరేకించాలన్న నిశ్చయం ప్రజలలో పెంచారు. ఫార్క్ ఈపీ మాదకద్రవ్య వ్యాపారం చేసే సంస్థ అని అమెరికా ప్రభుత్వం, కొలంబియా ప్రభుత్వం కలిసి ప్రచారం చేస్తున్నాయి. అయితే దానికి ఎన్నడూ సాక్ష్యాలు చూపించలేకపోయారు. ఇదలా ఉంచి అమెరికా మాదకద్రవ్యాల నుంచీ భారీగా డబ్బులు సంపాదించిన ఏ.యూ.సీ వంటి పారా మిలిటరీ గ్రూపులకు బహిరంగంగా మద్దతు ఇచ్చింది. ఇటీవల కొలంబియా ప్రభుత్వం అమెరికాతో స్వేచ్ఛా వ్యాపార ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం కొలంబియాలో అమెరికా దిగుమతులన్నింటి మీదనూ టారిఫ్‌లు తగ్గుతాయి. దీని వల్ల 25 లక్షల మంది కొలంబియను ఉపాధి కోల్పోతారని అంచనా. అత్యంతగా రాయితీలు ఇచ్చిన అమెరికా వ్యవసాయ దిగుమతులు కొలంబియా మార్కెట్‌లలోకి ప్రవేశిస్తాయి.

### మెక్సికో

స్థానిక పువ్వుల మార్కెట్‌ను డిపార్ట్‌మెంటల్ స్టోర్స్ నిర్మాణం కోసం ప్రైవేటు పార్టీలకు అప్పగించాలన్న నగర మేయర్ నిర్ణయానికి వ్యతిరేకంగా సాన్ సాల్వడార్ టెక్స్‌కోకో మార్కెట్‌లో మే 3, 4 తేదీలలో స్థానిక పువ్వుల వ్యాపారులూ, నివాసితులూ భూ రక్షణ కోసం ప్రజా వేదిక (ఎఫ్.పీ.డీ.టీ) అన్న సంస్థ నేతృత్వంలో ప్రదర్శన నిర్వహిస్తున్నారు. మే 3వ తేదీన పోలీసులు ప్రదర్శకుల మీద క్రూరంగా దాడి చేసారు. ఇందులో 14 సంవత్సరాల బాలుడు మరణించాడు. 40 మంది ప్రదర్శకులు అరెస్టయారు. మే 4వ తేదీన సమీపాన అటెన్కోలో ఉన్న నివాసితులు కూడా సంఘీభావంగా ప్రదర్శన చేస్తుంటే పోలీసులు వారి మీద కూడా దాడి చేసి రెండు రోజులలో 190 మందిని అరెస్టు చేసారు. ఖైదీలను విడుదల చేయమంటూ విన్సెంట్ ఫాక్స్ ప్రభుత్వం కింద మెక్సికోలో దేశవ్యాప్త నిరసన కొనసాగుతున్నది. మే 19వ తేదీన నిరసన దినం పాటించమంటూ ఈ.జే.ఎల్.ఎన్, జాపాటిస్టా తిరుగుబాటుదారులతో సహా 20 మెక్సికో సంస్థలు పిలుపు ఇచ్చాయి. దీని కొనసాగింపుగా మెక్సికో నగరంలో మే 28వ తేదీన భారీ ప్రదర్శన కూడా ఉంది.

స్థానిక ప్రజలకు చెందిన ఐదు వేల హెక్టార్‌లలో అటెన్కోలో విమానాశ్రయం నిర్మించాలన్న ప్రస్తుత అధ్యక్షుడు ఫాక్స్ పథకాన్ని ఆపివేయడానికి అటీన్స్ రైతులు వీరోచిత పోరాటం చేసారు. 2002 జులైలో మెషాట్స్‌తో సాయుధమయిన ప్రజలు పోలీసులు తమ ప్రదర్శన మీద దాడి చేసిన తరువాత అటెన్కో పట్టణంలో మూడు రోజుల పాటు బారికేడ్‌లు నిర్మించారు. మోలోటోవ్ కాక్‌టెయిల్స్‌తోనూ మెషాట్స్‌తోనూ ప్రజలు పోలీసులతో పొజిషన్‌లు తీసుకుని సమరం చేసారు. ఈ పోరాటంలో 19 మంది స్థానిక ప్రభుత్వ అధికారులను బందీలుగా పట్టుకున్నారు. కార్లను ధ్వంసం చేసారు. మూడు రోజుల పాటు పట్టణం ప్రజల అదుపులో ఉంది. దీంతో విదేశీ పెట్టుబడితో విమానాశ్రయం ప్రతిపాదనను ఫాక్స్ వెనక్కు తీసుకోవలసి వచ్చింది.

దాదాపు 12 సంవత్సరాల క్రితం 1994 నూతన సంవత్సర వేడుకల సందర్భంగా గెరిల్లాలు చియాపాస్‌లో నాలుగు పట్టణాలలోకి వచ్చారు. వారం రోజుల పాటు జరిగిన సమరాలలో మెక్సికన్ బలగాలు వంద మందికి పైగా ప్రజలను చంపాయి. వీరు జాపాటిస్టా జాతి విముక్తి సైన్యం (ఈజెడ్ఎల్ఎన్)కు చెందిన వారు. దాడి అనంతరం గాటెమాలా సరిహద్దులో అడవులలోకి వీరు రిట్రీట్ అయారు. సైనిక ఒత్తిడికి గెరిల్లాలు లొంగలేదు.

జనవరి 12వ తేదీన కాల్పుల విరమణ ప్రకటించారు. ఉత్తర అమెరికా స్వేచ్ఛా వ్యాపార సంస్థ (నాఫ్టా)కు ఈ తిరుగుబాటు ఒక నిరసన. 1994 జనవరి 1వ తేదీన ఈ ఒప్పందం అమలు కావలసి ఉంది. ఆనాటి నుంచీ ఈజెడ్ఎల్ఎన్ ఎటువంటి సైనిక చొరవా తీసుకోలేదు. ఈ మధ్య కాలంలో అన్యాయాలకు వ్యతిరేకంగా పౌర సమాజం చొరవ చేయాలని మాట్లాడుతూ ఉంది. సమాజంలో వివిధ పీడిత సెక్షన్‌లను సంఘటితం చేసి, రాజ్యాంగ సభ కావాలంటూ దేశవ్యాప్త ప్రజా తిరుగుబాటు ప్రారంభించాలని ఈ సంస్థ దేశ పర్యటన చేస్తున్నది. గడచిన మెక్సికో అధ్యక్ష ఎన్నికలలో ఈ సంస్థ ఎవరినీ

సమర్థించకపోయినప్పటికీ ఎన్నికను బహిష్కరించలేదు కూడా. ఒకప్పటి విప్లవకర సంస్థలో ఇప్పుడు మిలిటెంటు స్ఫూర్తి, ఎత్తుగడలూ రాజకీయాలూ కనిపించడం లేదు. ఈ మధ్య కాలంలో ఈ సంస్థ విడుదల చేసే ప్రకటనలలో ఎక్కువగా 'పౌర సమాజం', 'పౌర సమాజ ప్రయత్నాలు' అన్న పదాలు కనిపిస్తున్నాయి. ఆధునికానంతర రకపు భావజాలం వైపు మళ్లుతున్నది. ఇది ఆధిపత్యం నిలబెట్టుకోవడానికి పాలక వర్గాలకు మాత్రమే ఉపయోగపడుతుంది.

**పోర్టో రికో**

పోర్టో రికో ఒక కారిబియన్ దేశం. ఇది ఇంకా అమెరికా వలసగానే ఉంది. అయితే ఇక్కడి ప్రజలకు అమెరికా అధ్యక్షుడిని ఎన్నుకునే ప్రజాస్వామిక హక్కులు లేవు. 2005లో భద్రతా, ఆరోగ్యం, అత్యవసర సేవల శాఖలకు చెందిన వాళ్ల మినహా 95 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు తమను తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ పోర్టో రికోలో ప్రదర్శన చేసారు. వీరిలో 40-45 వేల మంది ఉపాధ్యాయులు కూడా ఉన్నారు. మే 1వ తేదీన ఈ ప్రదర్శన ప్రారంభమయింది. ఆ రోజు వలస ప్రభుత్వం అనిబాల్ అసివిడో విలా డబ్బులు లేవంటూ, 7500 లక్షల డాలర్ల లోటు ఉన్నదంటూ ప్రభుత్వ పాఠశాలలు మూసివేసాడు. దీని వల్ల ఆరు లక్షల మంది విద్యార్థులు బాధితులయారు. అనేక ప్రభుత్వ సంస్థలు కూడా ప్రభావితమయ్యాయి. ఈ తొలగింపులను నిరసించేందుకు అనేక సంఘాలు రాజధాని సాన్ జువాన్‌లో ఏప్రిల్ 28వ తేదీన ప్రదర్శన ఏర్పాటు చేసాయి. ఇందులో 50 వేల మంది పాల్గొన్నారు. మేడే నాడు అనేక వేల మంది ప్రజలు కుంభవృష్టిగా కురుస్తున్న వర్షాన్ని లెక్కచేయకుండా ఇందులో పాలు పంచుకున్నారు. వీరిలో ఎలక్ట్రిక్ కార్మికులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర విశ్వవిద్యాలయ ఉద్యోగులూ ఉన్నారు.

కార్మికుల వేతనాలు చెల్లించాలంటూ ప్రభుత్వం 5.9 శాతం అమ్మకపు పన్ను విధించాలని సెనేట్ వోటు చేసింది. ఇది పోర్టో రికో చరిత్రలో మొదటిసారి. దీని వల్ల ప్రభుత్వ ఉద్యోగులు ఉద్యోగాలు కోల్పోయారు. ఒక రకంగా చెప్పాలంటే తమ ఆర్థిక విధానాల వైఫల్యాన్ని ప్రజల మీద నెట్టారు. బడ్జెట్ సంక్షోభాన్ని వినియోగించుకుని మరింత కచ్చితమైన చర్యలు విధించాలని వలస ప్రభుత్వం యోచిస్తున్నది. అయితే నిజానికి విశ్వవిద్యాలయాలలో యుటిలిటీ రేటులు పెంచింది. ట్యూషన్ ధరలు పెంచింది. ప్రభుత్వ ఉద్యోగులు త్వరగా పదవీ విరమణ చేయాలని ఒత్తిడి చేసింది. చక్కెర పూత మాదిరిగా అది వంద లక్షల డాలర్‌లకు మించి ఆదాయం ఉన్న కార్పొరేషన్‌ల మీద ఐదు శాతం పన్నును కూడా విధించింది.

2005 మే 9వ తేదీన ఎలక్ట్రికల్ కార్మికుల సంఘం యుటియర్, పోర్టో రికో ఉపాధ్యాయ సమాఖ్య, ఇతర సంఘాలు కలిసి సాన్ జువాన్‌లో ఒక పెద్ద నౌకను అడ్డుకుంటూ ప్రదర్శన జరిపారు. మయగ్నెజ్, పోన్స్ నగరాలలో సంఘాల కార్యకర్తలు షాపింగ్ మాల్స్ వద్ద ప్రజా పికెట్‌లు నిర్వహించారు.

**బ్రెజిల్**

2005 ఏప్రిల్ 16వ తేదీన బ్రెజిల్‌లో గ్రామీణ భూమి లేని కార్మికుల ఉద్యమం నేతృత్వంలో లాటిన్ అమెరికాలో అతి పెద్ద పిప్పి, కాయితం కంపెనీ అయిన టీక్స్‌రా డి ఫ్రిటాస్‌లో సుజానో పాపెల్ ఈ సెల్యులోస్ ఎస్ఏ యాజమాన్యంలో ఉన్న 600 హెక్టార్‌ల బిటల మీద దాడి చేసారు. సావో పాలోకు ఈశాన్యాన 1000 కిలోమీటర్‌ల దూరంలో ఇది ఉంది. రెండు లక్షల యూకలిప్టస్ మొక్కలను పెకిలించి ఈ నేలలో తాత్కాలిక నిర్మాణాలు చేసారు. ఇది 1998 రాజ్యాంగానికి విరుద్ధం. యజమానికి నష్ట పరిహారం ఇచ్చినంత కాలం అనుత్పాదక భూమిని వాడుకోవచ్చునని రాజ్యాంగం పేర్కొంది. ఏప్రిల్ 28వ తేదీన భూమి పంచిపెడతానన్న ప్రభుత్వ హామీతో భూమి లేని తిరుగుబాటు రైతులు ఆక్రమించిన భూమిని వదిలి వచ్చారు. పిప్పి, కాయితం కంపెనీ ఈ ఖండంలో లక్షా 84 వేల హెక్టార్‌లలో యూకలిప్టస్ చెట్లను నాటింది. మార్చి 27వ తేదీన పరాలో సైనిక పోలీసులు ఎంఎస్‌టీకి చెందిన 600 కుటుంబాలను బలవంతంగా ఖాళీ చేయించారు. కువాగ్లియావో గ్రూపు చట్ట వ్యతిరేకంగా ఈ ఎస్టేట్‌ను తీసుకుంది. ఇలా ఖాళీ చేయించడం పట్ల ఆగ్రహం చెందిన 800 మంది కుటుంబాలు ఎల్‌డోరాడో డోస్ కారాజాస్ దగ్గర 150 హైవేలను అడ్డుకున్నారు. పెరువియన్ ఎస్టేట్‌గా చెప్పుకునే సంపదను స్వాధీనం చేసుకున్నారు. బడా వ్యవసాయ వ్యాపారానికి వ్యతిరేకంగానూ కాంపెసినో వ్యవసాయానికి రక్షణగానూ 14 రాష్ట్రాలలో పది వేలమంది ప్రజలు మార్చ్ 27-30 తేదీలలో బ్రెజిల్ చిన్న రైతుల ఉద్యమం అనే సంస్థ నేతృత్వంలో సమీకరణల జాతీయ క్యాంపెయిన్ చేసారు. 2006 ఏప్రిల్ 17వ తేదీన ఎంఎస్‌టీ పదో వార్షికోత్సవాన్ని పాటించినప్పుడు సైనిక పోలీసులు 1500 మంది మీద ఫైరింగు చేసారు. వీరిలో 19 మంది చనిపోగా మరో 69 మంది గాయపడ్డారు. గ్రామీణ భూమిలేని రైతులు ఏప్రిల్ నెలంతా తమ కార్యకలాపాలను తీవ్రతరం చేసారు.

భూమి లేని గ్రామీణ కార్మిక కర్షకులు ఎం.ఎస్.టీ పతాకం కింద ఐక్యమయ్యారు. ఇది ఈ ప్రాంతంలో అతి పెద్ద భూమి లేని రైతాంగం సంస్థ. 1980ల నుంచీ పని చేస్తున్న ఈ సంస్థ బడా భూస్వాముల భూములను పంపిణీ చేసుకుంటున్నది. ఈ భూములను భూమి లేని రైతులకు పంచిపెడుతున్నది. ఎంఎస్‌టీ గత అధ్యక్ష ఎన్నికలో లూలాను సమర్థించింది. లూలా భూమి పంచిపెడతాడని అనుకుంటే ఆయన తెడ్డు చూపించి నయా ఉదారవాదాన్ని పట్టుకున్నాడు. బడా భూస్వాములు బూర్జువా వర్గం మొదలయిన వారితో కుమ్మక్కయ్యాడు. వీరి కార్యకాపాలను అణిచివేసాడు.

గత ప్రభుత్వాలు చేయలేకపోయిన ఐ.ఎం.ఎఫ్ అనుకూల సంస్కరణలు చేశాడు. దాదాపు 800 బిలియన్ డాలర్ల విదేశీ, స్వదేశీ అప్పు చెల్లించడం కోసం ఐ.ఎం.ఎఫ్ నిర్దేశిత ఆర్థిక, పన్నుల కార్యక్రమాన్ని అమలు చేయసాగాడు. ఇందుకోసం లూలా బ్రెజిలియన్ జి.ఎన్.పిలో 700 బిలియన్ డాలర్లకు సమానమైన 5 శాతం అదనపు విలువను వాడుకున్నాడు. ప్రపంచంలో ఎక్కడా లేని వడ్డీరేటు ఇక్కడ వుంది. పదవీ విరమణ చేసిన ప్రజల హక్కులను కాలరాచి ఫించను సంస్కరణలు ఎత్తి వేశాడు. ఇప్పుడు ప్రపంచ బ్యాంకుకు అనుకూలంగా పబ్లిక్ ఎడ్యుకేషన్‌ను ప్రయివేటీకరిస్తున్నాడు. నిరుద్యోగం అధికారిక లెక్కల ప్రకారం 12 శాతం, అనధికారిక లెక్కల ప్రకారం 20 శాతానికి చేరుకుంది. లూలా వ్యవసాయ విధానాన్ని స్థంభింపచేసి, భూకేంద్రీకరణను తీవ్రతరం చేశాడు. ఎగుమతుల కోసం వ్యవసాయ వ్యాపారానికి మద్దతు ఇచ్చి విత్తనాల ఎగుమతులు చేస్తున్నాడు. గ్రామీణ ప్రాంతంలో హింస చాలా పెరిగింది. ఈ సంవత్సరంలోనే 2000 మంది అరెస్టయ్యారు. వీరిలో రైతాంగ ఉద్యమ నాయకులూ, మిలీషియా సభ్యులూ వున్నారు.

బుష్‌తో కలిసి లూలా ఎఫ్‌టీఏఏలో పాలు పంచుకున్నారు. బుష్ ఆదేశాల ప్రకారం హైతీకి బ్రెజిల్ బలగాలను పంపించాడు. ఈక్వెడార్, బొలీవియా, వెనిజులా వంటి పొరుగు దేశాల రాజకీయ సంక్షోభంలో లూలా జోక్యం చేసుకుంటాడు. ఉత్తర అమెరికా సహాయంతో ప్రజల తిరుగుబాటులను అవకాశవాదం వైపు తిప్పాలని ప్రయత్నిస్తున్నాడు.

గత ప్రతీఘాతుక ప్రభుత్వాల కంటే సోషలిస్టు ప్రభుత్వంగా చెప్పుకుంటున్న ఇతని ప్రభుత్వం మరింత ఘోరంగా ఉన్నది. ప్రపంచబ్యాంకు సమాచారం ప్రకారమే ప్రపంచం మొత్తంలో, సంపద అత్యంత అసమానంగా పంపిణీ అయిన అయిదు దేశాలలో బ్రెజిల్ ఒకటి. బ్రెజిల్ దేశంలో భూమిలేని పేద రైతాంగం, లేదా అతి తక్కువ భూమి వున్నవారు 400 లక్షల మంది వున్నారు. 600 లక్షల మంది వేదనాభరితంగా జీవిస్తున్నారు. వీరిలో 400 లక్షల మంది 'దారిద్ర్య రేఖకు దిగువన' జీవిస్తున్నారు. బ్రెజిల్ ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నదన్న అధికారిక ప్రచార క్యాంపెయిన్‌ల మాట ఎలా వున్నా అది నిజం కాదు.

2006 ఏప్రిల్ 2వ తేదీన బ్రెజిల్ ఆనకట్ట ప్రభావిత ఉద్యమంలో 1500 మంది సభ్యులు, ఇతర సంఘాలూ మినాస్ గెరియాస్ ఎనర్జీ కంపెనీ ఎదుట ప్రదర్శన చేసారు. ఏప్రిల్ 1వ తేదీన 300 మంది బేలో హారిజాంటీలో నీరు, విద్యుత్తు, సౌభ్రాతృత్వం కోసం ప్రదర్శన చేసారు. మార్చ్ 31వ తేదీన నుంచీ నిరాహార దీక్ష చేస్తున్న ఏడుగురు కార్యకర్తలకు మద్దతుగా వీరు ఈ ప్రదర్శన చేసారు. మినాస్ గెరాయిస్‌లో విద్యుత్తు ధరలకు వ్యతిరేకంగా నిరసనకారులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్తు వాడకం దారులు పారిశ్రామిక కార్పొరేషన్‌ల కంటే ఎక్కువ ధర చెల్లించవలసిన పరిస్థితి ఏర్పడింది. ఇంటర్ అమెరికన్ అభివృద్ధి బ్యాంకు ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా ఈ ప్రదర్శనకారులు ఆందోళన చేస్తున్నారు. ఇది హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టులకు ప్రధాన ఆర్థిక మద్దతుదారు. బ్రెజిల్ సైనిక పోలీసులు మార్చ్ 31వ తేదీ నుంచీ ఏప్రిల్ 4వ తేదీ వరకు ప్రదర్శనకారుల మీద అతి తీవ్రమైన నిర్బంధ చర్యలు చేపట్టారు. దీంతో అనేక మంది గాయపడ్డారు, అరెస్టయారు.

## హైతీ

హైతీలో 1990లో ప్రజాస్వామికంగా ఎన్నికయిన అధ్యక్షుడు అరిస్టైడ్‌ను ఏడు నెలల లోగా హైతీ సైన్యం తిరుగుబాటుతో దింపివేసింది. 1994లో తిరిగి అధికారంలోకి వచ్చిన తరువాత అరిస్టైడ్ హైతీ సైన్యాన్ని రద్దు చేసాడు. 2000లో భారీ వోటుతో గెలిచాడు. తిరిగి 2004లో అతన్ని దింపేసారు. ఈసారి ఫ్రెంచి ప్రభుత్వంతో కలిసి అమెరికా చేయించిన తిరుగుబాటు ఇది. రద్దయిన హైతీయ సైనిక అధికారులు అమెరికా సహాయంతో తక్కువ ఆయుధాలు ఉన్న హైతీ పోలీసుల మీద దాడి చేసారు. అరిస్టైడ్‌ను ఎత్తుకుపోయి సెంట్రల్ ఆఫ్రికాలో ఉంచారు. అమెరికా, ఫ్రెంచి, కెనడియన్ శాంతి పరిరక్షక బలగాలు ఈ దేశాన్ని స్వాధీనం చేసుకున్నాయి. ఒక కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఎన్నుకుని హైతీని ఐక్య రాజ్య సమితి ప్రాయోజిత బ్రెజిల్ 'విప్లవకర' లూలా, 'సోషలిస్టు' చిలీలతో కూడిన శాంతి రక్షక బలగానికి అప్పజెప్పారు. అయితే నూతన ఎన్నికల కోసం నిరంతర ప్రజా ఉద్యమాలూ సమీకరణలతో ఐక్య రాజ్య సమితి హైతీలో ఎన్నికలు నిర్వహించవలసి వచ్చింది. ఎన్నికలలో అక్రమాలు చేయాలని చూసినప్పటికీ రెనీ ప్రెవాల్‌కు 52 శాతం కంటే ఎక్కువ వోటు వచ్చింది. పశ్చిమ ప్రాంతంలో హైతీ అతి పేద దేశం. ఒక్క శాతం ప్రజలు సగానికి పైగా దేశ సంపదను అనుభవిస్తున్నారు. 200 సంవత్సరాల క్రితం నల్ల బానిస టోస్సాంట్ లే ఓవర్ట్యూర్ వలస పాలనకు వ్యతిరేకంగా ప్రజా తిరుగుబాటుకు నాయకత్వం వహించాడు.

## ఈక్వెడార్

ఈక్వెడార్‌లో ఇదే పరిస్థితి ఉన్నది. రైతాంగ ప్రజలు తమ హక్కులు కోరుతూ వీధులలోకి వెళ్లారు. ఉరుగ్వేలో ప్రజలు తబారే వాస్క్వెజ్ ప్రభుత్వాన్నీ అతని విధానాన్నీ వ్యతిరేకిస్తున్నారు. ఐ.ఎం.ఎఫ్ ముందుగానే అతనికి 230 మిలియన్ డాలర్లు చెల్లించింది. అర్జెంటీనాలో ఫ్యాక్టరీ కార్మికులు, నిరుద్యోగులూ పదవీ విరమణ చేసిన వాళ్లూ కిర్చనర్ ప్రభుత్వంతో పోరాడుతున్నారు. పెరాగ్వేలో నికనార్ డువార్టే ప్రభుత్వ వైఫల్యంతో అవకాశవాదులు కాథలిక్ బిషప్ అభ్యర్థిత్వం సిద్ధం చేసారు. అయితే రైతాంగ జాతీయ వేదిక నేతృత్వంలో పెరుగుతున్న ప్రజా ఉద్యమం విప్లవ మార్గాన్ని చూపిస్తున్నది.

**చిలీ**

మేడే నాడు వేలాది మంది చిలీ కార్మికులు రాజధాని నగరంలో ప్రదర్శన నిర్వహించారు. అమెరికా సామ్రాజ్యవాదానికి గుర్తులుగా ఉన్న వాటినీ కొన్ని ఎంఎన్‌సీ దుకాణాలనూ ఆఫీసులనూ బ్యాంకులనూ ధ్వంసం చేసారు. చిలీలో ఉగ్రవాద వ్యతిరేక చట్టానికి వ్యతిరేకంగా ముగ్గురు మపూచే భారత ఖైదీలు, వారి మద్దతుదారులూ 62 రోజుల పాటు నిరాహార దీక్ష చేసారు. చట్టాన్ని వెనక్కి తీసుకుంటామన్న హామీతోనే ఉద్యమాన్ని వెనక్కి తీసుకున్నారు. దేశంలో అతి పెద్దదైన మపూచే భారతీయుల జాతి, పెద్ద వాణిజ్య వ్యవసాయ తోటలకు వ్యతిరేకంగా పోరాడుతున్నది. చెట్లను కాల్చడం, ప్రాథమిక సౌకర్యాలను ధ్వంసం చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అగస్టో పినోచెట్ 1990లో ఈ చట్టాన్ని చేసాడు.

చిలీలో 'సోషలిస్టు' అధ్యక్షుడు మిచెల్ బాచెలెట్ ఎన్నిక ముగిసిన నెల రోజుల లోపుగానే ఎన్నికల వాగ్దానాలు వమ్ము చేసింది. ఇతర ప్రజా వ్యతిరేక చర్యలతో పాటుగా సహాయ ఫించనులను అగ్రిగేటెడ్ వాల్యూ పెరుగుదలకు అనుగుణంగా పెరగడాన్ని ఆపివేసింది. ఆమె ప్రభుత్వం పట్ల నిరసనలు పెరుగుతున్నాయి.

**పెరూ**

పెరూలో మొదటి అధ్యక్ష ఎన్నిక చాలా స్పష్టంగా ప్రజలకు అభివృద్ధి, ఎన్నికల తతంగాల పట్ల ఉన్న అభ్యంతరాన్ని తెలియజేసింది. దాదాపు 30 శాతానికి పైగా వోటు వేయలేదు. లంచగొండి, ఊచకోత కోసే అభ్యర్థులు ఎన్నికలలో పాలు పంచుకున్నారు.

మరో పక్క పెరూలో ప్రజా యుద్ధం వెనకడుగు వేసినప్పటికీ ఇది ఈ ఖండంలోనూ యావత్తు చరిత్రలోనూ అత్యంత ముఖ్యమైన విప్లవోద్యమం. నూతన, మరింత రాడికల్ తిరుగుబాటులు బద్దలయేే ముందు ఈ అనుభవం ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా లాటిన్ అమెరికాలో వర్గ పోరాటం అభివృద్ధి కావడంలో నిర్ణయాత్మకంగా ఉంటుంది.

**బొలీవియా**

ఇటీవలి కాలంలో బొలీవియా ప్రజలు నయా ఉదారవాద ప్రపంచీకరణను వ్యతిరేకిస్తూ పోరాటం చేస్తున్నారు. బొలీవియాలో సుసంపన్నమైన సహజ వనరులు ఉన్నాయి. ఈ ఖండంలో వెనిజులా తరువాత ఇక్కడే సహజ వాయు నిక్షేపాలు అధికంగా ఉన్నాయి. 2000 ఏప్రిల్‌లో కొచబాంబాలో స్థానిక, స్థానికేతర బొలీవియనులు అమెరికా నేతృత్వంలో బహుళ జాతి కంపెనీలు స్థానిక నీటి సరఫరా వ్యవస్థను ప్రైవేటీకరించాలనుకున్నప్పుడు దాన్ని విజయవంతంగా తిప్పి కొట్టారు. ఫ్రెంచి కంపెనీ 2005లో సూయిజ్ నీటి వనరులు, సరఫరాలను ప్రైవేటీకరించి లాభం పొందుదామని చూసింది. కానీ ప్రజలు ఈ కంపెనీని తరిమేసారు. 2003 ఫిబ్రవరిలో ఐ.ఎం.ఎఫ్ సూచన ప్రకారం చేసిన ఆదాయపు పన్ను పెరుగుదలకు వ్యతిరేకంగా 34 మంది బొలీవియనులను చంపేసారు. 2003 అక్టోబరులో సుసంపన్నమైన సహజ వాయు వనరులను ప్రైవేటీకరించాలన్న అధ్యక్షుడి నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రజలు వేలల్లో సంఘటితమయ్యారు. ఈ ప్రదర్శనలో 60 మంది చనిపోయారు. వీధి పోరాటాలు, ప్రతిష్టంభనలూ ప్రభుత్వ బలగాల క్రూర చర్యలను వ్యతిరేకించాయి. అధ్యక్షుడు రాజీనామా చేయాలని ప్రదర్శనకారులు పిలుపునిచ్చారు. 2003 అక్టోబరు 19వ తేదీన అధ్యక్షుడు రాజీనామా చేసాడు. ఉపాధ్యక్షుడు కార్లోస్ మెసా అధ్యక్ష పదవి చేపట్టాడు. 2004 జులైలో వాయు వనరుల సమస్య మీద దేశవ్యాప్త అభిప్రాయ సేకరణ చేపట్టాడు. అయితే ఈ అభిప్రాయ సేకరణ వాయు వనరుల జాతీయకరణను వ్యతిరేకించింది. అందుకని 2005 మార్చిలో రోజు రోజుకూ వీధి పోరాటాలు పెరిగాయి. 2005 మార్చిలో మెసా కూడా రాజీనామా చేసాడు. మాస్ సంస్థలో స్థానిక నాయకుడయిన ఇవో మోరేల్స్ చమురు, పెట్రోలియం వంటి సహజ వనరులను జాతీయీకరిస్తానంటూ డిసెంబరులో అధ్యక్షుడిగా ఎన్నికయాడు. అంతేకాక ఐఎంఎఫ్, ప్రపంచ బాంకు బొలీవియా మీద రుద్దిన నయా ఉదారవాద నమూనాను రద్దు చేస్తాననీ భూములను భూమిలేని వారికి పంపిణీ చేస్తాననీ కోకో సాగు చేయడం కోసం దేశీయ రైతులకు హక్కులు ఇస్తాననీ కూడా హామీ ఇచ్చాడు.

కానీ భూమిపుత్రుడు, కోకో రైతు సంఘం అధ్యక్షుడు కూడా అయిన మోరేల్స్, మాటలలో ఉన్నంత రాడికల్‌గా చర్యలలో లేడు. పాలక భూ యాజమాన్య వర్గాలను, దళారీ వ్యాపారులనూ నొప్పించని మార్గంలో మోరేల్స్ నడుస్తున్నాడు. రాజ్య యాజమాన్యంలో 'ఆండియన్ అమెజాన్ పెట్టుబడిదారీ విధానం' అన్న ప్రభుత్వ కార్యక్రమంతో బొలీవియా పారిశ్రామిక వేత్తల భయాలు పోగొట్టాలని చూస్తున్నాడు. ప్రజల మద్దతు నిలబెట్టుకోవాలని చూస్తున్నాడు. దేశ సంక్షోభానికి పెట్టుబడిదారీ మార్గంవెతుకుతున్నాడు. ఉన్న దాదాపు 130 లక్షల ఎకరాలను మాత్రం పునర్ పంపిణీ చేస్తానని అతను ప్రకటించాడు. 2005 అక్టోబరులో వచ్చిన ఒక ఐక్య రాజ్య సమితి నివేదిక ప్రకారం 100 కుటుంబాలు 250 లక్షల హెక్టార్ల భూమి మీద ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. 20 లక్షల కాంపెసినో కుటుంబాల చేతులలో 50 లక్షల హెక్టార్ల భూమి ఉంది.

అయితే దేశంలో ఇటీవల జరిగిన తిరుగుబాటుల స్థాయి చూస్తే గట్టి మార్పు తీసుకురావాలని బొలీవియా ప్రజలు నిర్ణయించుకున్నారు. ఈ మధ్య కాలంలో బొలీవియాకూ ప్రజలకూ, ముఖ్యంగా భారతీయులకూ మధ్య వైరుధ్యాలు పెరుగుతున్నాయి. సామ్రాజ్యవాద అనుకూల శక్తులు దిగ్భ్రమ చెందాయి. దేశం అంతర్యుద్ధం అంచులో ఉన్నది.

### ఆర్జెంటీనా

1990ల నాటి నుంచీ అమలు చేస్తూ వస్తున్న నయా ఉదారవాద విధానాల వల్ల ఆర్జెంటీనా 2001లో వినాశకర ఆర్థిక సంక్షోభంలో పడింది. దేశ కరెన్సీ పిసో పడిపోవడంతో దేశీయ రుణ వ్యవస్థ పడిపోవడంతో ఆర్థిక వ్యవస్థ జీడీపీలో 20 శాతం క్షీణింపు జరిగింది. పేదరికం రెట్టింపయింది. బ్యాంకింగ్ సంస్థలు కూలిపోయాయి. ఫింఛనుదారుల జీవిత కాల ఆదాయాలు రోజుల్లో పూర్తయిపోయాయి. ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా వేలాది మంది వీధుల్లోకి వచ్చి ప్రదర్శనలు చేసారు. ఈ ప్రదర్శనల వల్ల కొద్ది నెలలలో ఆరు ప్రభుత్వాలు మారాయి. 2003లో 'వామపక్ష మద్దతుదారుడ'యిన నెస్టర్ కిర్చ్నర్ అధికారంలోకి వచ్చాడు. ఐ.ఎం.ఎఫ్‌తోనూ ఇతర అంతర్జాతీయ రుణ సంస్థలతోనూ మాట్లాడతానని పోరాడుతున్న ప్రజలకు హామీ ఇచ్చాడు. ఐ.ఎం.ఎఫ్‌కు చెల్లింపులు చేయనని దేశం బెదిరించడంతో మరిన్ని చర్యలు చేపట్టాలనీ అధిక వడ్డీ రేట్లు విధించాలన్న ఐ.ఎం.ఎఫ్ ప్రయత్నాలు విఫలమయ్యాయి. 100 బిలియను డాలర్లకు పైగా ఉన్న విదేశీ రుణాన్ని గణనీయంగా తగ్గించుకోగలిగింది ఆర్జెంటీనా. సైనిక అధికారులకు రక్షణ కల్పించే క్షమాభిక్ష చట్టాలను వెనక్కి తీసుకోవడాన్ని కిర్చ్నర్ సమర్థించాడు. అయితే ఇదే కిర్చ్నర్ అనేక రంగాలలో అమెరికాతో కుమ్మక్కయాడు.

### ఎన్నికల రంగం, ప్రజా ఉద్యమంపై దాని ప్రభావం

భారీ ఎత్తున జరుగుతున్న ప్రజా ఉద్యమాలు కింద నుంచీ భారీ సామాజిక ఉద్యమంగా మారి యావత్తు లాటిన్ అమెరికా ఖండం అంతటా వ్యాపించాయి. ఇది సామ్రాజ్యవాద, ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాద అణిచివేతకూ దోపిడీకీ వ్యతిరేకం. ప్రజల డిమాండ్, ఉద్యమాలూ సోషలిస్టులు, సోషల్ ప్రజాస్వామికవాదులూ, పార్లమెంటరీ కమ్యూనిస్టులూ, 'వామపక్షం' ముసుగులో ఉన్న ఇతర పాలక వర్గ పార్టీల మీద భారీగా ఒత్తిడి కలిగిస్తున్నది. కనీసం ప్రజల అసంతృప్తిని తగ్గించడానికి ప్రజా పక్ష వైఖరి తీసుకున్నట్టు తాత్కాలికంగా ప్రకటించమన్నదే ఈ ఒత్తిడి. ప్రజా వ్యతిరేక ధోరణులు కలిగి ఉన్న ఈ అధికార పార్టీల ద్వారా లాటిన్ అమెరికాలో నూతన ఎత్తులకు వెళ్లవచ్చునని రివిజనిస్టు వామపక్షం అంటున్నది. వావమక్షంగా చెప్పుకుంటున్న ఈ పార్టీలు తమ రాడికల్ హామీలను నిలబెట్టుకోలేకపోయాయనీ నయా ఉదారవాద విధానాలను ఉక్కు పిడికిలితో అమలు చేసాయనీ స్పష్టం అవుతుంది.

### ముగింపు

2005 ఫిబ్రవరి 24 - 25 తేదీలలో ఉరుగ్వేలో జరిగిన లాటిన్ అమెరికన్ కాన్ఫరెన్స్ ఆఫ్ పాపులర్ అటానమస్ ఆర్గనైజేషన్స్‌లో ఖండవ్యాప్త కార్యకర్తలు సమావేశమయ్యారు. సోషల్ డెమోక్రాట్‌లూ, ప్రగతిశీలవాదులూ గెలిచిన ప్రతీ లాటిన్ అమెరికా దేశంలోనూ సామాజిక ఉద్యమాలు నూతన సవాళ్లను ఎదుర్కొంటున్నాయని అంచనాకు వచ్చారు. సోషల్ ప్రజాస్వామిక ప్రభుత్వాల పట్ల పెరుగుతున్న ఆశల వల్ల ప్రజా శక్తి సమీకృతం కాకుండా ఉండే ధోరణిని ఎలా నివారించాలని ఈ మహాసభలో చర్చించారు. అలాగే లాటిన్ అమెరికా దేశాలలో అధికారిక సంఘాలలో బూర్జువా వర్గం నిండిపోయిందని గుర్తించారు. ఇవి సోషల్ డెమోక్రటిక్‌గా కానీ బహిరంగంగా ప్రతీఘాతుకమైనవిగా కానీ ఉన్నాయి. నిజమైన కార్మికవర్గ అధికారాన్ని సృష్టించే ఒక నూతన మార్గాన్ని చేపట్టాలని అభిప్రాయపడింది. లాటిన్ అమెరికాలో పెద్ద ఎత్తున వచ్చిన ప్రజా వెల్లువ పార్లమెంటరీ సంస్కరణవాదంలోకి వెళ్లిపోతున్నది. విప్లవకర, మావోయిస్టు దిశ లేక అవి దిగజారిపోతున్నాయి.

ప్రజలలో సామ్రాజ్యవాద వ్యతిరేక, దళారీ సామాజిక వ్యవస్థ వ్యతిరేక అసంతృప్తిని వినియోగించుకుని వామపక్షంగా చెప్పుకుంటున్న ప్రభుత్వాలు అధికారంలోకి వస్తున్నాయి. అయితే అధికారంలోకి వచ్చిన తరువాత వారి ప్రధాన లక్ష్యం ప్రభుత్వాన్ని సుస్థిరపరచుకోవడం. ఇందుకోసం పాలక వర్గాలు నెలకొల్పిన నియమాలను పాటిస్తున్నారు. అర్ధ వలస రాజ్యాల అణిచివేత యంత్రాంగాలతో ముడిపడతారు. తమ ప్రభుత్వాలను కాపాడుకోవడం కోసం సమస్త విప్లవ కార్యక్రమాలనూ పక్కన పెడతారు. పార్లమెంటరీ వామపక్ష పార్టీల అనుభవాలు ఆసియా దేశాల అనుభవాల వంటివే. భారతదేశంలో మూడు రాష్ట్రాలలో ఇటువంటి వామపక్షం అధికారంలోకి వచ్చిన తరువాత తమ కార్యక్రమాలన్నింటికీ ముగింపు పలికింది.

వీరోచిత ప్రజలు సంపూర్ణ సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక మార్పును కోరుకుంటున్నారు. దీంతో లాటిన్ అమెరికా 500 సంవత్సరాల క్రూరత్వానికి ముగింపు పలుకుతుంది. అయితే పార్లమెంటరీ వామపక్షం, సెంటర్ లెఫ్ట్ మిత్రమాలు తిరుగుబాటు కాగడాను పట్టి ఉంచలేకపోతున్నాయి. దోపిడీ పీడనా స్వరూపాల మీద దాడి చేయడానికి బదులుగా వాళ్లు అర్ధ వలస రాజ్యంలో ఇమిడిపోయారు. సామ్రాజ్యవాద, దళారీ ప్రయోజనాలకు రక్షకులయ్యారు. లాటిన్ అమెరికాలో ప్రజా పోరాటంలోకి శక్తివంతమైన రాజకీయాలను ప్రవేశపెట్టడం ముఖ్యమైనది. రాజకీయ నిర్మాణం లేక మిలిటెంటు ప్రజా ఉద్యమం ఫలితం లేకుండా పోవడం మనం చూసాం. అందుకోసం ప్రైవేటీకరణలను వ్యతిరేకించి, ప్రభుత్వాలను కూలదోసిన భారీ ప్రజా ఆందోళనలు తమ ఉద్యమాలను సాయుధ పోరాటంతో ముడిపెడుతూ రాజకీయాధికారాన్ని స్వాధీనం చేసుకునే కర్తవ్యాన్ని చేపట్టాలి. ఇది సామ్రాజ్యవాద, భూస్వామ్య, దళారీ వర్గ పెత్తనాన్ని మౌలికంగా ఎదుర్కొంటుంది. వారి ఆధిపత్యాన్ని నిర్మూలించి వాళ్లు విముక్తి పొందగలుగుతారు.

★

# రాజ్య హింసకు పరాకాష్ట వాకపల్లి అత్యాచారాలు

ఉద్యమాలను అణచడం కోసం రాజ్యం ప్రయోగిస్తోన్న ముఖ్యమైన సాధనాల్లో అత్యాచారం ఒకటి. అందులో భాగంగా ఆగస్ట్ 20వ తేదీన ఎ.ఒ.బి ప్రాంతంలోని ఈస్ట్ డివిజన్, విశాఖ జిల్లా జి.మాడుగుల మండలం వాకపల్లి గ్రామంలో 11 మంది ఆదివాసీ మహిళలను 21 మంది గ్రేహౌండ్స్ పోలీసులు అత్యాచారం చేశారు.

ఈస్ట్ డివిజన్ ఉద్యమాలకు పేరుగాంచిన గడ్డ. బ్రిటీష్ సామ్రాజ్యవాదులను గడ గడలాడించిన అల్లూరి పోరు వారసత్వం నేడు మావోయిస్టు పోరాటంగా పరిణితి చెందిన గడ్డ. ఈ పోరులో మహిళలు సగభాగం. లోతా రాజేశ్వరి వంటి వీరవనితలు ఈ గడ్డ మీద పుట్టి పెరిగి తమ నెత్తుటి విత్తనాలను వెదజల్లి చరిత్రను ఉజ్వలవంతం చేశారు. ఆ వారసత్వాన్ని ఎత్తిపడుతూ నేడు అనేక మంది మహిళలు ఈ గడ్డ మీద విముక్తి పోరులో కదం తొక్కుతున్నారు.

ఈ ప్రాంతంలోని విలువైన అటవీ ఖనిజ సంపదలపైన కన్ను వేసిన భారత దళారీ పాలకవర్గాలకూ, సామ్రాజ్యవాదులకూ ఈ పోరాటం కంటగింపుగా ఉంది. ఇటీవలి కాలంలో బహుళజాతి కంపెనీలను ఎదిరిస్తూ సాగుతున్న బాక్సైట్ వ్యతిరేక పోరాటం సహితం ఈ దోపిడీ వర్గాలకు కంట్లో నలుసుగా మారింది. ఫలితంగా ఈస్ట్ డివిజన్ ఉద్యమంపై ప్రభుత్వ అణచివేత తీవ్ర స్థాయిలో పెరిగింది. పల్లెలపై గ్రేహౌండ్స్ దాడులూ, అరెస్టులూ, చిత్రహింసలూ సర్వ సాధారణమైనాయి. ఇందులో భాగంగా ఉద్యమంలో సగభాగానికి ప్రాతినిధ్యం వహిస్తోన్న మహిళలపైనా హింస తీవ్రస్థాయిలో పెరిగింది. దానికి కొనసాగింపే వాకపల్లి మహిళలపై జరిగిన అత్యాచారం.

ఏ ఉద్యమాన్ని అణచడానికైనా రాజ్యం అత్యాచారాన్ని ఒక బలమైన సాధనంగా ఎన్నుకుంటోంది. ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొంటున్న మహిళలపైనా, ఉద్యమానికి సహాయ సహకారాలు అందిస్తోన్న మహిళలపైనా, ఉద్యమ ప్రాంతాల్లో నివసిస్తోన్న మహిళలపైన ఈ అత్యాచారాల్ని ప్రయోగిస్తోంది. పితృస్వామ్య సమాజం మహిళల 'శీలం' చుట్టూ ఒక బలమైన భావాజాలన్ని అల్లింది. ఆ భావజాలాన్ని ఉపయోగించుకొని మహిళలను ఉద్యమాలకు దూరం చేసే కుట్రలో భాగంగానే రాజ్యం ఇలా విచ్చలవిడిగా అత్యాచారాలను ప్రయోగిస్తోంది.

తమ ప్రయోజనాలను కాపాడుకోవడం కోసం పాలకవర్గాలు, పోలీసు సైనిక బలగాలకు మనుషులను తిట్టడం, కొట్టడం, చంపడం ఆస్తులను ధ్వంసం చేయడం వంటి విచ్చలవిడి అధికారాలను కల్పిస్తున్నాయి. అందులో భాగంగా మహిళలను అత్యాచారాలు చేసే అధికారాన్ని కూడా కల్పిస్తోన్నాయనడానికి వాకపల్లి అత్యాచారాలు ఒకానొక నిదర్శనం మాత్రమే.

అందుకే అత్యాచార వార్త వెలుగులోకి వచ్చిన వెంటనే విశాఖ జిల్లా ఎస్.పి, రాష్ట్ర డి.జి.పిలు ప్రాథమిక విచారణను జరిపించాలనే విచక్షణను సైతం మరిచి ఇది కూంబింగ్‌ను ఆపడానికి నక్సల్స్ పన్నిన కుట్ర అని మాట్లాడారు. హోం మంత్రి కూడా పోలీసులను వెనకేసుకొస్తూ మాట్లాడాడు. దీన్నిబట్టి ఈ అత్యాచారం, ఈ అత్యాచారామే కాదు రాజ్యం చేస్తున్న ఏ అత్యాచారమైన యాదృచ్ఛికంగా జరిగిన సంఘటన కాదనీ, ఇది పాలకవర్గాల అణచివేత విధానమని స్పష్టమవుతుంది. కనుకనే ఉద్యమ ప్రాంతాల్లోని మహిళలపై ఉద్యమ కారిణులపై అత్యాచార పరంపర విచ్చలవిడిగా కొనసాగుతోంది. ఈస్ట్ డివిజన్‌లో గతంలో ఎన్నో అత్యాచారాలు జరిగాయి. వీటిలో వెలుగులోకి రానివే అనేకం. మూడు సంవత్సరాల క్రితం గుంటూరు జిల్లా బొటుకులపాయలో ఆ తర్వాత ప్రకాశం జిల్లాలో గ్రేహౌండ్స్ బలగాలు మహిళలపై అత్యాచారం చేసిన సంఘటనలు వెలుగులోకి వచ్చినవి మాత్రమే. వెలుగులోకి వచ్చినప్పటికీ దోషులకు ఎన్నడూ శిక్షలు పడలేదు. ఇవన్నీ ఉద్యమ ప్రాంతాల్లో సాధారణ మహిళలపై, సానుభూతిపరులపై జరుగుతున్న అత్యాచారాలు, ఉద్యమకారిణులను పట్టుకొని అత్యాచారం చేసి బూటకపు ఎన్‌కౌంటర్లలో చంపిన, ఎన్‌కౌంటర్ స్థలాల్లో గాయపడిన మహిళా కామ్రేడ్స్‌ను సహితం అత్యాచారం చేసి చంపిన దురాగతాలు ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నెన్నో జగినాయి. ఇటువంటి సందర్భాల్లో సహజంగానే వెలుగులోకి వచ్చేవి తక్కువే ఉంటాయి. అలా వచ్చిన సందర్భాల్లో సహితం ఎన్నడూ కనీస విచారణ కూడా జరుగలేదు.

ప్రస్తుత సంఘటన కూడా బాధిత మహిళలు ముందుకు రాకపోతే వెలుగులోకి రాకుండానే కాల గర్భంలో కల్సిపోయేది. తరతరాల మన్యం పోరు చరితకు వారసులైన బాధిత మహిళలు తమకు జరిగిన అన్యాయాన్ని ప్రశ్నించడానికే సిద్ధపడ్డారు. అంతేకాదు రాష్ట్రంలోని మహిళా సంఘాలూ, ప్రజాసంఘాలూ, ప్రజాస్వామికవాదులూ, ప్రజలూ ఈ సంఘటనకు నిరసనగా విస్తృతంగా ఆందోళనలకు దిగారు.

దానితో ప్రభుత్వం మొక్కుబడి విచారణకు పూనుకుంది. అయితే అది దోషుల పక్షాన ఎంత నగ్నంగా నిలబడుతోందో

ప్రతీ అంశంలోనూ స్పష్టమవుతోంది. అత్యాచార ఆరోపణ వచ్చిన వెంటనే నిబంధనల ప్రకారం ఇరవై నాలుగు గంటల లోపల వైద్య పరీక్షలు చేయించాలి. కానీ ఈ సంఘటనలో అలా పరీక్షలు నిర్వహించడంలో పోలీసులు చాలా కాలయాపన చేశారు. అంతేకాదు విశాఖ కింగ్‌జార్జి ఆస్పత్రిలో కాకుండా అనకాపల్లిలో పరీక్షలు చేయించబూనుకున్నారు. ఎందుకంటే అనకాపల్లిలో వైద్య పరీక్షలు జరుపుతే పోలీసులు డాక్టర్లను బెదిరించి తమకు అనుకూలంగా ఫలితాలను రాబట్టుకోవచ్చనుకున్నారు. కానీ ప్రజా సంఘాలు వ్యతిరేకించడంతో తప్పనిసరై విశాఖలో నిర్వహించారు. అయితే సకాలంలో పరీక్షలు నిర్వహించనందున ప్రాథమిక పరీక్షల్లో అత్యాచారం రుజువుకాలేదు.

నేరం రుజువైతే దోషులను శిక్షిస్తాం అని ప్రభుత్వం చెప్తోంది. కానీ నేరం జరిగిందా లేదానేది తేలాలంటే విచారణ జరుపాలి. విచారణ జరపాలంటే ముందుగా దోషులను అరెస్టు చేయాలి. వారిని ఉద్యోగాల నుండి సైతం సస్పెండ్ చేయాలి. కానీ ప్రభుత్వం అటువంటిదేమీ చేయలేదు. కనీసం ఇంతవరకూ ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయలేదు. బాధితుల నుండి సమాచార సేకరణ చేయలేదు. నేరం జరిగిన ప్రదేశానికి వెళ్లి పరిశీలించలేదు. 'నిందితుల' పేర్లు కూడా ప్రకటించలేదు. (తమపై 21 మంది పోలీసులు అత్యాచారం చేశారని బాధితులు చెప్తున్నారు. కానీ ఆ పోలీసుల పేర్లు సహజంగానే వారు చెప్పలేరు. కాబట్టి ఆరోజు ఆ గ్రామానికి కూంబింగ్‌కు ఎవరెవరు వెళ్లారన్నది పోలీసు అధికారులే చెప్పాలి). ఈ తతంగం ఏమీ జరగకుండా నేరం రుజువయ్యేదెలా?

'నేరం రుజువైతే దోషులను శిక్షిస్తాం' అని ప్రభుత్వం అంటోంది. అంటే నేరం జరిగినట్టుగా సాక్ష్యాలు నిరూపించినపుడు దోషులను శిక్షిస్తాం అని అర్థం. బాధితులకు వ్యతిరేకంగా సాక్ష్యాలను తారుమారు చేయడం, వైద్య పరీక్షల్లో అబద్ధపు ఫలితాలను రప్పించడం ప్రభుత్వానికి పెద్ద కష్టం కాదు. అయితే అత్యాచార కేసుల్లో బాధితులు చెప్తున్న సాక్ష్యం ఆధారంగానే నేర విచారణ చేయవచ్చనీ, వైద్య పరీక్షా ఫలితాలు కీలకమైన సాక్ష్యం కాబోవని అనేక కేసుల్లో న్యాయస్థానాలు తీర్పులు చెప్పాయి. చట్టాన్ని పరిరక్షిస్తామని చెప్పే పోలీసు అధికారులూ, మంత్రులూ ఇంత కీలకమైన సాక్ష్యంగా పరిగణించవల్సిన బాధితుల ఆరోపణలను కొట్టిపడవేస్తూ మావోయిస్టుల కుట్రగా అభివర్ణించడం అనేది నేరస్తులకు కొమ్ముగాసే వారి పక్షపాత వైఖరిని తెలియజేస్తుంది.

ప్రభుత్వ, పోలీసు అధికారుల చట్ట ధిక్కారం ఇంతటితో ముగిసిపోలేదు. బాధితులు వైద్య పరీక్షల కోసం విశాఖ కె.జి.హెచ్ ఆసుపత్రిలో ఉన్నప్పుడు శ్రీదేవి అనే బాధితురాలిని పక్కకు పిలిచి సెల్ ఫోన్ ఇచ్చి ఆమె భర్త (అప్పటికి ఆమె భర్తను పోలీసులు అరెస్టు చేసి వున్నారు.) మాట్లాడినట్టుగా ఆమెతో ఎవరితోనో మాట్లాడించారు. కేసు వెనక్కి తీసుకోవాలనీ లేకుంటే పోలీసులు ఆమె భర్తను చంపుతారనీ ఆ ఫోన్లో మాటల సారాంశం. అంతేకాదు మహిళలు కేసు వెనక్కు తీసుకునేలా చూడమని వాకపల్లి గ్రామ పెద్దలపై కూడా పోలీసులు వత్తిడి తెచ్చారు.

నేరం చేసిన వాళ్లే విచారణ జరిపే ఏ సందర్భంలోనైనా న్యాయం ఎంత దారుణంగా హత్యకు గురవుతుందో, ఈ సందర్భంలోనూ అదే జరుగుతోంది.

అయితే ఈ సందర్భంలో బాధితులకు అండగా పలు మహిళా సంఘాలు, ప్రజాసంఘాలు విస్తృతమైన ఆందోళనను చేపట్టినాయి. సంఘాలే కాక ప్రజలూ, ప్రజాస్వామిక మేధావులూ బాధితులకు సంఘీభావాన్ని ప్రకటిస్తున్నారు. ఈ ఆందోళనను మరింత సంఘటితం, విస్తృతం చెయ్యడం ద్వారా మాత్రమే ప్రభుత్వ, పోలీసుల ఆకృత్యాలకు అడ్డుకట్ట వేయగలం.

అంతేకాదు తాము ఎదుర్కొన్న అవమానాన్ని మౌనంగా దిగమింగకుండా ధైర్యంగా నిలదీసిన వాకపల్లి మహిళల పోరాట స్ఫూర్తి ఎందరెందరికో ఆదర్శం కావాలి.

★

ఒక మహా రాక్షసుడిలా కనబడే అమెరికా సామ్రాజ్యవాదం అంతఃసారంలో మరణశయ్యపై పోరాటంలో వున్న కాగితం పులే. నేటి ప్రపంచంలో వాస్తవంగా ఎవరు ఎవరిని చూసి భయపడుతున్నారు? అమెరికా సామ్రాజ్యవాదానికి భయపడేది వియత్నాం ప్రజలూ, లావోటియన్ ప్రజలూ, కాంబోడియన్ ప్రజలూ, పాలస్తీనా ప్రజలూ, అరబ్బు ప్రజలూ లేదా ప్రపంచంలోని ఇతర దేశాల ప్రజలు కాదు. అమెరికా సామ్రాజ్యవాదమే ప్రపంచ ప్రజలను చూసి భయపడిపోతోంది. గాలికి ఆకులు గల గలమనగానే అది భీతిల్లిపోతోంది. ధర్మమైన ఆశయానికి పుష్కలంగా మద్దతు దొరుకుతుందనీ, అధర్మ ఆశయానికి స్వల్ప మద్దతు దొరుకుతుందనీ, ఒక బలహీనమైన దేశం ఒక బలమైన దేశాన్ని ఓడించగలదనీ అనేకానేక వాస్తవాలు రుజువు చేస్తున్నాయి. ఒక చిన్న దేశపు ప్రజలు పోరాటంలోకి దూకే సాహసం చేస్తే ఆయుధాలను చేపట్టడానికి సాహసిస్తే తమ దేశ భవిష్యత్తు తమ చేతులతోనే దృఢంగా పట్టుకోవడానికి సాహసిస్తే వారు ఖాయంగానే ఒక పెద్ద దేశ దురాక్రమణను ఓడించగలుగుతారు. ఇది చరిత్ర నియమం.

– మావో

# చుండూరు తీర్పు - ప్రజల పోరాట విజయం

చుండూరు కేసులో తీర్పు వెలువడింది. న్యాయస్థానం 21 మందికి యావజ్జీవ శిక్షనూ, మరో 35 మందికి యాడాది జైలు శిక్షను విధించింది.

ఆంధ్రప్రదేశ్ చరిత్రలో 'చుండూరు' ఒక హేయమైన గాయం. ఆ గాయం నుంచి చిమ్మిన నెత్తురు నిచ్చెన మెట్ల కుల వ్యవస్థలో అగ్రకులాల వేటకు గురైన పేద దళితులది. ఒక దారుణానికి పర్యాయపదంగా మారిన చుండూరు, గుంటూరు జిల్లాలోని ఒక గ్రామం. అగ్రకులాలకు డబ్బు బలం తోడయితే గ్రామం మీద ముఖ్యంగా పేద దళితుల మీద విచ్చల విడి అధికారానికి పాల్పడుతున్న చరిత్రను మనం గ్రామీణ ప్రాంతాల్లో చూస్తూనే వున్నాం. ఆ అధికారాన్ని దళితుల ఆత్మగౌరవం నిలదీసిన చోట రక్తపాతం చోటు చేసుకుంటున్న చరిత్రను కూడా మనం చూస్తూనే వున్నాం. చుండూరుదీ అదే చరిత్ర. 1991లో ఈ వూళ్లో అగ్రకులాలకూ దళితులకూ మధ్య కొన్ని ఘర్షణలు జరిగాయి. పోలీసు కేసులు కూడా నమోదయ్యాయి. ఈ ఘర్షణలను నివారించే పేరుతో వూళ్లో పోలీస్ పికెట్లు కూడా ఏర్పాటు చేశారు. 1991 ఆగస్టు 6న పోలీసులు నిందితులను అరెస్టు చేయడానికి గ్రామానికి వెళ్లారు. దళితులను అరెస్టు చేయడానికి దళిత వాడకూ వెళ్లారు. పోలీసులను చూసిన దళితులు పొలాల్లోకి పారిపోయారు. ఇది తెలుసుకున్న అగ్రవర్ణాల వారు దాదాపు నాలుగు వందల మంది పోగయి మారణాయుధాలు ధరించి పొలాల్లోకి వెళ్లి దళితులను వేటాడారు. ఈ వేటలో దొరికిన వారిని దొరికినట్టుగా గొడ్డళ్లతో నరికారు. ఈ మారణకాండలో 8 మంది దళితులు ప్రాణాలు కోల్పోయారు. చాలా మంది గాయపడ్డారు.

ఈ దారుణం సహజంగానే రాష్ట్రాన్ని కుదిపి వేసింది. ప్రజలూ, ప్రజాస్వామిక వాదులూ, ప్రజాసంఘాలు, దళిత సంఘాలు ఈ సంఘటనకు వ్యతిరేకంగా పెద్ద యెత్తున నిరసన చర్యలు చేపట్టారు. నేరస్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఫలితంగా 219 మందిపై కేసులు పెట్టారు.

సాక్షుల భద్రత దృష్ట్యా ఈ కేసు విచారణ కొరకు చుండూరులోనే న్యాయస్థానాన్ని ఏర్పాటు చేయాలని ప్రజా, దళిత సంఘాలు పోరాడాయి. దానితో ప్రభుత్వానికి ఏర్పాటు చేయకతప్పలేదు. చుండూరులోనే మృతులను ఖననం చేసిన రక్త క్షేత్రానికి సమీపంలో ఈ కోర్టు ఏర్పాటయింది. 135 మంది సాక్షులను విచారించిన మీదట 56 మందికి శిక్షను విధిస్తూ ఈ కోర్టు తీర్పు వెలువరించింది.

నేరం జరిగిన 16 సంవత్సరాలకు ఈ తీర్పు వెలువడింది. దేశంలో ఎక్కడయినా దళితుల మీద జరిగిన దాడులకు సంబంధించిన విచారణ నత్త నడక నడవడం యాదృచ్ఛికం ఏమీ కాదు. దళితులకు న్యాయం చేయడంలో పోలీసు స్టేషన్లకూ, కోర్టులకూ ఉన్న అనాసక్తే దీనికి కారణం. అగ్రవర్ణాల ప్రయోజనాలకు కొమ్ముగాసే పోలీస్‌స్టేషన్లు, న్యాయస్థానాలు కావాలని విచారణను ఆలస్యం చేసి కేసును నీరుగార్చుతాయి.

చుండూరు కేసులోనూ అదే జరిగింది. పోలీసు దర్యాప్తులో లోపం, కేసు పెట్టడంలో ఆలస్యం మూలంగా కొంతమంది దోషులు తప్పించుకోగల్గారు. మొత్తం దాడిలో పాల్గొన్న వారు దాదాపు 400 మంది. కానీ పోలీసులు 219 మంది పైననే కేసులు పెట్టారు. అంటే దాదాపు సగం మంది కేసు నుంచి తప్పించుకున్నట్టే నిందితులుగా తేలిన 219 మందిలో సైతం 7 గురిని పోలీసులు నేటికీ అరెస్టు చేయలేకపోయారు. న్యాయస్థానం కూడా 179 మంది నిందితులను విచారించి 56 మందిని మాత్రమే దోషులుగా తేల్చింది. అంటే మూడింట రెండు వంతుల మందిని నిర్దోషులుగా వదిలేసింది.

అయినప్పటికీ ఈ కేసులో విశేషంగా చెప్పుకోదగిన అంశాలున్నాయి. దళితుల మీద హత్యాకాండ జరిగిన సంఘటనలో, సంఘటన జరిగిన చోటనే న్యాయస్థానాన్ని ఏర్పాటు చేయడం దేశ చరిత్రలోనే మొదటిసారి. అంతేకాదు 21 మందికి యావజ్జీవంతో సహా 56 మందికి శిక్ష విధించిన ఈ తీర్పు కూడా చారిత్రాత్మకమైనదే.

ఈ కేసులో చోటు చేసుకున్న ఈ విశేషాలు యాదృచ్ఛికంగా జరిగినవి ఏమీకాదు. మృతుల కుటుంబాలు, దళిత, ప్రజాసంఘాలు, ప్రజాస్వామికవాదులు సుదీర్ఘకాలం పాటు నిరంతరాయంగా జరిపిన పోరాట ఫలితమిది. అడుగడుగునా సాక్షులకు అండగా ఉంటూ వారు నిర్భయంగా సాక్ష్యం చెప్పగలిగేలా ఈ సంఘాలు వారికి ధైర్యాన్నిచ్చాయి.

అయితే ఎంత చారిత్రాత్మక తీర్పులైనా ఇటువంటి దారుణాల్లో బాధితులకైనా, ప్రజలకైనా చిన్న ఉపశమనాన్ని

(.... 17వ పేజీ తరువాయి)

తిప్పికొట్టటంలో పి.ఎల్.జి.ఎ ఒక్కొక్క అడుగు ముందుకు వేస్తున్నది. పి.ఎల్.జి.ఎ తీసిన దెబ్బలు, ముఖ్యంగా రాణిబోధిలి ఘటన శత్రు శిబిరంలో తీవ్రమైన ప్రకంపనలు సృష్టించింది. శత్రువు తలపెట్టిన క్రూరమైన సల్వాజుడూం దాడి పట్ల పునరాలోచించుకోవలసిన స్థితిని కల్పించింది. దర్భాగూడ, ఎర్రబోరు ఘటనల్లో మహిళల్ని, పిల్లల్ని, అమాయకులను చంపారని, తను సాగించిన మారణకాండలన్నింటినీ మరచి దుష్ప్రచారం సాగించిన ప్రభుత్వానికి, సల్వాజుడూం నేతలు కర్మా తదితరులకు, జుడూం కార్యకర్తలపైనే దాడులు ఎందుకు జరుగుతున్నాయంటూ ఎదురైన ప్రశ్నకు సమాధానం లేక తేలు కుట్టిన దొంగ పరిస్థితి తయారైంది. సల్వాజుడూం నిజ స్వరూపం బహిర్గతమవుతూ, ప్రభుత్వం రాజకీయంగా అప్రతిష్ట పాలవుతున్న స్థితిలో ఊర్పల్ మెట్ట, తాడిమెట్ల ఘటనలు జరిగాయి. ఈ దెబ్బలతో శత్రువు పరిస్థితి మూలిగే నక్కపై తాటి పండు పడినట్లయింది. అప్పటి వరకు ప్రజల మీద దాడులకు ముందు ఉరికిన సల్వాజుడూం గూండాలు, ఎస్.పి.ఒలు క్యాంపులు దాటి బయటికి రావడానికి భయపడి, క్యాంపుల్లో కూడా రక్షణ లేదనే భీతికి గురై, బతికుంటే బలుసాకు తినవచ్చునని క్యాంపులు విడిచి పారిపోయారు. ప్రజలు, పి.ఎల్.జి.ఎ గెరిల్లాలు సంఘటితంగా చేపట్టిన ప్రతిఘటన శత్రువును తాత్కాలికంగా దాడులు ఆపుకోక తప్పని స్థితికి నెట్టింది.

మావోయిస్టు పార్టీ ఆవిర్భావం తర్వాత దేశవ్యాప్తంగా ఆశావహ దృక్పథంతో వున్న విప్లవ ప్రజానీకాన్ని ఉత్తేజితులను చేసిన, యావత్తు దేశాన్ని మావోయిస్టు ఉద్యమం వైపు దృష్టి మరలింపజేసిన, జహనాబాద్, గిరిడీ, ఉదయగిరి, రానిబోదిలి ఘటనల స్థాయిలో ఊర్పల్‌మెట్ట, తాడిమెట్ల దాడులు దేశ వ్యాప్తంగా విప్లవ ప్రజానీకంలో గొప్ప ప్రభావాన్ని కలిగించాయి. శత్రు శిబిరంలో భీతావహస్థితిని సృష్టించాయి. కళింగనగర్, సింగూర్, నందిగ్రాం మొదలైన దేశంలోని విభిన్న ప్రాంతాల్లో ఫాసిస్టు ప్రభుత్వ విధానాలకూ, సాయుధ బలగాల తుపాకులకు ఎదురొడ్డి పోరాడుతున్న పీడిత ప్రజానీకంలో నూతనోత్సాహాన్ని, పోరాట శక్తినీ నింపుతాయి.

ఇవి నిస్సందేహంగా శత్రువు ముఖంపై పి.ఎల్.జి.ఎ సాహసయోధులు చరిచిన బలమైన దెబ్బలు. విజయవంతమైన ఐక్య 9వ కాంగ్రెస్ ఇచ్చిన పిలుపుమేరకు పి.ఎల్.జి.ఎను పి.ఎల్.ఎగా, గెరిల్లా జోన్లను విముక్తి ప్రాంతాలుగా మార్చే కర్తవ్యాన్ని ముందుకు తీసుకుపోయే క్రమంలో గెరిల్లా యుద్ధం మొబైల్ యుద్ధంగా మారుతూ వేస్తున్న మొదటి అడుగులు ఊర్పల్ మెట్ట, తాడిమెట్ల ఘటనలు. ఇవి గెరిల్లా యుద్ధాన్ని మొబైల్ యుద్ధంగా మార్చే పి.ఎల్.జి.ఎ కర్తవ్యానికి గొప్ప స్ఫూర్తినందించే దాడులు. శత్రువును నిర్మూలించే ముఖా ముఖి యుద్ధంలో శత్రువుపైకి బెబ్బులిలా దూకి వీరోచితంగా పోరాడుతూ ప్రాణాలర్పించిన కామ్రేడ్ దూలాల్ సాహసం పి.ఎల్.జి.ఎ గెరిల్లా యోధులకు గొప్ప స్ఫూర్తి దాయకమైనది. రెండు ఘటనల్లో తీవ్రంగా గాయపడినప్పటికీ శత్రువును నిర్మూలించి విజయం సాధించేవరకు పోరాడిన కామ్రేడ్స్ పోరాటతత్వం గెరిల్లా యోధులకు రణోత్తేజాన్ని కలిగిస్తుంది.

ఈ దాడులతో కొన్ని పాఠాలను కూడా నేర్చుకోవలసి వుంది. దెబ్బ మీద దెబ్బ తింటున్న శత్రువు ఈ ఘటనల తర్వాత తన దాడి స్వభావాన్ని మార్చే నూతన ఎత్తుగడలు రూపొందిస్తున్నాడు. తన పథకాలు బహిర్గతం కాకుండా కట్టు దిట్టమైన జాగ్రత్తలు తీసుకుని మరింత పెద్ద దాడులకు సిద్ధమవుతున్నాడు. దుర్మార్గమైన యుద్ధాలు చేసే శత్రువు ఎంతటి పథకాలు రూపొందించినా ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుని, చైతన్య వంతమైన ప్రజల క్రియాశీల మద్దతు, భాగస్వామ్యం గల ప్రజా సైన్యం చేతిలో ఓటమికి గురికాక తప్పదు. అటువంటి ప్రజా విముక్తి సైన్యంగా మన పి.ఎల్.జి.ఎను అభివృద్ధి చేసుకుంటూ, ఐక్య (9వ) కాంగ్రెస్ అందించిన కర్తవ్యాన్ని పరిపూర్తి చేయడానికి కంకణబద్ధులమవుతూ, మనల్ని మనం తెలుసుకుని శత్రువును తెలుసుకుంటూ వంద యుద్ధాలను గెలుద్దాం.

★

---

మాత్రమే కల్గిస్తాయి. ఇటువంటి దారుణాలకు ఆస్కారం లేని సమాజం మాత్రమే ఎవరికైనా శాశ్వత ఉపశమనాన్ని ఇస్తుంది. దోపిడీ వర్గాలు తమ ప్రయోజనాలకోసం కులాన్ని పెంచిపోషిస్తున్నాయి. దళిత కులాల్ని అణచిపెట్టడంలో దానికి వర్గ ప్రయోజనాలున్నాయి. కనుక దోపిడీ వర్గానికి వ్యతిరేకంగా జరుగుతున్న వర్గ పోరాటంలో అసంఖ్యాకంగా పాల్గొనడం ద్వారానే దళితులు కుల అణచివేత నుండి సయితం విముక్తిని సాధించగలరు. అటువంటి పోరాటం మాత్రమే కారంచేడు, పదిరికుప్పం, చుండూరు, నీరుకొండ, వేంపెంట, ఖైర్లాంజిలను పునరావృతం కాకుండా చేస్తుంది.

★

# రచయిత్రి తస్లీమా నస్రీన్‌పై దాడిని ఖండించాలి!

తానే రాసిన షోద్ (ప్రతీకారం) నవల తెలుగు అనువాదాన్ని ఆవిష్కరించడం కోసం హైదరాబాద్‌కు వచ్చిన ప్రముఖ రచయిత్రి తస్లీమా నస్రీన్‌పై, పుస్తకావిష్కరణ సభలోనే దాడి జరగడం అనేది మన భావ ప్రకటనా స్వాతంత్ర్యపు దుస్థితిని తెలియజేస్తుంది.

'లజ్జ' నవల ద్వారా బంగ్లాదేశ్‌కు చెందిన ఈ బెంగాలి రచయిత్రి తెలుగు పాఠకులకు సహితం సుపరిచితురాలయింది. బంగ్లాదేశ్‌లో అల్ప సంఖ్యాకులైన హిందువులపై జరుగుతున్న అణచివేతను తస్లీమా ఈ నవలలో చిత్రీకరించింది. బంగ్లాదేశ్ ప్రభుత్వం ఈ నవలను నిషేధించింది, ఆమెను దేశం నుండి బహిష్కరించింది. అంతేకాదు ముస్లిం మహిళల హక్కుల కోసం పోరాడినందుకు మత ఛాందసవాదులు ముస్లిం వ్యతిరేకిగా ముద్ర వేస్తూ ఆమెను చంపి వేయాలని ఫత్వా జారీ చేశారు. దానితో ఆమె దేశం విడిచి గత పదమూడేళ్లుగా విదేశాల్లో తలదాచుకుంటోంది. గత సంవత్సర కాలంగా ఆమె కలకత్తాలో నివసిస్తోంది.

అయితే ఈ నిషేధాలూ, నిర్బంధాలు ఆమె కలాన్ని శక్తిహీనం చేయలేకపోయాయి. ముస్లిం ఛాందసవాదానికి ఎక్కుపెడుతూ ఆమె పలు నవలలు రాసింది. అయితే దాదాపు ఆ రచనలన్నీ నిషేధించబడ్డాయి. మత ఛాందస వాదుల కోపాగ్నికి గురయ్యాయి. కమ్యూనిస్టునని చెప్పుకునే పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం సహితం ఆమె రచనలు కొన్నింటిని నిషేధించింది.

తాజాగా ఆమె రాసిన షోద్ నవలను ఆవిష్కరిస్తున్న సమయంలో మజ్లిస్ పార్టీకి చెందిన ముగ్గురు శాసన సభ్యులు మరికొందరితో కలిసి వెళ్లి ఆమెపై దాడి చేసి కొట్టారు. తీవ్రంగా దుర్భాషలాడారు. అక్కడే వున్న జర్నలిస్టులు ఈ దాడిని అడ్డుకొని ఆమెను కాపాడారు. ఈసారి హైదరాబాద్ వస్తే చంపివేస్తామని కూడా దాడి చేసినవారు హెచ్చరించారు.

తస్లీమా తన రచనల ద్వారా వెలిబుచ్చిన భావాలతో అందరికీ ఏకీభావం ఉండకపోవచ్చు. అయినప్పటికీ ఆమె భావ ప్రకటన హక్కును ప్రతి ఒక్కరూ గుర్తించాలి. భావ ప్రకటనా స్వాతంత్ర్యం అనేది ప్రజాస్వామ్య వ్యవస్థకు ఆయువుపట్టు వంటిది. వివిధ భావాలను సంలీనం చేసుకోవడం ద్వారానే వ్యవస్థ ప్రజాస్వామీకరించబడుతుంది. అయితే వివిధ భావాలను ఆహ్వానించడంలో మన వ్యవస్థ ఎన్నడూ సహృదయతను పాటించలేదు. ఫలితంగా మన సమాజంలో భావ ప్రకటనా స్వాతంత్ర్యంపై దాడుల చరిత్ర సుదీర్ఘమైనది.

అందులో భాగంగా రచయితలపై, కళాకారులపై, చిత్రకారులపై, రచనలపై, కళారూపాలపై, నిర్బంధాలు, నిషేధాలూ విధించిన చరిత్ర సుదీర్ఘమైనదే. ముఖ్యంగా రాజ్యం, మతం వంటి సంస్థలు తమను వ్యతిరేకించే ఏ భావ వ్యక్తీకరణనూ సహించడం లేదు. ప్రజాస్వామిక పోరాటాలకు నిలయంగా వున్న ఆంధ్రప్రదేశ్‌లో సహితం, భావ ప్రకటనా స్వేచ్ఛను కాలరాయడంలో భాగంగా ప్రగతిశీల సాహిత్యాన్ని నిషేధించిన, రచయితలను నిర్బంధించిన చరిత్ర రాజ్యానికి వుంది.

మత దురహంకారంతో భావ ప్రకటనా స్వాతంత్ర్యంపై దాడులకు పాల్పడుతున్న సంఘటనలు మన దేశంలో సహజంగానే మెజారిటీ మతమైన హిందూమతం నుంచి జరుగుతున్నాయి. అయితే తక్కువ స్థాయిలోనే అయినప్పటికీ మైనారిటీ మతం నుంచి కూడా ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయనడానికి తస్లీమాపై దాడి ఒక నిదర్శనం.

ఏ మతమయినా ఉన్మాదస్థాయికి చేరితే ప్రజాస్వామ్య వ్యవస్థకు ముప్పు వాటిల్లుతుంది. అందుకే మతాన్ని మత్తు మందుగా అభివర్ణించాడు కారల్ మార్క్స్. అంతేకాదు మహిళలపై అణచివేతను ప్రయోగించడంలో అన్ని మతాలూ ఒకేతీరుగా ఉన్నాయి. అందులో భాగంగా ముస్లిం మతం స్త్రీలకు అనేక ఆంక్షలను విధిస్తోంది. కనుక ఒక స్త్రీ అటువంటి ఆంక్షలను ఛేదించుకోవడం, ఆ ఆంక్షలకు వ్యతిరేకంగా పోరాడ్డం అనేది ముస్లిం సాంప్రదాయకవాదులకు కంటగింపుగా వుంది. కనుకనే తస్లీమాపై భౌతిక దాడికి పాల్పడ్డారు.

ఈ దాడిని ప్రజాస్వామికవాదులంతా ఖండించాలి. భావ ప్రకటనా స్వాతంత్ర్యాన్ని కాలరాస్తున్న రాజ్య నిరంకుశత్వానికీ, మత మౌఢ్యానికీ వ్యతిరేకంగానూ పోరాడాలి. ఇటువంటి పోరాటమే మన సమాజంలో భావ ప్రకటనా స్వాతంత్ర్యానికి ఊతాన్నిస్తుంది. ★

*(.... 36వ పేజీ తరువాయి)*

ఉపయోగించుకుంటూ యువజన సంఘ కార్యకలాపాలను కొనసాగించాడు. ఈ క్రమంలో భూస్వాముల కంట్లో నలుసుగా మారాడు. దానితో భూస్వాములు కా. సోమన్నను అరెస్ట్ చేయించారు. పోలీసులు సోమన్నను చిత్రహింసలు పెట్టి కొద్ది రోజులకు వదిలేశారు.

పోలీసుల చిత్రహింసలు కామ్రేడ్ సోమన్నలోని విప్లవ దృఢత్వాన్ని మరింత పెంచాయే తప్ప తగ్గించలేదు. ఆ తర్వాత తన కార్యకలాపాలు మరింత ఉధృతం అయ్యాయి. ఆ క్రమంలో విప్లవావసరాన్ని గుర్తించి 1985లో పూర్తికాలం కార్యకర్తగా దళంలోకి రిక్రూట్ అయ్యాడు. చిట్యాల ఏరియాలో కా. సోమన్నది మొదటి రిక్రూట్. సోమన్న స్ఫూర్తితో ఆ తర్వాత చిట్యాల ఏరియాలో అనేక మంది రిక్రూట్ అయ్యారు, అవుతున్నారు కూడా.

## నిత్య నిర్బంధం నడుమ పోరుకు ఊపిరైన సాహసి

కా. సోమన్న రిక్రూట్ అయ్యేనాటికి వరంగల్ ఉద్యమంపై తీవ్ర అణచివేత కొనసాగుతోంది. ఆ నిర్బంధం మూలంగా ఉద్యమం బాగా దెబ్బతిని వుంది. ఆ సమయంలో రిక్రూట్ అయిన సోమన్న నర్సంపేట ఏరియాకు దళ సభ్యుడిగా వెళ్లాడు. నర్సంపేటలో పోలీసుల నిర్బంధంతో పాటు, ఓంకార్ నాయకత్వంలోని ఎం.సి.పి.ఐ గూండాల దాడులు దళాలపై తీవ్రంగా కొనసాగేవి. పోలీసుల నిర్బంధం, రివిజనిస్ట్ గూండాల దాడుల మూలంగా లొంగుబాట్లు కూడా తీవ్రంగా ఉండేవి. వీటన్నింటికి తోడు ఆనాడు మొత్తం పార్టీ సత్యమూర్తి సృష్టించిన సంక్షోభాన్ని ఎదుర్కుంటూ వుంది. అటువంటి కష్టకాలంలో ఆ ప్రాంతంలో ఆర్గనైజర్‌గా వున్న అమరుడు కామ్రేడ్ పైలా వెంకటరమణ మొక్కవోని దీక్షతో వంటరిగానే తిరుగుతూ ఉద్యమ నిర్మాణ కృషిలో నిమగ్నమై ఉండినాడు. కా. సోమన్న ఆ సమయంలో వెంకటరమణకు తోడయ్యాడు. ఒక సంవత్సరం తర్వాత నాచినపల్లి అనే గ్రామంలో ఒక ఇంట్లో ఈ ఇద్దరు కామ్రేడ్స్ షెల్టర్ తీసుకుంటుండగా ఎం.సి.పి.ఐ గూండాలు ఇచ్చిన సమాచారంతో పోలీసులు షెల్టర్‌పై దాడి చేశారు. ఈ దాడిని తమ వద్ద వున్న తపంచాలతో కామ్రేడ్స్ వెంకటరమణ, సోమన్నలు వీరోచితంగా ప్రతిఘటించారు. ఆ ప్రతిఘటనలో ఒక సి.ఐ, ఒక కానిస్టేబులూ చచ్చారు. అయితే పోలీసులు పిచ్చిగా జరిపిన కాల్పుల్లో కామ్రేడ్ వెంకటరమణ కూడా వీరమరణం పొందాడు. తమ నాయకుడు నేలకొరిగినప్పటికీ గుండె నిబ్బరం సడలకుండా ప్రతిఘటనను కొనసాగిస్తూ కా. సోమన్న తప్పుకున్నాడు. తప్పుకొని పోతున్న అతనిపై ఎం.సి.పి.ఐ గూండాలు వెంటపడ్డారు. ఆ గూండాలను కూడా ప్రతిఘటిస్తూ సోమన్న సురక్షితంగా తప్పించుకున్నాడు. అయితే ఆ తర్వాత అతనికి పార్టీ సంబంధాలు తెగిపోయాయి. అయినప్పటికీ బెంబేలు పడకుండా అదే ఏరియాలో ప్రజల మధ్యనే వుంటూ, రకరకాల పనులు చేసుకుంటూ ఆరు నెలల కాలంపాటు ఓపికగా వేచిచూస్తూ పార్టీ సంబంధాలను నెలకొల్పుకున్నాడు.

అలా పార్టీ పట్ల, ప్రజల పట్ల మొక్కవోని అంకిత భావంతో విప్లవ కృషి చేస్తూ 1987లో కేంద్ర ఆర్గనైజర్ అయ్యాడు. 1989 నాటికి వరంగల్ జిల్లా కమిటీ సభ్యుడయ్యాడు. 1993లో జిల్లా కార్యదర్శి బాధ్యతను చేపట్టాడు. 1995లో నూతనంగా ఏర్పడిన ఎన్.టి. ఎస్.జడ్.సిలో సభ్యుడయ్యాడు.

వరంగల్ జిల్లా కమిటీ సభ్యుడిగానూ, కార్యదర్శిగానూ ఉన్న సమయంలో జిల్లా ఉద్యమాన్ని పురోగమింప చేయడంలో తీవ్రమైన కృషి చేశాడు. జిల్లాలో జరిగిన అనేక భూపోరాటాలకు నేతృత్వం వహించి, భూస్వాముల మెడలు వంచి పేదలకు భూమిని స్వాధీనం చేశాడు. ముఖ్యంగా 1990 ప్రాంతంలో ఉవ్వెత్తున ఎగిసిన భూపోరాటాల్లో కా. సోమన్న ముఖ్యమైన పాత్ర వహించాడు. 1990లో వరంగల్‌లో జరిగిన చారిత్రాత్మక రైతుకూలీ సంఘం సభలకు సారధ్యం వహించాడు. ఆ తర్వాత రెండవ అణచివేత క్యాంపెయిన్ కొనసాగిన కాలంలో ప్రజలను అంటిపెట్టుకుంటూ, వారిని విప్లవోద్యమంలోకి సమీకరిస్తూ చేసిన కృషి సాధారణమైనది కాదు. ఆ సమయంలో నిరంతరం దళాలతోనే వుంటూ వారి ప్రతిఘటనా సామర్థ్యాన్ని పెంచాడు. ఆ నిర్బంధం మధ్యలోనే, జిల్లాలో గ్రామీణ ఉద్యమంతో పాటు, ఆ ఉద్యమానికి దన్నుగా సబ్ అర్బన్, పట్టణ ఉద్యమాలను నిర్మించడంలో, అప్పటికే నిర్మితమైన ఉద్యమాలను నిలబెట్టుకోవడంలో విశేషమైన కృషి చేశాడు. రైతాంగ ఉద్యమంతో పాటు కార్మిక, విద్యార్థి, మహిళా రంగాల్లో తీవ్రమైన కృషి చేసి ఉద్యమాలను నిర్మించాడు.

కా. సోమన్న జిల్లా కమిటీలోకి వచ్చేంత వరకూ రైతాంగ ఉద్యమంతో తప్ప మరే ఉద్యమంతోనూ సంబంధం లేదు. అయినప్పటికీ తీవ్రమైన కృషి ద్వారా పట్టణ ఉద్యమాన్ని, కార్మిక, విద్యార్థి, మహిళా రంగాలనూ నడిపే సామర్థ్యాన్ని అలవర్చుకున్నాడు. వివిధ కవర్ ఆర్గనైజేషన్లను నడపడంలో సైతం నైపుణ్యాన్ని అలవర్చుకున్నాడు. 96 తర్వాత శత్రువు తలపెట్టిన బహుముఖ దాడిని ఎదుర్కొంటూనే ఈ కృషి కొనసాగింది.

## రివిజనిజంపై నిప్పులు చెరిగిన కమ్యూనిస్టు

కా. సోమన్న ఉద్యమ కృషిలో విశేషంగా చెప్పుకుని తీరాల్సినది - తాను నిరంతరం రివిజనిస్టులతో చేసిన రాజీ లేని పోరాటం. తాను దళ సభ్యుడిగా వున్నపుడు మొదలుపెట్టిన ఆ పోరాటం తన ఉద్యమ జీవితం పొడుగూతా కొనసాగింది. నర్సంపేట ఏరియాలో ఎం.సి.పి.ఐ రివిజనిజంతో ఢీకొన్న కా. సోమన్న పోరాటం, ఆ తర్వాత జిల్లా వ్యాప్తంగా, జోన్ వ్యాప్తంగా, సి.పి.ఐ, సి.పి.ఎం, ప్రజాపంథాల రివిజనిజాన్ని నిరంతరం తిప్పికొడుతూ కొనసాగింది. ఆర్గనైజేషనల్‌గా ఈ పార్టీల రివిజనిస్టు చర్యలను ఎండగట్టడమే గాక, సిద్ధాంతపరంగా వారితో గట్టిగా పోరాడ్డానికి అవసరమైన సైద్ధాంతిక జ్ఞానాన్ని పెంచుకున్నాడు. తన రచనలూ, ఉపన్యాసాలూ, బోధనలూ, చర్చల ద్వారా ఈ పార్టీల రివిజనిజాన్ని నిరంతరం బహిర్గతం చేసేవాడు.

## ఉద్యమ అవసరాలకనుగుణంగా పదునెక్కిన ఆయుధం

ఉద్యమావసరాలకు అనుగుణంగా ఏ బాధ్యతలు స్వీకరించడానికైనా కా. సోమన్న వెనుకాడలేదు. ఆ బాధ్యతలను స్వీకరించి తీవ్రమైన కృషీ, పట్టుదల ద్వారా తనలో సమర్థతలు పెంచుకొని ఉద్యమావసరాలను తీర్చడం అనేది కా. సోమన్న విప్లవ జీవితంలో కొట్టొచ్చినట్టుగా కనబడే అంశం. జిల్లా కమిటీలో ఉన్నప్పుడే ఉద్యమావసరాల రీత్యా పలు రంగాలను నడిపిన కా. సోమన్న రాష్ట్ర కమిటీ సభ్యుడిగా కొద్దికాలం పాటు పత్రికా రంగాన్ని నడిపాడు. ఎన్.టి. ఎస్.జడ్.సి అధికార పత్రిక అయిన 'ప్రజా విముక్తి'కి బాధ్యుడిగా ఉండి, పత్రిక ద్వారా క్యాడర్‌కు రాజకీయ జ్ఞానాన్ని అందించడంలో కృషి చేశాడు. కొద్ది కాలంపాటు తుపాకుల యూనిట్ బాధ్యతలను సహితం స్వీకరించాడు. ఆ బాధ్యతలో వుండి తుపాకుల ఉత్పత్తిని పెంచడంలో, ప్రాక్టీస్‌కు అనుకూలమైన తుపాకులను తయారు చేయడంలో, యూనిట్‌కు నాయకత్వం అందించాడు. 1998-99 కాలంలో పశ్చిమ కరీంనగర్ డివిజన్ బాధ్యతలను స్వీకరించి, రాష్ట్ర కమిటీ సభ్యుడిగా వుంటూనే ఆ డివిజన్‌కు కార్యదర్శిగా సైతం వ్యవహరించాడు. ఆ తర్వాత మళ్లీ వరంగల్ జిల్లా బాధ్యతలు స్వీకరించాడు. అమరుడయ్యేనాటికి, రెండు సంవత్సరాలుగా తను రాష్ట్ర వ్యాప్త ప్రజాసంఘాలకు నేతృత్వం వహిస్తున్నాడు. మొదట్లో కామ్రేడ్ సోమన్న రాజకీయ పాఠాలు చెప్పడానికి ఇబ్బంది పడేవాడు. కానీ పట్టుదలతో ఆ ఇబ్బందిని అధిగమించాడు.

## మిలటరీ రంగంపై జిజ్ఞాస

పలు రంగాల్లో సమర్థతలను కనబరిచిన కా. సోమన్న మిలటరీ విషయాల్లోనూ సమర్థవంతుడే. మొదటి నుంచీ నిత్య నిర్బంధంలో విప్లవాచరణను కొనసాగించిన తను, మిలటరీ సంబంధిత విషయాల్లో సమర్థతలు సాధించడంలో ఆశ్చర్యమేమీ లేదు. తనలోని ఆ సమర్థతల వల్లే ధర్మారావుపేట, లింగంపల్లి, మీదికొండ, వన్‌పల్లి, రాంపూర్, డోలి వంటి పదుల సంఖ్యలో జరిగిన ఎన్‌కౌంటర్లలో దృఢంగా పోరాడుతూ, మిగితా కామ్రేడ్స్‌ను కూడా పోరాడే విధంగా చేశాడు. పలు ఎన్‌కౌంటర్లలో కమాండర్‌గా వ్యవహరించాడు. ఐలాపూర్ వద్ద ప్రెస్ మీద దాడి జరిగినప్పుడు క్యాంపంతా రెండు గంటల దూరం దాకా రిట్రీట్ అయిన తర్వాత ఒక అయిదుగురితో కూడిన టీంను మళ్లీ ఎదురు దాడికి పంపి క్యాడర్ అందరినీ ఉత్తేజపరిచాడు. ఆదిలాబాద్ జిల్లా బెల్లంపల్లి రైల్వే స్టేషన్‌పై గెరిల్లాలు చేసిన దాడికి కా. సోమన్న కమాండర్‌గా వ్యవహరించాడు. కా. సోమన్న ఏనాడూ మిలటరీ నిర్మాణాలలో సభ్యుడిగా లేడు. అయినప్పటికీ మిలటరీ సంబంధ విషయాలపై ఆసక్తినీ, సృజనాత్మకతనూ ప్రదర్శించేవాడు. డైరక్షనల్ మైన్ల తయారీలో తన పాత్ర వుంది. పలు మిలటరీ చర్యలు చేయడానికి వున్న అవకాశాలను చర్చించేవాడు. పేలుడు పదార్థాల పట్ల తనకు అమితమైన ఆసక్తి వుండేది. సృజనాత్మకమైన ఆలోచనలు చేసేవాడు. అలాగే ప్రస్తుత ఉద్యమావసరానికి అనుగుణంగా ఎటువంటి మిలటరీ ఫార్మేషన్లు తీసుకోవాలని నిరంతరం ఆలోచించేవాడు.

అలాగే ప్రస్తుతం ఎన్.టి ఉద్యమం ఎదుర్కొంటున్న ఆటు స్థితి నుండి బయటపడ్డానికి ఎటువంటి ఎత్తుగడలను రూపొందించుకోవాలనే విషయంలో నిరంతరం సంఘర్షణ పడేవాడు.

## అనేక జ్ఞానాల మేళవింపు

కామ్రేడ్ సోమన్నకు సాహిత్య రంగంలోనూ ప్రవేశమున్నది. పలు విషయాలపై తను 'సాక్షి' పేరుతో కవితలూ, 'సునీల్' పేరుతో వ్యాసాలు రాసేవాడు. తను వున్న చోట రాజకీయ చర్చలు నిరంతరం నడిచేవి. క్యాడరంతా చర్చల్లో పాల్గొనేలా ప్రోత్సహించేవాడు. చర్చాగోష్ఠిలు నిర్వహించేవాడు.

కా. సోమన్న గ్రామంలో వున్నప్పుడు సైకిల్ షాపు నడిపేవాడు. సైకిల్లు బాగు చేయడంతో పాటు రేడియోలు, ఇంజన్లు బాగు చేయడం నేర్చుకున్నాడు. వైద్యం చేయడం కూడా నేర్చుకున్నాడు. ఇలా రకరకాల పనులు నేర్చుకోవాలనే, చేయాలనే తపన ఆ తర్వాత తను ఉద్యమంలోకి ప్రవేశించిన తర్వాత కూడా కొనసాగింది. అందులో భాగంగా ఉద్యమ జీవితంలోనూ పలు విషయాలనూ, పనులనూ నేర్చుకుని తనకు నిర్దిష్ట బాధ్యత లేనప్పటికీ పలు రకాల సేవలందించాడు. తనకు తుపాకులను

బాగు చేయడంలో మంచి నైపుణ్యం వుండేది. కాబట్టి డి.సి.ఎంగా వున్నపుడు తను ఏ దళం దగ్గరికి వచ్చినా ఆ దళం దగ్గర పాడైపోయి వున్న తుపాకులను బాగు చేసేవాడు. తోటి కామ్రేడ్స్ ఎదుర్కొనే అనారోగ్యాలకు శ్రద్ధగా వైద్యం చేసేవాడు, వైద్య సలహాలు ఇచ్చేవాడు.

ఆచరణ, సిద్ధాంత అధ్యయనం ద్వారా తన జ్ఞానాన్ని సంపద్వంతం చేసుకున్న కా. సోమన్న 1996లో జరిగిన ప్రత్యేక మహాసభలోనూ, 2001లో జరిగిన 9(2)వ కాంగ్రెస్‌లోనూ పాల్గొని తన అభిప్రాయాలను చర్చించడం ద్వారా పార్టీ పంథాను సుసంపన్నం చేయడంలో తన వంతు పాత్రను పోషించాడు.

ఇలా పలు రంగాల్లో తన సేవలందించడం ద్వారా ఎన్.టి ఉద్యమంలో ముఖ్యమైన పాత్రను పోషించిన కా. సోమన్న అంత ఆరోగ్యపరుడేం కాదు. నిత్య నిర్బంధం, కఠోర శ్రమల మూలంగా తన ఆరోగ్యం దెబ్బతిన్నది. కాళ్ల నొప్పులు తీవ్రంగా వేధించేవి. తన అనారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని, కొద్దిగా వెసులుబాటు ఉండే ప్రాంతానికి మారమని పార్టీ సలహా ఇచ్చినప్పటికీ, ఎటువంటి వెసులుబాటునూ కోరుకోని సోమన్న అందుకు సిద్ధపడలేదు.

### ఆదర్శవంతమైన వైవాహిక జీవితం

కా. సోమన్న వైవాహిక జీవితం కూడా ఆదర్శవంతమైనదే. ఉద్యమ ప్రవేశానికి ముందే వివాహితుడైన కా. సోమన్న సహచరి మొదట్లో వెనుకబాటు భావాలను కల్గి వుండేది. కనుక సోమన్న ఉద్యమంలో పని చేయడాన్ని వ్యతిరేకించేది. ఆమె అభీష్టానికి విరుద్ధంగానే ఉద్యమంలోకి వచ్చిన అతను ఆ తర్వాత చైతన్యవంతమైన కృషి ద్వారా ఆమెలో విప్లవ భావాలను మొలకెత్తించాడు. ఫలితంగా 1991లో కా. సోమన్న సహచరి ఉద్యమంలోకి వచ్చింది. తీవ్ర అనారోగ్యంతో బాధపడే ఆమెను ఉద్యమంలో నిలబెట్టడంలో కా. సోమన్న ఎంతో ఓపిగ్గా కృషి చేశాడు.

### కామ్రేడ్ సోమన్న ఆశయాలు కొనసాగిస్తాం

ఇలా నిరంతర తపనతో కూడిన తన ఆచరణ ద్వారా పార్టీకి విలువైన అనుభవాలను అందించి, ప్రజల, క్యాడర్ హృదయాల్లో చెరిగిపోని ముద్రను వేసిన కా. సోమన్నను హత్య చేసి పాలకవర్గాలు చరిత్రకు తీరని ద్రోహం చేశాయి. అయితే వీరుల త్యాగం వృథా పోదు. కా. సోమన్నలోని కృషినీ, పట్టుదలనూ అలవర్చుకొని అతని ఆశయ సాధనలో మరింత దృఢంగా నడుస్తూ నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేద్దాం. సోమన్న కన్న కలలను నిజం చేద్దాం. ఆ విధంగా చరిత్రకు పాలకవర్గాలు తలపెట్టిన ద్రోహాన్ని తుత్తునియలు చేద్దాం. అదే కా. సోమన్నకు మనం ఇవ్వగలిగిన నివాళి.

★

## ఈస్ట్ డివిజన్‌లో పేట్రేగిపోతున్న పోలీసు ఆగడాలు

ఆంధ్రా-ఒరిస్సా సరిహద్దు ప్రాంతంలో పోలీసుల ఆగడాలు పేట్రేగిపోతున్నాయి. ముఖ్యంగా ఈస్ట్ డివిజన్‌లో ఉద్యమానికి బలమైన గ్రామాలపై తరచూ దాడులు చేస్తూ యువతను ఎత్తుకొని పోయి వారి ఆచూకి తెలియకుండా చేస్తున్నారు. ఈ సంవత్సరం మార్చి నెలలో మంప పంచాయితీలోని టీటీరాళ్ల, పి.గంగవరంలలో, దుప్పిలవాడ పంచాయితీలోని పలు గ్రామాల్లో పలువురు యువతను పోలీసులు తమతో తీసుకెళ్లారు. ఆ తర్వాత తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్లో విచారిస్తే పోలీసులు తాము ఎవరినీ అరెస్టు చేయలేదని బుకాయిస్తున్నారు. ఇలా కన్నబిడ్డలా, ఆప్తుల ఆచూకీ తెలియక తల్లిదండ్రులూ, బంధువులు కంటతడి పెడుతూనే వున్నారు. ఈ పోలీసుల వైఖరిని జానారెడ్డి దృష్టికి తీసుకుపోయినప్పటికీ పరిస్థితిలో మార్పురాలేదు. పోలీసులు తమ పిల్లలకు యూనిఫారాలు తొడిగి అడవుల్లో రూట్ గైడర్స్‌గా ఉపయోగించుకుంటున్నారనీ, ఏ క్షణంలో ఏ అఘాయిత్యానికి పాల్పడతారోనని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. రోజులు గడిచినప్పటికీ కొందరి ఆచూకీ తెలియడం లేదు. సీలేరు సమీపంలోని అల్లూరి కోట గ్రామంలో పోడు పనిలో వున్న నలుగురు యువతీ యువకులను పట్టుకొని ఇష్టం వచ్చినట్లుగా కొట్టారు. ఆ తర్వాత వారిని ఆలివ్ గ్రీన్ దుస్తులను వేసుకొని పరుగెత్తమని వత్తిడి చేసారు. కానీ వారు దానికి అంగీకరించకపోవడంతో మరోసారి విపరీతంగా కొట్టారు. దాంతో వారు ప్రస్తుతం లేవలేని స్థితిలో వున్నారు. ఇలా పోలీసులు అనేక గ్రామాలపై పడి యువతను ఎత్తుకుపోతున్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ వారిని ఉద్యమానికి దూరం చేయాలనే ఎత్తుగడలలో భాగమే ఈ పోలీస్ చర్యలు. అయితే పోలీస్ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ప్రజలు పలు ఆందోళనలకు దిగుతున్నారు. పలుచోట్ల మండల కార్యాలయాల ఎదుట పెద్ద ఎత్తున ధర్నాలు చేశారు. మంప పంచాయితీలోని పలు గ్రామాల యువకులు మండల కేంద్రంలోని వీధుల్లో అర్ధనగ్న ప్రదర్శనలు చేశారు. ప్రదర్శన అనంతరం మండల కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నాలు చేశారు. ఈ ధర్నాలో వృద్ధులూ, పిల్లలు సహితం పాల్గొన్నారు. ఇలా ఆదివాసీ ప్రజానీకాన్ని వేధిస్తున్న పోలీసుల వైఖరిని ప్రజలూ, ప్రజాస్వామికవాదులు తీవ్రంగా ఖండించాలి.

# పోరు నింగిలో అరుణకాంతిని వెదజల్లే తొలిపొద్దు

# కామ్రేడ్ సోమన్న

ఉత్తర తెలంగాణా చరిత్రంటే పోరాటాల చరిత్ర, సాహసాల చరిత్ర, త్యాగాల చరిత్ర. ఈ చరిత్రను తన పోరాటాలతో, తన సాహసాలతో, తన త్యాగంతో మరింత సంపద్వంతం చేశాడు కామ్రేడ్ సోమన్న.



కా. సోమన్న మావోయిస్టు పార్టీ ఉత్తర తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు. ఉద్యమావసరాల రీత్యా బెంగుళూరు వెళ్లిన ఈ కామ్రేడ్‌ను ఎ.పి. ఎస్.ఐ.బి పోలీసులు జూన్ 29వ తేదీన బెంగుళూరులో పట్టుకొని చిత్రహింసలు పెట్టి జూలై 1వ తేదీన ఉదయం వరంగల్ జిల్లా తాడ్వాయి సమీపంలో హత్య చేసి ఎదురుకాల్పుల కట్టు కథ అల్లారు. కా. సోమన్న అమరత్వపు వార్త తెలిసి ఉత్తర తెలంగాణా ప్రాంతంలోనే కాక రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలూ, ప్రజా సంఘాల కార్యకర్తలూ, పార్టీ శ్రేణులు తీవ్ర దుఃఖంలో మునిగిపోయారు. ఇది బూటకపు ఎన్‌కౌంటరనీ, తిరిగి పోస్టుమార్టం జరపాలనీ ప్రజాసంఘాలు ఉద్యమించాయి. దానితో ప్రభుత్వానికి తిరిగి పోస్ట్‌మార్టం చేయక తప్పలేదు. తిరిగి పోస్ట్‌మార్టం చేసిన తర్వాత కా. సోమన్న బంధువులూ, విప్లవ ప్రజానీకం తరలివచ్చి మృతదేహాన్ని తన స్వగ్రామానికి తీసికెళ్లారు. వేలాది ప్రజలు కన్నీటి నివాళులతో, విప్లవ నినాదాలతో కా. సోమన్నకు అంత్యక్రియలు జరిపారు. తన ఆశయాన్ని కొనసాగిస్తామని ప్రతిన బూనారు.

25 ఏళ్ల పాటు అకుంఠిత దీక్షతో విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకుపోతూ ఆ క్రమంలో తన జీవితాన్నే త్యాగం చేసిన కా. సోమన్నకు ఎర్రెర్రని జోహార్లర్పిద్దాం. అతని ఆశయాన్ని తుదకంటా కొనసాగించడానికి మరింత దృఢంగా ముందుకు నడుద్దాం.

## అన్యాయాన్నెదిరించగ ఆయుధమెత్తిన యోధుడు

కామ్రేడ్ సోమన్నది పోరాటాల ఖిల్లాగా పేరుగాంచిన వరంగల్ జిల్లా. చిట్యాల మండలంలోని టేకుమట్ల అతని స్వగ్రామం. ఒక ధనిక రైతు కుటుంబంలో దాదాపు 48 సంవత్సరాల క్రితం పుట్టిన కా. సోమన్నకు తల్లిదండ్రులు పావయ్య అని పేరు పెట్టుకున్నారు. అతనికి ఇద్దరు సోదరులు. గీసుకొండలో పాఠశాల విద్యను పూర్తి చేసిన కా. సోమన్న, పరకాలలో ఇంటర్ చదివాడు. ఇంటర్ పూర్తయిన వెంటనే, 18 సంవత్సరాలకే అతనికి పెళ్లయింది.

టేకుమట్ల గ్రామంలో భూస్వాముల పీడన బాగా ఉండేది. అయితే కా. సోమన్నది మొదటి నుంచీ అన్యాయాన్ని వ్యతిరేకించే స్వభావం. అందువల్ల భూస్వాముల దౌర్జన్యాలను నిరంతరం ఎదిరిస్తూ ఉండేవాడు. తాను ఒక్కడే ఎదిరించడం కాక తనలాంటి యువకులను ఐక్యం చేసి యూత్ క్లబ్‌ను స్థాపించి, దాని ఆధ్వర్యంలో భూస్వాముల అన్యాయాలను ఎదిరించేవారు. నాటికల వంటి కళారూపాల ద్వారా భూస్వాముల దోపిడీని కళ్లకు కట్టినట్టు చూపించేవారు.

1980 నుంచి చిట్యాల ఏరియాలో నాటి పీపుల్స్‌వార్ పార్టీ ఆధ్వర్యంలో భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు ప్రారంభమయ్యాయి. సారా వ్యతిరేక పోరాటాలూ, కూలీ రేట్ల పోరాటాలు, పాలేర్ల జీతాల పెంపు పోరాటాలు ఊపందుకున్నాయి. మొదటి నుండీ సామాజిక స్పృహ ఉన్న కా. సోమన్నను సహజంగానే ఈ పోరాటాలు ఆకర్షించినయి. వెంటనే పార్టీ సంబంధాల్లోకి వచ్చి గ్రామంలో రాడికల్ యువజన సంఘాన్ని ఏర్పాటు చేసాడు. యూత్ క్లబ్ కవర్‌నే

*(తరువాయి 33వ పేజీలో.....)*